ఆంధ్రజ్యోతి

www.andhrajyothy.com
ANDHRAJYOTHI

ఆదివారం | 15-2-2026 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 340 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి సా.5:05 తదుపరి చతుర్దశి. నక్షత్రం: ఉత్తరాషాఢ రా.7:48 తదుపరి శ్రవణం, వర్జ్యం: రా.11:58-1:38, దుర్ముహూర్తం: సా.4:41-5:27, అమృతఘడియలు: మ.12:59-2:41, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:45, సూర్యాస్తమయం: 6:13 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేనే రాజు.. నేనే మంత్రి అదే నిజమా!



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, వైసీపీలు ఘన విజయం సాధించాయి. రెండు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలైన కాంగ్రెస్, తెలుగుదేశం కోలుకుంటాయా? అన్న సందేహాన్ని రాజకీయ విశ్లేషకులు వెలిబుచ్చారు. కాలం గిర్రున తిరిగి సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. రెండు రాష్ట్రాల్లోనూ అధికార పార్టీలు చతికిలపడ్డాయి.

> ‘తెలంగాణలో నేనే రాజు - నేనే మంత్రి’ అని రేవంత్ రెడ్డి ప్రకటించిన రెండో రోజే వెలువడిన మునిసిపల్ ఎన్నికల ఫలితాలు ముఖ్యమంత్రి మాటల్లో నిజం లేకపోలేదన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి.

గతంలో ఏ కాంగ్రెస్ నాయకుడూ సాహసించని విధంగా వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి ప్రకటించుకున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడకపోవచ్చుగానీ... మునిసిపల్ ఎన్నికల ఫలితాలతో నిరసన వ్యక్తం చేయలేని అసహాయ స్థితి ఏర్పడింది.

> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటే తమకు లెక్కలేదని చెప్పడానికే బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారు తప్ప తమకు దూరమైన ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేయలేదు. కేసీఆర్‌ను కాళేశ్వరం, టెలిఫోన్ ట్యాపింగ్ కేసులలో విచారణకు పిలిపించడం జరిగింది. కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణను టచ్ చేసినట్టే... అనే మాటలే నిజమైతే ఈ విచారణ తర్వాత సానుభూతి పెల్లుబికి మునిసిపల్ ఎన్నికల్లో ఎంతో కొంత ప్రతిఫలించాలి కదా?

కేవలం అహంకారం కారణంగానే గత ఎన్నికల్లో కేసీఆర్ ఓడిపోయారని ఆయన కుమార్తె కవిత రెండు రోజుల క్రితం విమర్శించారు. అధికారం తలకెక్కి అహంకారంతో వ్యవహరిస్తూ ప్రశ్నించిన వారిపై కత్తి దూశారని కవిత చేసిన విమర్శలను తేలికగా తీసుకోవడానికి లేదు. బీఆర్ఎస్‌ను విమర్శిస్తున్న కవితను కూడా ఇప్పుడు తెలంగాణ ద్రోహి అంటారేమో తెలియదు. మునిసిపల్ ఎన్నికల్లో తమకు ఓటు వేయని ప్రజలను కూడా తెలంగాణ ద్రోహులు అని నిందిస్తారా?

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..

గ్రూప్-1 అక్రమాలపై ‘సిట్’

సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో ఏర్పాటు

దర్యాప్తు పూర్తిచేసి మార్చి 16లోపు హైకోర్టుకు నివేదిక 3

ఆత్మవిశ్వాసంతో భారత్

ఆస్ట్రేలియా మహిళలతో నేడు తొలి టీ20

మ. 1.45 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

సిడ్నీ: మరో నాలుగు నెలల్లో.. అంటే జూన్‌లో మహిళల టీ20 వరల్డ్ కప్ జరగనుంది. ఈ టోర్నీ సన్నాహకంలో భాగంగా ఆస్ట్రేలియా మహిళలతో భారత జట్టు మూడు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. అందులో మొదటి మ్యాచ్ ఆదివారం ఇక్కడ జరగనుంది. అయితే ఇది మల్టీ ఫార్మాట్ సిరీస్. మూడు టీ20లతోపాటు మూడు వన్డేలు, ఏకైక టెస్ట్‌లో భారత్-ఆస్ట్రేలియా అమీతుమీ తేల్చుకోనున్నాయి. కొద్దికాలం కిందట వన్డే ప్రపంచ కప్ గెలిచిన హర్మన్‌ప్రీత్ సేన..ఈ సిరీస్‌కు ఇనుమడించిన ఉత్సాహంతో బరిలో దిగుతోంది.

ఐర్లాండ్ రికార్డు స్కోరు

ఒమన్‌పై భారీ గెలుపు


టకర్ (94 నాటౌట్)

కొలంబో: కెప్టెన్ లోర్కాన్ టకర్ (51 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సలతో 94 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో చెలరేగడంతో.. ఈ టీ20 వరల్డ్‌కప్‌లో ఐర్లాండ్ రికార్డు స్కోరుతో అదరగొట్టింది. దీంతో గ్రూప్-బిలో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 96 పరుగులతో ఒమన్‌పై ఘన విజయం సాధించింది. తొలుత ఐర్లాండ్ 20 ఓవర్లలో 235/5తో భారీ స్కోరు చేసింది. ఈ టోర్నీలో ఓ జట్టుకిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. గారెత్ డిలానె (56), జార్జ్ డాక్రెల్ (35 నాటౌట్) రాణించారు. షకీల్ అహ్మద్ 3 వికెట్లు తీశాడు. ఛేదనలో ఒమన్ 18 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. అమీర్ కలీమ్ (50), హమద్ మీర్జా (46) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. జోష్ లిటిల్ 3 వికెట్లు పడగొట్టగా.. మాథ్యూ హమ్‌ఫ్రేస్, బారీ మెకార్తీలకు చెరో 2 వికెట్లు దక్కాయి. కాగా, వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడిన ఒమన్ సూపర్-8 రేసు నుంచి అవుటైంది.

ప్రమోద్ భగత్‌కు రికార్డు స్వర్ణం



మనామా (బహ్రెయిన్): భారత పారా షట్లర్ ప్రమోద్ భగత్ వరుసగా నాలుగో వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణాన్ని సొంతం చేసుకొన్నాడు. శనివారం ఇక్కడ జరిగిన పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్ పురుషుల ఎస్ఎల్3 ఫైనల్లో 37 ఏళ్ల భగత్ 21-12, 21-18తో మహ్మద్ అలీ ఇమ్రాన్ (ఇండోనేసియా)పై గెలిచాడు. అలాగే, సుఖాంత్‌తో కలిసి భగత్ డబుల్స్‌లోనూ స్వర్ణం గెలిచాడు. భగత్‌కు ఇది రికార్డుస్థాయిలో ఆరో వరల్డ్ చాంపియన్‌షిప్ సింగిల్స్ స్వర్ణం. ఈ క్రమంలో చైనా దిగ్గజం లిన్ డాన్ ఐదు సింగిల్స్ స్వర్ణాల రికార్డును భగత్ అధిగమించాడు.

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

కళ్లన్నీ అటే

భారత్-పాక్ పోరు నేడు

టీ20 వరల్డ్‌కప్


మ్యాచ్‌కు వరుణుడి ముప్పు

ప్రాక్టీస్‌లో అర్ష్‌దీప్, తిలక్


బరిలోకి అభిషేక్

ఆ ఒక్క మ్యాచ్.. ఐసీసీకి వేల కోట్ల ఆదాయాన్నిస్తుంది.
ఆ ఒక్క మ్యాచ్.. ప్రసారకర్తలపై కనకవర్షాన్ని కుమ్మరిస్తుంది.
ఆ ఒక్క మ్యాచ్.. ఆతిథ్య బోర్డు ఖజానాను ఆర్థిక పరిపుష్టిని చేస్తుంది.
ఆ ఒక్క మ్యాచ్.. క్రికెట్ ప్రేమికులను మునివేళ్లపై నిలబెడుతుంది.
ఆ ఒక్క మ్యాచ్.. వంద కోట్లకు పైగా భారతీయుల భావోద్వేగాలను రెండింతలు చేస్తుంది.

అవును.. భారత్-పాకిస్థాన్ క్రికెట్ పోరు గురించే ఇదంతా. పాక్ క్రికెట్ బోర్డు వింత పోకడలతో ఈసారి టీ20 విశ్వకప్‌లో దాయాదుల పోరు జరుగుతుందా? లేదా? అనే సందేహం నెలకొన్నా.. అదంతా పటాపంచలైంది. అంతా అనుకూలించి కొలంబోలో నీ ప్రతాపమో.. నా ప్రతాపమో తేల్చుకుందామంటూ ఇరు జట్లు సమరభేరికి సిద్ధమయ్యాయి. ఇప్పుడు అందరి కళ్లన్నీ ఈ ఫైట్‌పైనే: మరి.. భీకర ఫామ్‌లో ఉన్న టీమిండియా అందరి అంచనాలను అందుకుంటుందా? అనిశ్చితికి మారుపేరైన పాక్ సంచలనం సృష్టిస్తుందా? తేలేది నేడే.

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో హైఓల్టేజ్ పోరుకు అంతా సిద్ధం. టోర్నీ ఆరంభమై వారం రోజులైనా ఏదో వెలితిగా భావిస్తున్న ఫ్యాన్స్‌కు మజా పంచేందుకు భారత్, పాకిస్థాన్ జట్లు స్థానిక ప్రేమదాస స్టేడియంలో ఆదివారం ముఖాముఖి బరిలోకి దిగుతున్నాయి. రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించిన తరుణంలో ఐసీసీ టోర్నీల్లో మినహా ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు ఎప్పుడో ఆగిపోయాయి. ఇక గతేడాది ఆసియాకప్‌లో పాక్ ఆటగాళ్లతో షేక్ హ్యాండ్ వివాదం విబేధాలను మరింత పెంచింది. దీనికి తోడు ఆ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్‌కు ఆసియా క్రికెట్ మండలి చైర్మన్ హోదాలో మొహిసిన్ నఖ్వీ ఇప్పటిదాకా కప్ అందించలేదు. పైగా బంగ్లాదేశ్‌కు మద్దతుగా మెగా టోర్నీలో టీమిండియాతో మ్యాచ్ ఆడమంటూ పాక్ బాయ్‌కాట్ డ్రామా సరేసరి. ఇన్ని పరిణామాల మధ్య జరుగుతున్న ఈ అత్యంత ఆసక్తికర మ్యాచ్‌లో ఏ జట్టుది పైచేయి కానుందో మరికొన్ని గంటల్లో తేలనుంది. ఈ టోర్నీ చరిత్రలో ఇప్పటిదాకా భారత్ 7-1తో పాక్‌పై తిరుగులేని ఆధిక్యంలో ఉంది.

ఫేవరెట్ హోదాలో..

పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో పాక్‌పై భారత జట్టు వరుసగా ఎనిమిది మ్యాచ్‌లను గెలిచింది. దీంతో ఈసారి కూడా ఫేవరెట్‌గానే భావిస్తున్నారు. కానీ పాక్‌తో మ్యాచ్ అంటే ఒత్తిడి కచ్చితంగా ఉంటుంది. పైగా గతంలో ఎదుర్కోని స్పిన్నర్ తారిఖ్ అహ్మద్ జట్టుకు సవాల్‌గా మారనున్నాడు. బంతిని విసిరినట్టుగా ఉండే అతడి బౌలింగ్ శైలి ఇప్పటికే చర్చనీయాంశమైంది. స్పిన్‌కు అనుకూలించే పిచ్‌పై భారత బ్యాటర్లు అతడిని ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది. ఇక డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శనివారం నెట్స్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాక్టీస్ చేయడం కనిపించింది. అంతా సవ్యంగా జరిగితే అభిషేక్ విశ్వరూపం చూడవచ్చు. అతను బరిలోకి దిగితే శాంసన్ బెంచీకే పరిమితం కానున్నాడు. మరోవైపు గత రెండు మ్యాచ్‌ల్లో మిడిలార్డర్ నిరాశపర్చింది. కానీ, ఇషాన్, అభిషేక్, సూర్యకుమార్‌ల పుణ్యమా అంటూ జట్టుకు రెండు విజయాలు లభించాయి. పిచ్‌ను బట్టి జట్టులోకి మూడో స్పిన్నర్‌గా కుల్దీప్‌ను తీసుకోవచ్చు. గత ఆసియాకప్ ఫైనల్లో అతను పాక్‌పై 4 వికెట్లతో రాణించాడు. అయితే ఇందుకు పేసర్ అర్ష్‌దీప్‌పై వేటు పడొచ్చు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిపై భారత్ ఎక్కువగా ఆధారపడి ఉంది.


బాబర్ ఆజమ్
కెప్టెన్ సల్మాన్ ఆఘా

పాక్‌తో సవాల్

స్పిన్నర్ తారిఖ్‌పై అందరి దృష్టి


వరుణ్


ఉస్మాన్ తారిఖ్

వాస్తవానికి ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్‌కు అనుకూలత ఎక్కువ. ఎందుకంటే హైబ్రిడ్ విధానం వల్ల ఆ జట్టు తమ అన్ని మ్యాచ్‌లను కొలంబోలోనే ఆడుతోంది. అయితే రెండు మ్యాచ్‌లను ఎస్ఎస్‌సీ మైదానంలో ఆడగా.. ప్రేమదాసలో మాత్రం ఇదే తొలి మ్యాచ్. పైగా జట్టులో ఉస్మాన్ తారిఖ్, సయిమ్ అయూబ్, ఎబ్రార్ అహ్మద్, షాదాబ్ ఖాన్, నవాజ్‌ల రూపంలో ఐదుగురు నాణ్యమైన స్పిన్నర్లున్నారు. తారిఖ్ సైడ్ ఆర్మ్ బౌలింగ్‌తో అదరగొడుతున్నాడు. బ్యాటింగ్‌లో ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ భారత్‌తో మ్యాచ్ అంటే చెలరేగుతాడు. ఫర్హాన్.. ఆసియా కప్‌లో పేసర్ బుమ్రా బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొని భారీ సిక్సర్లతో బెదరగొట్టాడు. ఆల్‌రౌండర్లు అయూబ్, ఫహీమ్ అష్రాఫ్‌లతో పాటు వెటరన్ బాబర్ ఆజమ్ బ్యాటింగ్ కీలకం కానుంది. ఇద్దరు స్పెషలిస్ట్ స్పిన్నర్లు ఎబ్రార్, తారిఖ్‌లతో పాటు ఇద్దరు ప్రధాన పేసర్లు షహీన్, సల్మాన్ మీర్జాలతో జట్టు బౌలింగ్ పటిష్టంగా ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, ఇషాన్, తిలక్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, దూబే, రింకూ, అక్షర్, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా.

పాకిస్థాన్: సాహిబ్జాదా, సయిమ్ అయూబ్, సల్మాన్ ఆఘా (కెప్టెన్), బాబర్ ఆజమ్, షాదాబ్, ఉస్మాన్ ఖాన్, సల్మాన్ మీర్జా, ఫహీమ్ అష్రాఫ్, షహీన్ అఫ్రీది, ఉస్మాన్ తారిఖ్, ఎబ్రార్ అహ్మద్.

కరచాలనం చేసుకుంటారా?

టాస్ సమయంలో భారత్-పాక్ కెప్టెన్లు సూర్యకుమార్, సల్మాన్ ఆఘా ఈసారైనా కరచాలనం చేసుకుంటారా? లేదా? అనే సస్పెన్స్ కొనసాగుతోంది. ఇదే విషయమై కెప్టెన్లను మీడియా అడిగితే.. 'దానిపై అంత ఆసక్తి ఎందుకు? మరో 24 గంటలు వేచిచూడండి' అని సూర్య బదులిచ్చాడు. 'మ్యాచ్ దాకా ఎదురుచూడాల్సిందే'నంటూ సల్మాన్ చెప్పాడు. గతేడాది పహల్గాంలో దాడి తర్వాత ఆసియాకప్‌లో భారత జట్టు పాక్ ప్లేయర్లతో షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే.

వానా వానా వద్దప్పా!

భారత్-పాక్ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానుల ఉత్సాహంపై వరుణుడు నీళ్లు జల్లే అవకాశం లేకపోలేదు. శ్రీలంక వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. ఆదివారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. దీంతో ఈరోజు సాయంత్రం స్టేడియం పరిసర ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం 70 శాతంగా ఉంటుందని అంచనా. అదే జరిగితే మ్యాచ్ నిర్వహణ సందేహమే. వర్షంతో మ్యాచ్ రద్దయితే, ఇరుజట్లకు చెరో పాయింట్ దక్కుతుంది. టోర్నీ నిబంధనల ప్రకారం గ్రూప్ దశలో మ్యాచ్‌లకు రిజర్వ్ డే లేదు. అందుకే మ్యాచ్‌కు వరుణుడు అడ్డు పడొద్దన్నది ఫ్యాన్స్ కోరిక.

నేటి మ్యాచ్‌లు	వెస్టిండీస్ X నేపాల్ (ఉ. 11 గం. నుంచి)
	నమీబియా X అమెరికా (మ.3 గం.)
	భారత్ X పాకిస్థాన్ (రా.7 గం.)

సఫారీల హ్యాట్రిక్


మార్‌క్రమ్ (86 నాటౌట్)

- మార్‌క్రమ్ మెరుపు ఇన్నింగ్స్
- కివీస్ పరాజయం

అహ్మదాబాద్: టీ20 వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా అదరగొడుతోంది. కెప్టెన్ మార్‌క్రమ్ (44 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 86 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించడంతో.. శనివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్లతో నెగ్గింది. సఫారీలకిది వరుసగా మూడో విజయం. దీంతో దక్షిణాఫ్రికా జట్టు గ్రూప్ 'డి'లో ఆరు పాయింట్లతో దాదాపు సూపర్ '8' బెర్త్ ఖాయం చేసుకున్నట్టే. ముందుగా కివీస్ 20 ఓవర్లలో 175/7 స్కోరు చేసింది. చాప్‌మన్ (48), మిచెల్ (32), ఆలెన్ (31), నీషమ్ (23 నాటౌట్) రాణించారు. పేసర్ యాన్సెన్‌కు 4 వికెట్లు దక్కాయి. ఛేదనలో సౌతాఫ్రికా 17.1 ఓవర్లలో 178/3 స్కోరు చేసి గెలిచింది. మిల్లర్ (24 నాటౌట్), రికెల్టన్ (21), బ్రెవిస్ (21), డికాక్ (20) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా యాన్సెన్ నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు: న్యూజిలాండ్: 20 ఓవర్లలో 175/7 (చాప్‌మన్ 48, మిచెల్ 32, ఆలెన్ 31, నీషమ్ 23 నాటౌట్; యాన్సెన్ 4/40); **దక్షిణాఫ్రికా:** 17.1 ఓవర్లలో 178/3 (మార్‌క్రమ్ 86 నాటౌట్, మిల్లర్ 24 నాటౌట్; రచిన్ 1/9, నీషమ్ 1/15).

ఇంగ్లండ్ ఆశలు సజీవం

స్కాట్లాండ్‌పై 5 వికెట్ల విజయం


బాంటన్ (63 నాటౌట్)

కోల్‌కతా: ఆదిల్ రషీద్ (3/36), టామ్ బాంటన్ (63 నాటౌట్) సత్తా చాటిన వేళ కీలకమైన మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ఇంగ్లండ్ ఐదు వికెట్లతో స్కాట్లాండ్‌పై విజయం సాధించింది. గత పోరులో వెస్టిండీస్‌పై ఓడిన ఇంగ్లిష్ జట్టు సూపర్-8కు ముందంజ వేయాలంటే శనివారంనాటి మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక..ఈ గ్రూప్ 'సి' మ్యాచ్‌లో తొలుత స్కాట్లాండ్ 19.4 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో బాంటన్, బెతెల్ (32) ఆదుకోవడంతో ఇంగ్లండ్ 18.2 ఓవర్లలో 155/5 స్కోరు చేసి నెగ్గింది. బాంటన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు: స్కాట్లాండ్: 19.4 ఓవర్లలో 152 ఆలౌట్ (రిచీ బెరింగ్టన్ 49, మైకేల్ జోన్స్ 33, టామ్ బ్రూస్ 24, ఆలివర్ డేవిడ్‌సన్ 20 నాటౌట్, ఆదిల్ రషీద్ 3/36, ఆర్చర్ 2/24, డాసన్ 2/34); **ఇంగ్లండ్:** 18.2 ఓవర్లలో 155/5 (టామ్ బాంటన్ 63 నాటౌట్, బెతెల్ 32, కర్రాన్ 28, డేవిడ్‌సన్ 1/12, బ్రాడ్ కర్రీ 1/21).

నేటినుంచి రంజీ ట్రోఫీ సెమీఫైనల్స్	
	ఉత్తరాఖండ్ X కర్ణాటక
	బెంగాల్ X జమ్మూ కశ్మీర్

బిజినెస్ ప్లస్


బ్యాంకు డిపాజిట్లపై జర జాగ్రత్త

పరిమితి దాటితే ఐటీ నోటీసులు

ప్రస్తుత రోజుల్లో ఎవరూ ఇంటి వద్ద ఎక్కువ నగదు ఉంచుకునేందుకు ఇష్టపడరు. ఉంచుకుంటే ఎప్పుడు ఏ దొంగోడు వచ్చి కన్నమేస్తాడో తెలియదు. దీంతో చాలా మంది మధ్య తరగతి ప్రజలు తమ వద్ద ఉన్న నగదులో ఎక్కువ భాగాన్ని ఎప్పుడంటే అప్పుడు వెనక్కి తీసుకునేందుకు తమ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేసేందుకు ఇష్టపడతారు. ఈ డిపాజిట్లు ఒక పరిమితికి లోబడి ఉంటే ఓకే. పరిమితి దాటితే మాత్రం తిప్పలు తప్పవు. ఆ పరిమితి దాటిని డిపాజిట్ల వివరాలను బ్యాంకులు తప్పనిసరిగా ఆదాయ పన్ను (ఐటీ) శాఖకు తెలియజేస్తాయి. అప్పుడు ఈ ఆదాయం ఎలా వచ్చిందో చెప్పండి అంటూ ఐటీ అధికారులు నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడం మంచిది.

పారదర్శకత

పరిమితికి మించి చేసే పెద్ద డిపాజిట్లన్నీ చట్ట విరుద్ధం కాదు. ఒకవేళ ఐటీ అధికారులు అనుమానించి నోటీసులు జారీ చేస్తే.. ఆ డిపాజిట్లకు అవసరమైన ఆదాయం ఎలా వచ్చిందో డిపాజిటర్లు పారదర్శకంగా, చక్కగా వివరించగలిగి ఉండాలి. చెప్పుకోదగ్గ స్థాయిలో డిపాజిట్ల మొత్తం ఉంటే ఆ ఆదాయం ఎలా వచ్చిందో చెప్పమని అడిగే హక్కు పన్ను అధికారులకు ఉంటుందని ఇటీవల ఢిల్లీలోని ఆదాయ పన్ను శాఖ అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఐటీఏటీ) స్పష్టం చేసింది. డిపాజిట్లకు సంబంధించిన ఆదాయానికి స్పష్టమైన రికార్డుల ఆధారం కూడా ఉండాలి. లేకపోతే ఐటీ శాఖ దాన్ని పన్నుల ఎగవేత కోసం లెక్కల్లో చూపని నల్లధనంగా పరిగణిస్తుంది.



రూ.10 లక్షల నిబంధన

ప్రతి వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకటి లేదా అంతకు మించిన బ్యాంకు ఖాతాల్లో రూ.10 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. అంతకు మించితే మాత్రం బ్యాంకులు, సహకార బ్యాంకులు ఆ విషయాన్ని ఐటీ శాఖకు తెలుపుతాయి. అప్పుడు ఐటీ శాఖ ఆ డిపాజిట్లకు అవసరమైన ఆదాయం ఎలా వచ్చిందో చెప్పండి అంటూ నోటీసులు జారీ చేస్తుంది. అప్పుడు అన్ని ఆధారాలతో ఆ ఆదాయం ఎలా వచ్చిందో ఐటీ అధికారులకు వివరించాలి. ఆస్తుల అమ్మకం, వ్యాపార లాభాలు లేదా చట్టబద్ధమైన బహుమతుల ద్వారా... ఇలా ఎలా వచ్చినా దానికి సంబంధించిన వివరాలు రికార్డులతో సహా ఐటీ అధికారులకు సమర్పించాలి.

నగదు విత్‌డ్రాయల్స్‌పైనా జాగ్రత్త

నగదు డిపాజిట్లే కాదు. బ్యాంకుల నుంచి ఒకేసారి లేదా తరచూ పెద్ద మొత్తంలో నగదు విత్‌డ్రా చేస్తున్నా ఐటీ అధికారుల కన్ను పడే ప్రమాదం ఉంది. ఈ నగదు విత్‌డ్రాయల్స్ మీ ప్రకటిత ఆదాయ వనరులకు మించి ఉంటే బ్యాంకులే ఆ విషయాన్ని ఐటీ అధికారులకు తెలియజేస్తాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మీ నగదు విత్‌డ్రాయల్స్‌కు సంబంధించిన అన్ని రికార్డులు దగ్గర ఉంచుకోవడం మంచిది. ఇలా అన్ని రికార్డులు ఉంచుకుంటే ఐటీ అధికారులు అడిగే అన్ని ప్రశ్నలకు డాక్యుమెంటరీ సాక్ష్యాలతో సమాధానం చెప్పవచ్చు.

పారదర్శకతే ఆయుధం

ఆదాయ పన్ను శాఖ నోటీసుల నుంచి తప్పించుకోవాలంటే నిజాయితీ, స్పష్టత అత్యంత ముఖ్యం. ఎప్పుడూ మన ఆదాయాన్ని స్పష్టంగా వెల్లడించాలి. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ లావాదేవీల కోసం డిజిటల్ చానల్స్ ఉపయోగించుకోవాలి. చట్టపరమైన అన్ని నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి. ఇలా చేస్తే మనశ్శాంతితో పాటు ఆర్థికంగా మన పేరు ప్రతిష్ఠలు కూడా పెరుగుతాయి.

నోటీసులు అందితే ఏం చేయాలి?

ఐటీ శాఖ నుంచి నోటీసులు అందినంత మాత్రాన ఆ వ్యక్తి తప్పు చేసినట్టు కాదు. అప్పుడు ఏమి చేయాలంటే..

- గాభరా పడకుండా ప్రశాంతంగా కూర్చుని ఏ ప్రత్యేక కారణంతో నోటీసు జారీ చేశారో తెలుసుకోవాలి.
- ఆదాయ వనరులను తెలిపే బ్యాంకు స్టేట్‌మెంట్లతో పాటు ఆదాయ వనరులను తెలిపే ఆస్తుల అమ్మకం పత్రాలు, వ్యాపార ఆదాయమైతే అందుకు సంబంధించిన రికార్డులు, బహుమతుల వివరాలు ఐటీ అధికారులకు సమర్పించాలి.
- ఆలస్యం చేయకుండా అన్ని వివరాలు అధికారులకు సమర్పించాలి. నోటీసులకు ఆలస్యంగా స్పందిస్తే జరిమానా కూడా పడే అవకాశం ఉంది.
- నిర్ణీత సమయంలో ఆదాయానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు సమర్పిస్తే చాలా వరకు సమస్య నుంచి బయట పడవచ్చు.

నోటీసులు తప్పించుకునే మార్గాలు

డిపాజిట్లకు సంబంధించిన అన్ని లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి. ఇందుకు ఈ కింది చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయి.

- ఏటా బ్యాంకులు, సహకార బ్యాంకుల్లో చేసే డిపాజిట్ల మొత్తం రూ.10 లక్షలు మించకుండా చూసుకోవాలి.
- పెద్ద మొత్తంలో నగదు డిపాజిట్ చేస్తుంటే ఆ ఆదాయం ఎలా వచ్చిందో స్పష్టమైన రికార్డులు కలిగి ఉండాలి.
- యూపీఐ, నెఫ్ట్ లేదా ఆర్‌టీజీఎస్ వంటి డిజిటల్ లావాదేవీల ద్వారా మనం చేసిన చెల్లింపులన్నీ డిజిటల్ రూపంలో భద్రంగా ఉంటాయి.
- ఐటీ రిటర్న్‌లో ఆదాయ మార్గాల వివరాలన్నీ వెల్లడించటం మంచిది.
- ఐటీ అధికారులు పంపిన నోటీసుల్ని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దు. వెంటనే సానుకూలంగా సమాధానం ఇవ్వాలి.

నాట్కో నుంచి సెమాగ్లుటైడ్ ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టైప్-2 మధుమేహం, ఊబకాయం చికిత్సల్లో ఉపయోగించే ఔషధం 'సెమాగ్లుటైడ్'కు జనరిక్ వెర్షన్ తయారీతోపాటు దాన్ని భారత్‌లో విక్రయించేందుకు హైదరాబాద్‌కు చెందిన నాట్కో ఫార్మా లిమిటెడ్‌కు అనుమతి లభించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) నుంచి తమకు ఈ అనుమతి లభించిందని నాట్కో వెల్లడించింది. జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజక్షన్‌ను ఈ మార్చిలో మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ తెలిపింది.

భారత్‌లో భారీ డిమాండ్: అంతర్జాతీయ ఔషధ దిగ్గజం నోవో నార్డిస్క్.. ఒజెంపిక్, వెగోవీ, రైబెల్సస్ పేర్లతో విక్రయిస్తున్న సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్లకు భారత్‌లో భారీ డిమాండ్ నెలకొంది. ఈ మార్చితో దీని పేటెంట్ హక్కుల కాలపరిమితి ముగియనుండటంతో నాట్కోతో పాటు పలు దేశీయ ఫార్మా కంపెనీలు జనరిక్ సెమాగ్లుటైడ్ వెర్షన్లను మన మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాయి..

- **ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్**

ఓల్డ్ బ్రిడ్జ్ మ్యూచువల్ ఫండ్.. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ డైనమిక్ ఈక్విటీ ఫండ్. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈ ఫండ్ లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. సిప్ రూపంలో అయితే రూ.1,000. ముగింపు తేదీ ఈ నెల 23.

- **బరోడా బీఎన్‌పీ పరిబా ఈఎస్‌జీ ఫండ్**

బరోడా బీఎన్‌పీ పరిబా మ్యూచువల్ ఫండ్.. ఈఎస్‌జీ బెస్ట్-ఇన్-క్లాస్ ఈఎస్‌జీ ఫండ్‌ను ప్రారంభించింది. పటిష్ఠమైన సస్టెయినబిలిటీ ప్రమాణాలను పాటిస్తున్న కంపెనీలను ఎంపిక చేసుకుని దీర్ఘకాలంలో సంపద సృష్టించే విధంగా ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. నిఫ్టీ 100 ఈఎస్‌జీ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.1,000.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	525
వరంగల్	517	గోదావరి	510
చిత్తూరు	583	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 75	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	115
వరంగల్	115	గుంటూరు	115
కరీంనగర్	115	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	95
కర్నూలు	115	నెల్లూరు	100
విశాఖపట్నం	115	అనంతపురం	100
గోదావరి	115		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,57,750 ▲	1,44,600 ▲	2,80,000 ▼
విజయవాడ	1,60,000 ▲	1,48,000 ▼	2,54,800 ▼
విశాఖపట్నం	1,57,750 ▼	1,44,600 ▲	2,80,000 ▼
రాజమండ్రి	1,57,750 ▲	1,44,600 ▲	2,49,000 ▼
ప్రొద్దుటూరు	1,58,000 ▲	1,45,360 ▲	2,55,500 ▼
ముంబై	1,52,765 ▼	1,39,933 ▼	2,42,433 ▼

వాణిజ్య భవనాలను అద్దెకు ఇస్తుంటే..?

ఇదీ GST


రాంబాబు గొండాల

హరి ఒక ప్రభుత్వ ఉద్యోగి. తాను పొదుపు చేసిన డబ్బుతో ఒక మంచి ఏరియాలో కొంత స్థలం కొన్నాడు. కొన్నేళ్లలో ఆ ఏరియా ఒక మంచి వాణిజ్య ప్రాంతంగా రూపుదిద్దుకుంది దాంతో తాను కొన్న స్థలంలో ఒక బిల్డింగ్ కట్టి ఒక కార్పొరేట్ కంపెనీకి అద్దెకు ఇచ్చాడు. దీని అద్దె సంవత్సరానికి రూ.20 లక్షలు దాటుతుంది అనుకుందాం. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం వాణిజ్య భవనాలకు 18 శాతం చొప్పున పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే అద్దె రూ.20 లక్షలు దాటుతుంది. కాబట్టి హరికి రిజిస్ట్రేషన్ పొందటానికి కానీ పన్ను చెల్లించటానికి ఎలాంటి మినహాయింపు లేదు. కానీ, హరికి ఇప్పటి వరకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ లేదు. జీఎస్‌టీ గురించి ఎలాంటి అవగాహన లేదు. మరి దీని కోసం హరి జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ తీసుకోవాలా? ఈ సమస్య ఒక్క హరికే కాదు చాలా మందికి ఉంటుంది.

జీఎస్‌టీ చట్టంలో మార్పులు

ఈ ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జీఎస్‌టీ చట్టంలో కొన్ని మార్పులు చేసింది. దీని ప్రకారం జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ లేని వ్యక్తి తన వాణిజ్య భవనాన్ని లేదా వాణిజ్య సముదాయాన్ని లేదా అందులో భాగాన్ని ఏదేనీ కంపెనీకి లేదా వ్యాపార సంస్థకు అద్దెకు ఇచ్చి.. సదరు వ్యాపార సంస్థ లేదా కంపెనీకి జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ ఉంటే ఆ అద్దెపై జీఎస్‌టీ చెల్లించాల్సిన బాధ్యత కూడా అద్దె చెల్లించే సంస్థదే. అంటే పై ఉదాహరణలో హరికి జీఎస్‌టీలో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. సదరు కార్పొరేట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ ఉన్నట్లయితే సంబంధిత జీఎస్‌టీ చెల్లించాల్సిన బాధ్యత ఆ సంస్థదే. దీన్ని రివర్స్ చార్జ్ మెకానిజం అంటారు. మరి ఆ కంపెనీకి ఆ మేర నష్టం కదా అంటే.. ఎంత మాత్రం ఉండదు. ఎందుకంటే ఆ మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు. అంటే ఉదాహరణకు నెలకు రూ.2 లక్షల అద్దె అనుకుంటే, ఇంతకు ముందు కంపెనీ హరికి రూ.2 లక్షలు దానిపైన జీఎస్‌టీ రూ.36,000 కలిపి చెల్లించేది. హరి రూ.2 లక్షలు ఉంచుకుని ప్రభుత్వానికి రూ.36,000 చెల్లించేవాడు. కంపెనీ తాను చెల్లించిన రూ.36,000 ఐటీసీ రూపేణా తీసుకునేది. అయితే ఇందులో కొంత క్లిష్టత ఉండేది. హరి తొలుత రిజిస్ట్రేషన్ పొందాలి. నెలవారీ రిటర్నులు దాఖలు చేయాలి. తాను పొందిన అద్దెను సక్రమంగా చూపుతూ ప్రభుత్వానికి సంబంధిత జీఎస్‌టీ సరిగా కట్టాలి. అంటే హరి విధివిధానాలను సరిగ్గా పాటించలేకపోతే సదరు కంపెనీ ఐటీసీ పొందలేదు. ఇప్పుడు ప్రవేశపెట్టిన కొత్త విధానంలో హరి రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సిన అవసరం లేదు. అలాగే కంపెనీ కూడా ఐటీసీ పొందటం సులువు.

10 షాపులు అద్దెకి ఇస్తే..

మరి ఇలా ఒక కంపెనీకి కాకుండా హరి తన బిల్డింగ్‌ను ఒక 10 షాపుల కింద విభజించి 10 మందికి అద్దెకు ఇచ్చాడనుకుందాం. అప్పుడు అద్దెకు తీసుకున్న అందరికీ రిజిస్ట్రేషన్ ఉంటే రివర్స్ చార్జ్ మెకానిజం కిందకు అందరూ వస్తారు. అందరు వారివారి అద్దెకు సంబంధించి జీఎస్‌టీ చెల్లిస్తారు. మరి అందులో కొందరికి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ లేకుంటే? అప్పుడు బిల్డింగ్ ఓనర్‌కు ఎంత అద్దె వస్తుందో చూడాలి. ఒకవేళ అద్దె మొత్తం రూ.20 లక్షలు దాటితే అప్పుడు బిల్డింగ్ ఓనర్ రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. ఎప్పుడైతే రిజిస్ట్రేషన్ తీసుకుంటాడో.. అప్పుడు రివర్స్ చార్జ్ మెకానిజం వర్తించదు. అంటే, అన్ని షాపులకు బిల్డింగ్ యజమాని జీఎస్‌టీ చెల్లించాలి. అద్దెకు తీసుకున్న వ్యక్తులకు జీఎస్‌టీ ఉన్నా లేకున్నా. క్లుప్తంగా చెప్పాలంటే వాణిజ్య భవనాల అద్దెకు సంబంధించి రివర్స్ చార్జ్ అనేది ఓనర్‌కు రిజిస్ట్రేషన్ లేకుండా అద్దెకు తీసుకున్న వ్యక్తికి రిజిస్ట్రేషన్ ఉన్నప్పుడే అమలవుతుంది. అయితే రిజిస్ట్రేషన్ తీసుకోవటానికి కేవలం అద్దె మాత్రం కాకుండా ఇతర ఆదాయాన్ని కూడా చూడాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గుంటూరు సిటీ

ANDHRAJYOTHI

ఆదివారం | 15-2-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిగ్ ఫైట్

భారత్-పాక్ పోరు నేడే

జోష్‌లో సూర్య సేన


ప్రతీకార వేటలో పాక్

మ్యాచ్‌కు వరుణుడి ముప్పు!

టీ20 ప్రపంచ కప్‌లో కీలక మ్యాచ్

- స్పోర్ట్స్ పేజీలో





శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

'ఇప్పుడున్న పరిస్థితుల్లో... ఇదే మంచి బడ్జెట్'...

ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్య!

'మన ఆర్థికం ఇంకా మెరుగుపడలేదు'...

ఇది ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మాట!

ఈ క్లిష్టమైన పరిస్థితుల మధ్యనే... కూటమి ప్రభుత్వం 3.32 లక్షల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.

వైఎస్ జగన్ హయాంలో ఐదేళ్లపాటు తగిలిన గాయాల నుంచి మెల్లగా బయటపడటమే లక్ష్యం! గోతుల దారుల్లో ఎగుడు దిగుడుగా సాగిన బండిని దారికి తెచ్చే ప్రయత్నం! అటు సంక్షేమాన్ని, ఇటు అభివృద్ధిని సమన్వయం చేసే 'బ్యాలెన్సింగ్' విన్యాసం! భవిష్యత్తును దర్శిస్తూ... భావి లక్ష్యాలను చేరే మార్గం! భారీ ఆశయాలు, ఆకాంక్షలు ఒకవైపు... పరిమితమైన సొంత ఆదాయ వనరులు మరోవైపు! ఈ క్రమంలో కేంద్రం అందించే ఆపన్న హస్తంపై కొండంత ఆశలు పెట్టుకుని లెక్కలకు రెక్కలు తొడిగారు. సామాన్య ప్రజానీకానికి సంక్షేమ ఫలాలు అందిస్తూ, ప్రాంతీయ సమతుల్యతకు పెద్దపీట వేస్తూ, రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ముందుకు నడిపించేలా 2026-27 బడ్జెట్‌ను రూపొందించారు. ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఉత్తరాంధ్ర వెనుకబాటును గుర్తించారు. 'కారిడార్ల' ద్వారా ఆ ప్రాంతాల వికాసానికి ప్రణాళికలు రచించారు. తొమ్మిది జిల్లాలతో 'అమరావతి ఎకనమిక్ కారిడార్' ప్రకటించారు. ఆకాంక్షలు, ఆశలు, గణాంకాలు ఎలా ఉన్నా... సొంత ఆదాయాన్ని పెంచుకునే విషయంలో మాత్రం తడబాట్లు తప్పడంలేదు. పారిశ్రామిక ప్రగతి, సేవా రంగాల్లో పురోగతి సాధించాలి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను పకడ్బందీగా రాబట్టుకోవాలి. బడ్జెట్ బండిని ముందుకు నడిపే జోడెడ్లు ఇవే! పారిశ్రామిక, సేవా రంగాల్లో ప్రగతిపై రాష్ట్రం ఇప్పటికే దృష్టి సారించింది. ఇక... కేంద్ర బడ్జెట్ కేటాయింపులు నిశితంగా పరిశీలించి, రాష్ట్రానికి వచ్చే సాయంపై కొంత స్పష్టమైన అంచనాకు వచ్చాకే ఈ లెక్కలను ఏర్చికూర్చారు. 2025-26 బడ్జెట్ పరిమాణంతో పోల్చితే ఇప్పుడు కేవలం రూ.10వేల కోట్లు మాత్రమే పెంచారు. సమర్థమైన ఆర్థిక నిర్వహణను జోడించి... లక్ష్యాలను చేరుకుంటామనే విశ్వాసం ప్రదర్శించారు.

బడ్జెట్ సమగ్ర కథనాలు 9, 10, 11లో

మొత్తం బడ్జెట్	3,32,205
రెవెన్యూ వ్యయం	2,56,142
మూలధన వ్యయం	48,697
రెవెన్యూ లోటు	(-)22,002


(రూ.కోట్లలో..)

ఇది భవిష్య దర్శిని

- దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు దార్శనిక పత్రం
- గత ప్రభుత్వంలో విధ్వంసం.. ఇప్పుడు వికాసం
- పెట్టుబడిదారులను తిరిగి రప్పిస్తున్నాం
- గ్రోత్ ఇంజన్లుగా విశాఖ, అమరావతి, తిరుపతి
- ఉత్తరాంధ్రకు 28 వేల కోట్లు.. సీమకు 30 వేల కోట్లు
- ఇకపై రాయలసీమ అంటే కొరత కాదు.. మిగులు
- బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్ వెల్లడి
- 50 పేజీలు.. గంటా 13 నిమిషాల ప్రసంగం

అడుగు ముందుకే!

కష్టాల బండిని గాడిన పెట్టడమే లక్ష్యం



బడ్జెట్ ప్రతుల బ్యాగ్‌తో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లను కలిసిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్

సంక్షేమాన్ని కొనసాగిస్తూ అభివృద్ధి

మూలధన వ్యయం పెంచుతూ ప్రగతి

- రెవెన్యూ లోటు కట్టడిపైనా దృష్టి.. జీఎస్‌డీపీలో అప్పుల వాటాపై నియంత్రణ
- 3,32,205 కోట్లతో రాష్ట్ర బడ్జెట్.. 2025-26 కంటే 10 వేల కోట్లే పెంపు
- కేంద్ర నిధులపై వాస్తవిక అంచనా.. రెవెన్యూ వ్యయం రూ.2,56,142 కోట్లు
- అందులో సంక్షేమ వ్యయం వాటాయే 23 శాతం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కేంద్రం నుంచి ఆగిన రెవెన్యూ లోటు భర్తీ నిధులు, ఇతర గ్రాంట్లలో కోత ఒక వైపు! అనుకున్నంతగా పెరగని సొంత ఆదాయం మరో వైపు! ఈ పరిస్థితుల మధ్యే.. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని కొంత వాస్తవిక అంచనాలతో 2026-27 బడ్జెట్‌ను రూపొందించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం రూ.3,32,205 కోట్ల అంచనాలతో అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రెవెన్యూలోటు గ్రాంటు, ఇతర గ్రాంట్ల రూపంలో కేంద్రం నుంచి వచ్చే ఆదాయం నిలిచిపోవడం, కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా అనుకున్నంత పెరగకపోవడంతో రాష్ట్రానికి రూ.15,000 కోట్లకు పైగా నిధులు ఆగిపోయాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కంటే కొత్త బడ్జెట్‌ను కేవలం రూ.10వేల కోట్లు మాత్రమే పెంచారు. ఆ లెక్కలు పరిశీలిస్తే... పెరుగుతున్న రెవెన్యూ లోటు కట్టడి చేయడంపై దృష్టి సారించినట్లు అర్థమవుతోంది. అప్పులు తగ్గిస్తూ, మూలధన వ్యయం పెంచుతూ, సంక్షేమాన్ని సాగిస్తూనే అభివృద్ధి దిశగా కదిలేలా చర్యలు చేపట్టారు. కేవలం ఒక ఆర్థిక సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని కాకుండా... రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సుదీర్ఘ లక్ష్యాల సాధనకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించినట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పలుమార్లు

మిగతా 9వ పేజీలో...

రైతును రాజుగా మార్చే పంచ సూత్రాలు

- లాభసాటి సాగుకు ఆధునిక సాంకేతికత జోడింపు
- లక్ష కోట్లతో సీమలో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్
- ప్రకృతి వ్యవసాయంలో దేశానికే ఏపీ రోల్ మోడల్
- ధరల స్థిరీకరణ నిధితో రైతుల్ని ఆదుకుంటాం
- కోకో హబ్‌గా పశ్చిమ గోదావరి జిల్లా
- వ్యవసాయ బడ్జెట్ ప్రసంగంలో అచ్చెన్నాయుడు

వ్యవ'సాయం' పెంపు

- రూ.53,752 కోట్లతో ప్రత్యేక బడ్జెట్
- గతేడాది కన్నా 5,410 కోట్లు ఎక్కువ
- అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు

సాగునీటికి పెద్దపీట

- జలవనరుల శాఖకు 18,223 కోట్లు
- ప్రాధాన్య ప్రాజెక్టులకు అధిక కేటాయింపు
- పోలవరానికి రూ.6,105 కోట్లు

పల్లె సీమలకు పట్టం

- పీఆర్, గ్రామీణాభివృద్ధికి 22,941 కోట్లు
- ప్రతి ఇంటికీ కుళాయి కోసం 4 వేల కోట్లు
- ఉపాధికి 8,365 కోట్లు

విద్యకు అగ్రతాంబూలం

- పాఠశాల విద్యకు 32,308 కోట్లు
- బడ్జెట్‌లో 11 శాతం నిధులు విద్యకే!
- తల్లికి వందనానికి రూ.9,668 కోట్లు




ప్రతి పోలీస్ స్టేషన్‌కూ
కొత్త వాహనం

3 వేల వాహనాల కొనుగోలుకు బడ్జెట్‌లో నిధులు

నేతన్నకు ఏప్రిల్ 1 నుంచి
ఉచిత విద్యుత్

బడ్జెట్ సాక్షిగా నెరవేరిన మరో కీలక హామీ



రేపు రాష్ట్రానికి బిల్‌గేట్స్



సచివాలయంలో సీఎం, మంత్రులతో భేటీ!

- ఆర్టీజీఎస్ ఫలితాలను ఆయనకు వివరించనున్న చంద్రబాబు
- ఉండవల్లిలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించనున్న గేట్స్ బృందం

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మిలిందా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బిల్ గేట్స్ నేతృత్వంలో ఫౌండేషన్ ప్రతినిధుల బృందం సోమవారం రాష్ట్రంలో పర్యటించనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయానికి రానున్న ఈ బృందంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌తో పాటు మంత్రులు, వివిధ శాఖల అధికారులు సమావేశమవుతారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై ఈ సమావేశంలో చర్చిస్తారు. అనంతరం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రానికి వెళ్లి పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. రియల్ టైమ్ గవర్నెన్స్ విధానాలు, ఫలితాలను బిల్‌గేట్స్‌కు చంద్రబాబు వివరిస్తారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై కూడా సీఎం ప్రజంటేషన్ ఇస్తారు. మెడ్‌టెక్, డయాగ్నోస్టిక్స్ సేవలు, సంజీవని తదితర ప్రాజెక్టుల వివరాలను ఆయనకు తెలియజేస్తారు. అనంతరం బిల్‌గేట్స్ బృందం అమరావతిలోని ఉండవల్లి గ్రామంలో ఉన్న ఒక వ్యవసాయ కేంద్రానికి వెళ్లనుంది. వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపట్టే సాగువిధానాన్ని బృందం పరిశీలిస్తుంది.

విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే గాడిలోకి!

కేంద్ర సహకారంతో మెరుగైన బడ్జెట్: సీఎం

- ప్రస్తుత పరిస్థితుల్లో సమతౌల్యం
- అన్ని రంగాలకూ న్యాయం
- ఆదాయం తక్కువ.. ఖర్చులు ఎక్కువ
- సమస్యలు ఇంకా చాలా ఉన్నాయ్
- వ్యవసాయం నుంచి రాబడి పెరగాలి
- సేవల ఆదాయమూ పెరగాలి
- 2-3 ఏళ్లలో అమరావతికో రూపు
- రాజధాని దారుల్ని హైవేకు సంధానిస్తున్నాం
- సీమ ముఖచిత్రం మార్చింది మేమే: సీఎం

11



బడ్జెట్ పుస్తకాన్ని ఆసక్తిగా చదువుతున్న సీఎం

గ్రామం నుంచి గ్లోబల్‌కు



- 360 డిగ్రీల గ్రోత్ మోడల్ బడ్జెట్
- అన్ని వర్గాలకూ సమ ప్రాధాన్యం
- సంక్షేమంతో కూడిన అభివృద్ధి ఫలాలు: పవన్ కల్యాణ్

12

ఎంత ఎక్కువగా ప్రజల్లో ఉంటే..
అన్ని ఎక్కువ నిధులు!

కడప ఎమ్మెల్యేలతో చంద్రబాబు

2



సీమ సిగన ఉద్యాన సిరి

ప్రపంచ ఉద్యానవన హబ్‌గా కొత్త రూపు

- భారీ ప్రణాళికతో సిద్ధమవుతున్న ప్రభుత్వం.. బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు కేటాయింపు
- ప్రైవేటు రంగం నుంచీ ఆర్థిక మద్దతు.. మొత్తం పెట్టుబడుల లక్ష్యం రూ.లక్ష కోట్లు
- సమగ్ర అభివృద్ధితో రెట్టింపు కానున్న రైతుల ఆదాయం

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన రంగంలో రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ హబ్‌గా తీర్చిదిద్దేందుకు భారీ ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ ప్రణాళికను 2026-27 సాధారణ బడ్జెట్ నుంచే అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, శ్రీసత్యసాయి, నంద్యాల, అన్నమయ్య, తిరుపతితోపాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాలను కలుపుకొని మొత్తం పది జిల్లాల్లో అమలు చేయనున్న ఈ ప్రణాళికతో రాయలసీమ ప్రాంతం ఉద్యానవన పంటల్లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుంది. ప్రస్తుతం రాయలసీమలో నీటి కొరత, బలహీనమైన మార్కెట్ వ్యవస్థ, రవాణా సౌకర్యాల కొరత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని మొత్తం ఉద్యానవన సాగు విస్తీర్ణంలో 43 శాతం వాటాను, ఉత్పత్తిలో 55 శాతం వాటాను కలిగి ఉంది. దాదాపు 65 రకాల అధిక విలువైన ఉద్యానవన పంటలను ఇక్కడ సాగు చేస్తున్నారు. ఈ రంగం ప్రస్తుతం ఏడాదికి రూ.81,734 కోట్ల స్థూల విలువను (సంప్రదాయ వ్యవసాయం కంటే నాలుగు రెట్లు అధికం) అందిస్తున్నప్పటికీ, పంట కోత అనంతర నష్టాలు, మార్కెట్ల కొరత, మౌలిక సదుపాయాల లోపాల కారణంగా రైతులకు తగిన ధర లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వ 'వికసిత్ భారత్ 2047', రాష్ట్ర ప్రభుత్వ 'స్వర్ణ ఆంధ్ర 2047' లక్ష్యాలకు అనుగుణంగా రాయలసీమను ఉద్యానవన హబ్‌గా తీర్చిదిద్దేందుకు భారీ ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యం, రాయలసీమను అధిక విలువ, ఎగుమతి ఆధారిత ఉద్యానవన ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ కేంద్రంగా మార్చడం. ప్రస్తుతం సీమలో సాగు విస్తీర్ణం 8.4 లక్షల హెక్టార్లు ఉండగా, 2030 నాటికి 14.41 లక్షల హెక్టార్లకు

మిగతా 10వ పేజీలో...

శాలరీ కాలిక్యులేటర్ పేరుతో
సైబర్ మోసం

- 8వ పే కమిషన్‌లో పెరిగే జీతాలు లెక్కించి
- చెబుతామంటూ వాట్సాప్ మెసేజ్‌లు
- ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలు ఖాళీ

2

సీఈసీపై
అభిశంసన!

2

- 'సర్' నేపథ్యంలో విపక్షాల యోచన
- జ్ఞానేశ్‌పై రెండో దశ బడ్జెట్ భేటీలో
- తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం
- స్పీకర్ తొలగింపునకు ఇప్పటికే నోటీసులు



2

కృత్రిమ మేధే కాదు..
మానవ సంబంధాలూ
ముఖ్యమే!

- అందుకే ప్రజాప్రతినిధులతో ఆత్మీయ భేటీలు
- దీనివల్ల వ్యక్తిగత బంధం పెరుగుతుంది
- ఇకపై ఏటా ఇలాంటి సమావేశాలు
- దీనిని ప్రధాని నుంచి నేర్చుకున్నాను
- ఏబీసీ సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతా..
- నిత్యం ప్రజలతో మమేకానికి యత్నం
- పార్టీ నేతలూ ఇదే పాటించాలి: లోకేశ్



కాంగ్రెస్ వల్లే ప్రమాదంలో
దేశ భద్రత

2

- అస్సాంలో చొరబాట్లకు ఆ పార్టీయే కారణం
- ఈశాన్య రాష్ట్రాలను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది
- గువాహటి సభలో ప్రధాని నరేంద్ర మోదీ

రేపటి నుంచి ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 నిర్వహణకు న్యూఢిల్లీ సిద్ధమవుతోంది. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఈ సమ్మిట్ భారత్ మండపంలో జరగనుంది. ఇందులో పాల్గొనబోయే దేశాల నాయకులతో కూడిన జాబితాను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఈ సమ్మిట్ గ్లోబల్ సౌత్‌లో మొట్టమొదటి ప్రధాన ప్రపంచ ఏఐ సమావేశంగా నిలువనుంది. కృత్రిమ మేధ(ఏఐ) భవిష్యత్తు, దాని ఆర్థిక ప్రభావం, పాలనా విధానాలకు సంబంధించి 20 దేశాల నాయకులు, మంత్రులు, గ్లోబల్ సీఈవోలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు చర్చించే అవకాశం ఉంది. 45కు పైగా దేశాల నుంచి మంత్రివర్గ ప్రతినిధులు కూడా ఈ సమ్మిట్‌లో పాల్గొననున్నట్టు తెలుస్తోంది. చర్చల్లో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్, వివిధ అంతర్జాతీయ సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు చర్చల్లో పాల్గొననున్నారు.

'యాజమాన్య' వివాదంలో రవివర్మ ఆఖరి పెయింటింగ్

» ఢిల్లీ హైకోర్టులో పిటిషన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ప్రముఖ భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ 'ఆఖరి'గా వేసిన పెయింటింగ్‌గా భావిస్తున్న చిత్రం.. యాజమాన్య వివాదంలో చిక్కుకుంది. 19వ శతాబ్దానికి చెందిన రవివర్మ వేసిన 'కాదంబరి' పెయింటింగ్ ప్రస్తుతం కిరణ్ నాడార్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ అధీనంలో ఉంది. తాము ఒక ప్రైవేట్ మ్యూజియంగా ఆ కళాఖండాన్ని కేవలం ప్రదర్శనకు మాత్రమే ఉంచుతామని, దాన్ని ఇకపై విక్రయించబోమని కిరణ్ నాడార్ మ్యూజియం ఇటీవల ఢిల్లీ హైకోర్టుకు హామీ ఇచ్చింది. రూ.100 కోట్లకు విలువైనదిగా భావిస్తున్న ఈ కళాఖండం మొదట.. మోహిందర్ వర్మ అనే ఢిల్లీకి చెందిన ఒక కళాఖండాల సేకరణదారుడి వద్ద ఉండేది. అయితే దాన్ని అప్పగించిన తర్వాత తన సహచరులు తనను మోసగించారని పేర్కొంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. వారు ఆ పెయింటింగ్‌ను తన అనుమతి లేకుండా మధ్యవర్తుల ద్వారా విక్రయించేశారని దావాలో తెలిపారు. ఆ తర్వాత సఫ్రాన్ ఆర్ట్ అనే సంస్థ రవివర్మ పెయింటింగ్‌ను వేలం వేసిందని, దాన్ని కొంత మొత్తానికి కిరణ్ నాడార్ మ్యూజియం కొనుగోలు చేసిందన్నారు.

ఎయిరిండియాకు కోటి జరిమానా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: చెల్లుబాటు అయ్యే ఎయిర్ వర్తినెస్ సర్టిఫికెట్(ఏఆర్‌సీ)లేకుండా విమాన సర్వీసులు నడిపినందుకు డీజీసీఏ ఎయిర్ ఇండియాపై రూ.కోటి ఫైన్ విధించింది. ఈ లోపాల కారణంగా ఎయిరిండియా ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీసిందని ఇటీవల జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.ఈ తీవ్రమైన లోపాలకుగానూ బాధ్యులైన ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులను తొలగించాలని ఆదేశించింది. ఎయిరిండియా సంస్థ గతేడాది నవంబరు 24, 25 తేదీల్లో న్యూఢిల్లీ, బెంగళూరు, ముంబై, హైదరాబాద్ మధ్య ఏఆర్‌సీ లేకుండానే ఎయిర్‌బస్ ఏ320 విమానాన్ని నడిపినట్టు డీజీసీఏ గుర్తించింది.


ఉగ్రవాది పన్నున్ హత్యకు కుట్ర పన్నా: నిఖిల్

న్యూయార్క్, ఫిబ్రవరి 14: ఖలిస్థాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నున్‌ను హత్య చేయించేందుకు కుట్ర పన్నానని నిందితుడు నిఖిల్ గుప్తా (54) అంగీకరించాడు. అమెరికా భూభాగంలో పన్నున్‌ను హత్య చేసేందుకు కుట్ర జరిగిందన్న కేసుపై శుక్రవారం న్యూయార్క్ కోర్టులో విచారణ జరిగింది. పన్నున్‌ను హత్య చేసేందుకు భారత జాతీయుడైన నిఖిల్ గుప్తా సహ నిందితుడైన వికాస్ యాదవ్‌తో కలిసి కుట్ర పన్నినట్టు ప్రభుత్వ అటార్నీ ఆరోపించారు. ఇందుకు లక్ష డాలర్లు చెల్లించేందుకు ఓ వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకొని, 15వేల డాలర్లు బయానాగా చెల్లించినట్టు వివరించారు. ఈ ఆరోపణను నిందితుడు నిఖిల్ గుప్తా అంగీకరించాడు.

కాంగ్రెస్ వల్లే ప్రమాదంలో దేశభద్రత

అస్సాంలో చొరబాట్లకు ఆ పార్టీయే కారణం.. ఈశాన్య రాష్ట్రాలను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది

గువాహటి సభలో ప్రధాని నరేంద్రమోదీ



కుమార్ భాస్కర్ వర్మ సేతుపై నడుస్తున్న మోదీ


గువాహటి, ఫిబ్రవరి 14: దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు, భయం, అభద్రతాభావంతో దేశ భద్రత ప్రమాదంలో పడిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ముఖ్యంగా అస్సాంలోకి పొరుగు దేశాల నుంచి చొరబాట్లను ఆ పార్టీ ప్రోత్సహించిందని ఆరోపించారు. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న అస్సాంలో ప్రధాని మోదీ శనివారం పర్యటించారు. రోజంతా సాగిన ఈ పర్యటనలో దాదాపు రూ.5,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈశాన్య రాష్ట్రాలోనే తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్‌ఎఫ్)ను ప్రారంభించారు. మోదీ ప్రయాణించిన సీ-130జే విమానం నేరుగా ఆ రన్‌వే పైనే దిగటం విశేషం. అనంతరం గువాహటిలో ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. 'ముస్లింలీగ్ వల్ల నాడు దేశ విభజన జరిగింది. కానీ నేడు ఎంఎంసీ (మావోయిస్టు, ముస్లిం, కాంగ్రెస్)లు తయారయ్యాయి. వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. చొరబాటుదారులను కాంగ్రెస్ కాపాడుతోంది. బీజేపీ మాత్రం అక్రమ చొరబాట్లకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని కృతనిశ్చయంతో ఉంది. అస్సాంకు వచ్చే ఐదేళ్లు చాలా ముఖ్యమైన సమయం. కాంగ్రెస్ గతంలో అధికారంలో ఉన్నప్పటికంటే గత పదేళ్లుగా అధికారం లేకపోవటం వల్ల మరింత ప్రమాదకరంగా మారింది' అని ఆరోపించారు. కాగా, అస్సాం వరకు వచ్చిన ప్రధాని మోదీ.. 2023 నుంచి జాతుల ఘర్షణతో నలిగిపోతున్న మణిపూర్‌లో కూడా పర్యటించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

బ్రహ్మపుత్రపై వంతెన

గువాహటిని, ఉత్తర గువాహటిని కలుపుతూ రూ.3,030 కోట్లతో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన ఆరు వరుసల వంతెనను ప్రధాని శనివారం ప్రారంభించారు. వంతెనపై కాసేపు నడిచారు. దీనిని కుమార్ భాస్కర్ వర్మ సేతు అని పిలుస్తున్నారు. ఇది ఈశాన్య రాష్ట్రాల్లో మొదటి ఎక్స్‌ట్రాడోస్డ్ ప్రెస్ట్రెస్డ్ కాంక్రీట్ (పీఎస్‌సీ) వంతెన. ఈ రకం వంతెనలను బలమైన ఉక్కు తీగలతో బిగించి భూకంపాలను తట్టుకొనేలా నిర్మిస్తారు. గువాహటిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ను కూడా ప్రధాని ప్రారంభించారు.

హైవేపై రన్‌వే

ఇటు బంగ్లాదేశ్ నుంచి అటు చైనా నుంచి ఈశాన్య రాష్ట్రాలకు ప్రమాదం పెరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో భారత్ ఓ చరిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించింది. ఈశాన్య రాష్ట్రాల్లోనే తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్‌ఎఫ్)ని ప్రధాని నరేంద్రమోదీ అస్సాంలోని మోరన్‌లో శనివారం ప్రారంభించారు. వాయుసేనకు చెందిన సీ130జే విమానంలో ఆయన స్వయంగా ఆ ఈఎల్‌ఎఫ్‌పై దిగారు. దీనిని 37వ (ఎన్‌హెచ్ 127) నంబర్ జాతీయ రహదారిపై మోరన్ బైపాస్‌లో నిర్మించారు. సాధారణ సమయంలో ఇది హైవేగా ఉపయోగపడుతుంది. అత్యవసర సమయంలో రన్‌వేగా వాడుకుంటారు. ఇది చైనా సరిహద్దుకు 300 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఏర్పడినప్పుడు వాయుసేన యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, సరుకు రవాణా విమానాలు అత్యవసరంగా దిగేందుకు దీనిని వాడుకుంటారు. ప్రధాని ప్రారంభించిన తర్వాత వాయుసేనకు చెందిన రఫేల్, సుఖోయ్, తేజస్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ఇక్కడ విన్యాసాలు నిర్వహించాయి. రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ స్ట్రెచ్ 4.2 కిలోమీటర్ల పొడవు ఉంది. దీనిని సివిల్, మిలిటరీ అవసరాల కోసం వినియోగించుకొనేలా నిర్మించారు. 40 టన్నుల యుద్ధ విమానాలు, 74 టన్నుల రవాణా విమానాలు ఈ రన్‌వేపై తేలిగ్గా టేకాఫ్ కాగలవు.



శాలరీ కాలిక్యులేటర్ పేరుతో సైబర్ మోసం

» 8వ పే కమిషన్‌లో పెరిగే జీతాలు లెక్కించి చెబుతామంటూ వాట్సాప్ మెసేజ్‌లు

» ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలు ఖాళీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ఎనిమిదో వేతన సంఘంలో జీతాలు పెరుగుదలపై చర్చలు ఊపందుకుంటున్న వేళ.. కొత్త సైబర్ మోసం ఒకటి బయట పడింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లే లక్ష్యంగా సైబర్ మోసగాళ్లు రంగంలోకి దిగారు. ప్రతిపాదిత వేతన సంఘం ప్రకారం జీతం ఏమేరకు పెరుగుతుందో కచ్చితంగా అంచనా వేసి చెబుతామంటూ వాట్సాప్‌లో ఫేక్ మెసేజ్‌లు పెడుతూ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ కొత్త సైబర్ స్కామ్‌పై జాగ్రత్తగా ఉండాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులను హెచ్చరించింది.మీకు పెరిగే జీతాన్ని అంచనా వేసి చెబుతామంటూ తొలుత నేరగాళ్లు బాధితులకు వాట్సాప్‌లో మెసేజ్ పెడతారు. దానికి '8వ సీపీసీ శాలరీ కాలిక్యులేటర్' లేదా 'శాలరీ రివిజన్ టూల్' పేరుతో ఉండే ఏపీకే ఫైల్స్‌ను జతచేస్తారు. ఆ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేస్తే.. వినియోగదారుల ఫోన్ సైబర్ క్రిమినల్స్ చేతిలో పెట్టినట్లే. ఆ యాప్ ద్వారా ఫోన్ యజమాని వ్యక్తిగత డేటా, బ్యాంకుల సమాచారం, ఎస్ఎంఎస్, ఓటీపీలు అన్నీ కూడా మోసగాళ్లకు చేరిపోతాయి. యజమానికి తెలియకుండానే బ్యాంకుల నుంచి నగదు బదిలీ చేస్తారు. ఇలాంటి మోసాలపై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. మోసపూరిత ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసిన తర్వాత తమ ఖాతాల్లో డబ్బు పోయిందని బాధితులు ఫిర్యాదు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వాట్సాప్ ద్వారా ఎలాంటి ఏపీకే ఫైల్స్ పంపదని సైబర్ సంస్థలు స్పష్టం చేశాయి.

అబద్ధాల గురువు మోదీ

● అమెరికా ఒప్పందంతో రైతులు, జౌళి పరిశ్రమకు నష్టం

● కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ప్రధాని నరేంద్రమోదీ 'అబద్ధాలకు గురువు' అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికాతో ఖరారైన వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే పత్తి రైతులు, జౌళి ఉత్పత్తుల ఎగుమతి దారులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ద్వారా దేశ పత్తి రైతులు, జౌళి ఉత్పత్తుల ఎగుమతి దారులను మోసగిస్తున్న మోదీ ప్రభుత్వం.. ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని శనివారం తన 'ఎక్స్' ఖాతాలో ఆరోపించారు. అమెరికా ట్రాప్‌లో పడ్డ మోదీ సర్కారు విధానాల వల్ల లక్షల మంది ఉపాధి కోల్పోతారని తెలిపారు. పొరుగుదేశం బంగ్లాదేశ్ నుంచి జౌళి ఉత్పత్తుల ఎగుమతులపై జీరో సుంకం ఉంటే, మన దేశ జౌళి ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా 18 శాతం దిగుమతి సుంకం విధిస్తోందని, ఇదే ప్రధాని మోదీ అబద్ధాలకు నిదర్శనమని రాహుల్ తెలిపారు. రాహుల్ ఆరోపణలను కేంద్ర మంత్రి గోయల్ తిప్పి కొట్టారు. 'రాహుల్ వంటి నేతలను, ఆయన సారథ్యంలోని కూటమిని ప్రజలు నమ్మబోరని నా నమ్మకం. అబద్ధాలు చెప్పి మోసం చేయడం తప్ప మమ్మల్ని విమర్శించడానికి వారికి ఏ అంశమూ లేదు' అని ఆయన ఎద్దేవా చేశారు.

సీఈసీపై అభిశంసన!

» 'సర్' నేపథ్యంలో విపక్షాల యోచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 : ప్రత్యేక, సమగ్ర ఓటరు జాబితా (సర్) ప్రక్రియను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు భారత ఎన్నికల ప్రధాన అధికారి (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టనున్నట్టు తెలిసింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలగింపునకు ఇప్పటికే ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మాన నోటీసును ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సంబంధాలు రానున్న కాలంలో మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. రెండో దశ బడ్జెట్ సమావేశాలు వచ్చే నెల మార్చిలో ప్రారంభం అవుతాయి. ఆ సెషన్‌లోనే సీఈసీకి వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం తేనున్నట్టు తెలిసింది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతాబెనర్జీ ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చినా, 'ఇండియా కూటమి'లోని మిగతా పార్టీలు దీనిపై ఇప్పటివరకు దూరంగానే ఉన్నాయి. అధికార పక్షం వైపే మొగ్గుతున్నారంటూ స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసుపై తృణమూల్ సంతకం చేయలేదు. దీంతో తృణమూల్ పట్ల మిగతా విపక్షాలు గుర్రుగా ఉన్నాయి. తృణమూల్‌ను తమ వైపు తెచ్చుకోవడంతోపాటు ఎన్నికల కమిషన్ పట్ల స్వతహాగానే ఉన్న వ్యతిరేకత రీత్యా కూడా.. సీఈసీని అభిశంసించాలన్న మమత ప్రతిపాదన వైపే విపక్షాలు మొగ్గే అవకాశం ఉంది. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు సానుకూల సంకేతాలు అందించారు.



మహాశివరాత్రి సందర్భంగా శనివారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో 'ఆది దంపతుల అన్యోన్యం ఆదర్శనీయం', 'సేవ్ అవర్ కల్చర్' అనే నినాదాలతో శివపార్వతుల రూపంలో సైకత శిల్పాన్ని అదే గ్రామానికి చెందిన ప్రముఖ సైకతశిల్పి దేవిన శ్రీనివాస్ రూపొందించారు. శివపార్వతుల దివ్యరూపాలు సజీవంగా కనిపించేలా తీర్చిదిద్దారు. ఈ శిల్పం భారతీయ సంస్కృతి, కుటుంబ బాంధవ్యాల విలువలను ప్రతిబించేలా ఉంది. **- రంగంపేట.**

మరో 48 గంటల్లో అల్పపీడనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో దక్షిణ మధ్య బంగాళాఖాతం దానికి ఆనుకుని ఉన్న హిందూ మహాసముద్రం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడనున్నది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి శ్రీలంక, తమిళనాడు తీరాల వైపు వస్తుందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. అయితే, తమిళనాడు తీరానికి చేరుకునే సరికి 5 రోజులు సమయం పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా, పగలు ఒకటి, రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి.

ఎంత ఎక్కువగా ప్రజల్లో ఉంటే.. అన్ని నిధులు!

» కడప ఎమ్మెల్యేలతో చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు ఎంత ఎక్కువగా ప్రజల్లో ఉంటే వారికి అన్ని ఎక్కువ నిధులు ఇస్తానని సీఎం చంద్రబాబు బంపర్ ఆఫర్ ప్రకటించారు. కడప పార్లమెంటు పరిధిలోని ప్రజాప్రతినిధులతో శనివారం సాయంత్రం సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమలో ఏం చేసినా మన హయాంలోనే చేశామని, ఈ విషయాన్ని ప్రజలకు సరిగా వివరిస్తే కడపలో ఎప్పటికీ మనదే పైచేయి అవుతుందని తెలిపారు. 20 నెలల్లో ఎవరి పనితీరు ఎలా ఉందనే దానిపై అన్ని కోణాల్లో సమాచారం తెప్పించుకుంటున్నానని.. మంత్రులు, ఎమ్మెల్యేలే కాదు అధికారుల పనితీరుపైనా రిపోర్టులు రప్పించుకుంటున్నానని అన్నారు. పొలిటికల్ గవర్నెన్స్‌కు ఈసారి అధిక ప్రాధాన్యం ఇస్తున్నానని అన్నారు. పొలిటికల్ గవర్నెన్స్ అంటే అధికారులు, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు కలిసి ప్రజలకు మంచి చేయడమేనని చెప్పారు. మే నెలలో కడప స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఎం స్పందిస్తూ.. ఐదేళ్ల పాలనలో జగన్ సొంత జిల్లాకు, సొంత నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. ఇన్ని సమస్యలుంటే ఆయనేం చేశారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సొంత జిల్లాలో కూడా అభివృద్ధి చేయనందునే ఆ స్థాయిలో వ్యతిరేకత మూట కట్టుకున్నారని ఎమ్మెల్యేలు చెప్పారు. బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో గతంలో సేకరించిన వేల ఎకరాల భూములపై న్యాయపరమైన వివాదాలు పరిష్కరించి, ఆ భూముల్లో పరిశ్రమలు వచ్చేలా చూడాలని కడప జిల్లా ప్రజాప్రతినిధులు సీఎంను కోరారు.



విజయవాడ లోక్‌సభ స్థానం పరిధిలోని ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో లోకేశ్ ఆత్మీయ భేటీ

కృత్రిమ మేధే కాదు.. మానవ సంబంధాలూ ముఖ్యమే!

» అందుకే ప్రజాప్రతినిధులతో ఆత్మీయ భేటీలు: మంత్రి లోకేశ్

» దీనివల్ల వ్యక్తిగత బంధం పెరుగుతుంది

» ఇకపై ఏటా ఇలాంటి సమావేశాలు

> తెలుగుదేశం పార్టీ ఓ కుటుంబం. ఇప్పుడు కూటమి పార్టీలూ మా కుటుంబంలోకి వచ్చాయి. కుటుంబమంతా కలిసి కష్టమైనా, సుఖాన్నైనా పంచుకోవాలి. ఎమ్మెల్యేలతో ఆత్మీయ విందు సమావేశాలను ఇకపై ఏడాదికోసారి నిర్వహించాలని యోచిస్తున్నాను. **- మంత్రి లోకేశ్**

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ ఎంత ముఖ్యమో మానవ సంబంధాలు కూడా అంతే ముఖ్యమని మంత్రి లోకేశ్ అన్నారు. శనివారం అసెంబ్లీలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఏఐ, క్వాంటమ్ సీఎం చంద్రబాబు చూసుకుంటారని.. తాను మానవ సంబంధాలను చూసుకుంటానని చెప్పారు. 'కూటమి ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ విందు భేటీల వల్ల వ్యక్తిగత సంబంధాలు మె రుగుపడతాయి. రాజకీయాలే కాదు.. వ్యక్తిగత సం బంధాలు కూడా ముఖ్యం. ప్రధాని మోదీని చూసి ఎంతో నేర్చుకున్నాను. ఎంపీలెవరికైనా బాగోకపోతే ప్రధాని వెంటనే ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకుంటారు. అటువంటి సంబంధాలు మనం కూడా ఏర్పరచుకోవాలి' అని స్పష్టం చేశారు. తాను ఇప్పటి వరకు రాజకీయం మాత్రమే చేశానని, ఇకపై తమ ఎమ్మెల్యేలు ఎంపీలతో కుటుంబపరమైన సంబంధాలు కూడా కలిగి ఉండాలని భావిస్తున్నానని, ప్రతి ఏడాదీ ఆత్మీయ సమావేశాలు పెట్టాలని అనుకుంటున్నానని తెలిపారు. యువగళం పాదయాత్ర ము గిశాక గంట గంటన్నరపాటు కాళ్లు చల్లటి నీటిలో పెట్టుకుని నేతలందరితో సరదాగా మాట్లాడేవాడిన ని.. అధికారంలోకి వచ్చాక ఆ మానవ సంబంధాలు మిస్ చేసుకోకూడదని నిర్ణయించుకున్నానని చెప్పా రు. 'నాకు నాయకులంతా తెలుసు. కానీ వారి కు టుంబసభ్యులు కొంత మందే తెలుసు. ఈ విందు భేటీల ద్వారా వారితో అనుబంధం పెంచుకోవడంతోపాటు వారి కష్టసుఖాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నా' అని తెలిపారు. కూటమి నేతలంతా 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నామని చెప్పారు. తాను వ్యక్తిగతంగా ఏబీసీ (నిత్య ప్రచారకర్త-ఆల్వేస్ బీ క్యాంపెయినర్) సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతానని, అందుకే ఎప్పుడూ ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రయత్నం చేస్తుంటానన్నారు. 'పార్టీ నేతలంతా ఇదే సిద్ధాంతాన్ని అనుసరించాలని కోరుకుంటున్నా. సంక్షోభంలో అవకాశాలు సృష్టించుకోవడం టీడీపీకి అలవాటే.. నేను ప్రతిపక్షంలో ఉండగా దానిని అలవాటు చేసుకున్నాను. ఏదైనా ఒక అంశంపై పార్టీ నిర్ణయం తీసుకునే వరకు ఎవరైనా తమ అభిప్రాయాలను బలంగా వినిపించవచ్చు.. కానీ ఒకసారి పార్టీ నిర్ణయం తీసుకున్నాక, ఎంతటివారైనా దానికి కట్టుబడి ఉండాల్సిందే' అని తేల్చిచెప్పారు. ఎమ్మెల్యేలు ఎక్కువగా జనంలో ఉండేందుకు ప్రయత్నించాలని, ఎవరైనా దారి తప్పితే చంద్రబాబు ఒకటికి రెండు సార్లు పిలిచి చెబుతున్నారని.. మూడోసారి పిలిచారంటే మాత్రం ఇక గట్టి నిర్ణయాలు ఉంటాయని అర్థం చేసుకోవాలని సుతిమెత్తగా హెచ్చరించారు.

మన పరిశ్రమలపై పొరుగు రాష్ట్రాల ఆరా..

మన రాష్ట్రానికి పరిశ్రమలు ఎక్కువగా రావడంపై ఇతర రాష్ట్రాలు కూడా ఆరా తీస్తున్నాయని, పెట్టుబడులను ఆకర్షించడంలో మన దూకుడు వారిని మన వైపు చూసేలా చేస్తోందని లోకేశ్ చెప్పారు. విశాఖపట్నం యలమంచిలిలో బ్లూజెట్ ఫార్మా కంపెనీకి ఈ నెల 28న శంకుస్థాపన చేస్తున్నామని, విశాఖలోని ఫార్మా సిటీలో ఈ కంపెనీ నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ కంపెనీ రూ.2,300 కోట్ల పెట్టుబడి పెడుతోందని.. సుమారు 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఫార్మా కంపెనీలు ఇంకా రావలసిన అవసరం ఉందని, అప్పుడే ఫార్మా సిటీ ఇంకా బాగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.

నేడు కోటప్పకొండ తిరునాళ్లు

- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- 3,000 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు
- 100 అడుగుల ఎత్తున 22 భారీ విద్యుత్ ప్రభలు



పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి గొట్టిపాటి

విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం



నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్ పాలెం నుంచి బయలుదేరిన 100 అడుగుల విద్యుత్ ప్రభ

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం అంగరంగ వైభవంగా జరగనుంది. తిరునాళ్లకు దేశ నలుమూలల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఇబ్బంది కలగకుండా భారీగా ఏర్పాట్లు చేశారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ పట్టణాల నుంచి తిరునాళ్లకు 618 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. తాగునీరు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్య అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తిరునాళ్లనే ప్రభల పండుగగా పిలుస్తారు. తిరునాళ్లలో విద్యుత్ ప్రభలు ఆకర్షణంగా నిలుస్తాయి. 100 అడుగుల ఎత్తులో నిర్మించిన 22 భారీ విద్యుత్ ప్రభలు తిరునాళ్లలో కాంతులీననున్నాయి. శనివారం ఉదయం ఆయా గ్రామాల నుంచి ఊరేగింపుగా ప్రభలు కోటప్పకొండకు పయనమయ్యాయి. ఎనిమిది లక్షల మందికి పైగా భక్తులు వస్తారన్న అంచనా నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 3000 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తుతో పాటు.. 200 సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా ఏర్పాట్లు చేశారు. కమాండ్ కంట్రోల్ కార్యాలయం ద్వారా బందోబస్తును పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. ఉచిత దర్శనం, ప్రత్యేక, శీఘ్ర, వీఐపీ దర్శనాలు, అభిషేకాల కోసం ప్రత్యేకంగా క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ఈసారి వీఐపీ ఉచిత దర్శనాలను రద్దు చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ బి.కృష్ణారావు బందోబస్తును పర్యవేక్షించారు. కాగా.. ఆదివారం అర్ధరాత్రి శ్రీ త్రికోటేశ్వర స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా నేపథ్యంలో ప్రభుత్వం తరపున శ్రీ త్రికోటేశ్వర స్వామికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టు వస్త్రాలు, వెండి ప్రభను సమర్పించనున్నారు.



శ్రీశైలంలో గజవాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

భ్రమరాంబ సమేతుడై గజవాహనంపై మల్లన్న

- శ్రీశైలంలో నేడు ప్రభోత్సవం, నందివాహన సేవ పాగాలంకరణ, స్వామిఅమ్మవార్ల కల్యాణం

శ్రీశైలం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడవరోజైన శనివారం భ్రమరాంబ సమేతుడైన మల్లన్న గజవాహనంపై విహరించారు. మహాశివరాత్రి, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం, 7 గంటలకు నందివాహన సేవ, 10 గంటలకు లింగోద్భవకాల మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ప్రధాన ఘట్టమైన పాగాలంకరణ, రాత్రి 12 గంటలకు స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవ లీలా కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు.



నాస్తిక మేళాలో ప్రసంగిస్తున్న ఎంవీఎస్ శర్మ

ప్రజల్లోకి బలంగా చార్వాక సిద్ధాంతం

- మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ
- మంగళగిరిలో ప్రారంభమైన 34వ నాస్తిక మేళా

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చార్వాక సిద్ధాంతం ప్రజల్లోకి బలంగా వెళుతూ భావితరాలకు చేరుకుంటుందని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలోని చార్వాక ఆశ్రమంలో నాస్తిక సమాజం, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు జరుగనున్న 34వ నాస్తిక మేళా శనివారం ఉదయం ప్రారంభమైంది. 'ప్రాచీన భారతంలో చార్వాకం' అనే అంశంపై ఎంవీఎస్ శర్మ మాట్లాడారు. 'వేదాలు నేర్చుకోవడం అంటే బట్టీపట్టడం మాత్రమే. అందులో ఎలాంటి జ్ఞానం లేదు. ఇదే విషయాన్ని చార్వాకులు ముందు నుంచీ చెబుతున్నప్పటికీ మతవాదులు భౌతిక దాడులు చేస్తున్నారు. ఆది భౌతికవాదులు, చార్వాకులు... ఆత్మ, పరమాత్మ, పునర్జన్మ, దేవుడు, మూఢనమ్మకాలను తిరస్కరించారు' అని శర్మ గుర్తు చేశారు. 'వైజ్ఞానికతకు, మత భావాలకు పొసగని మైత్రి' అనే అంశంపై డాక్టర్ జయకుమార్, 'పురాణ ప్రలాపం' అనే అంశంపై జే లక్ష్మీరెడ్డి, 'దాచేస్తే దాగని సత్యం-జీవ పరిణామం' అనే అంశంపై కట్టా సత్య ప్రసాద్, 'శాస్త్రీయ దృక్పథ ప్రచారంలో అవలంబించాల్సిన విధానాలు' అనే అంశంపై డాక్టర్ సీహెచ్ రవికుమార్, డాక్టర్ శరత్ ప్రసంగించారు. 'మనిషితనం తప్ప ఏమీ తెలియని వట్టి చేతుల మనిషి చార్వాక రామకృష్ణ' పుస్తకాన్ని డాక్టర్ భానుప్రసాద్, డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి, సీహెచ్ శివారెడ్డి, చార్వాక ఎస్ఎస్ఎఫ్ ఆవిష్కరించారు.

కూలిన ప్రైవేట్ స్కూల్ స్లాబ్ 15 మంది కూలీలకు తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం వేగవరం సమీపంలో ఓ ప్రైవేటు పాఠశాల భవనానికి శనివారం స్లాబ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కూలి 15 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్కూల్ నూతన భవనం నిర్మాణంలో భాగంగా స్లాబ్ వేసేందుకు 130 మంది కూలీలు, మేస్త్రీలు పని చేస్తుండగా హఠాత్తుగా ఒక వైపు స్లాబ్ ఒక్కసారిగా కూలిపోయింది. ఆ ప్రాంతంలో కింద ఉన్న 15 మందికిపైగా కూలీలు, మేస్త్రీలతోపాటు పాఠశాలకు చెందిన ఒకరు సెంట్రింగ్ కర్రలు, రేకుల కింద చిక్కుకుపోయారు. వారిని బయటకు తీసి జంగారెడ్డిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. 11 మందికి గాయాలు కాగా మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు.

వీఆర్ఎస్ తీసుకున్న అధికారికి పదోన్నతి

బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వీఆర్ఎస్ తీసుకున్న ఓ అధికారికి పదోన్నతి కల్పించారు. ఆయన పోస్టింగ్ పెండింగ్‌లో ఉన్నట్టు చూపించి, పాలనా విభాగం అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభాసుపాలు చేశారు. కేఏఎస్ అధికారి హెచ్ఎల్ నాగరాజ మండ్య అదనపు జిల్లా అధికారిగా సేవలందిస్తూ గతేడాది స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఆ తరువాత సన్యాసం స్వీకరించారు. తన పేరును నిశ్చలానందనాథ స్వామిజీగా మార్చుకుని, విశ్వ వక్కలిగ మహాసంస్థాన పీఠాధిపతిగా ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్నారు. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గ్రూప్-1 అక్రమాలపై 'సిట్'

- సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో ఏర్పాటు
- తనిఖీలు, ఆధారాల స్వాధీనం, సాక్షుల విచారణ, వాంగ్మూలం నమోదుకు అధికారాలిస్తూ పోలీస్‌స్టేషన్ హోదా
- పలు అంశాలపై విజయవాడ వెలుపల కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులతో పరీక్షలకు ఆదేశం
- జవాబు పత్రాలను సమగ్రంగా పరిశీలించనున్న అధికారులు
- దర్యాప్తు పూర్తి చేసి మార్చి 16 లోపు హైకోర్టుకు నివేదిక



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాల నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసింది. రాష్ట్ర హైకోర్టు ఇటీవల వెలువరించిన ఉత్తర్వుల మేరకు ఏపీ సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సిట్‌లో మరో సభ్యుడిగా సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తిని నియమించిన ప్రభుత్వం.. దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులకు సంబంధిత ప్రభుత్వ శాఖలు సహకరించాలని ఆదేశించింది. అవసరమైన చోట తనిఖీలు, ఆధారాల స్వాధీనం, సాక్షుల విచారణ, వాంగ్మూలం నమోదుకు అధికారాలిస్తూ పోలీస్ స్టేషన్ హోదా కల్పించింది. హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా దర్యాప్తులో పలు అంశాలపై విజయవాడ వెలుపల ఉన్న ఏదైనా కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిపుణులతో పరీక్షలు చేయాలని సిట్‌కు స్పష్టం చేసింది. గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జవాబు పత్రాలు సక్రమంగా ఉన్నాయా? వాటిని ఎవరైనా ట్యాంపర్ చేశారా? జవాబు పత్రాలపై ఉన్న బార్ కోడ్లు, ఒరిజనల్ ఓఎంఆర్ షీట్లు, మూల్యాంకనంలో ఉపయోగించిన ఓఎంఆర్ షీట్లపై ఉన్న బార్ కోడ్‌లు సరిపోలుతున్నాయా? లేదా అనేది సిట్ అధికారులు పరిశీలించనున్నారు. అదే విధంగా ఉద్యోగాలకు ఎంపికకాని అభ్యర్థుల జవాబు పత్రాలను కూడా తనిఖీ చేయనున్నారు. మెరిట్ లిస్ట్‌లో ఆఖరి అభ్యర్థి కంటే దిగువన ఉన్న 100 మంది జవాబు పత్రాలను పరిశీలించడంతో పాటు.. జవాబు పత్రాల ట్యాంపరింగ్‌కు సంబంధించి మరేదైనా సమాచారం ఉంటే శాస్త్రీయ పద్ధతుల ద్వారా గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది. దర్యాప్తు పూర్తి చేసి మార్చి 16వ తేదీ లోగా కోర్టుకు సిట్ నివేదిక సమర్పించాల్సి ఉంది. కాగా.. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా వైసీపీ ప్రభుత్వంలో భర్తీ చేసిన 169 పోస్టుల మెయిన్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో అక్రమాలు జరిగినట్టు తేలింది. ఈ వ్యవహారంపై దాఖలైన పలు పిటిషన్లను విచారించిన హైకోర్టు ధర్మాసనం మూల్యాంకనం ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి ఫోరెన్సిక్ పరీక్ష అవసరమని భావిస్తున్నట్టు తాజా తీర్పులో పేర్కొంది. 'అసాధారణ పరిస్థితుల్లో నిజాన్ని వెలికితీయడానికి అసాధారణమైన దర్యాప్తే సరైన మార్గం, మూల్యాంకన ప్రక్రియలో అక్రమాలు ఆరోపణల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు అవసరం. అందుకే సిట్‌ను ఏర్పాటు చేస్తున్నాం' అని హైకోర్టు స్పష్టం చేసింది. ఏపీపీఎస్సీ బోర్డు అనుమతి లేకుండా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన జవాబు పత్రాలను హాయ్‌ల్యాండ్‌లోని అవాస రిసార్ట్స్‌కు తరలించింది ఎవరు.. వాటిని 65 రోజుల పాటు అక్కడే ఉంచాలని ఎవరు నిర్ణయించారనే విషయాన్ని సిట్ తేల్చి మార్చి 16 లోపు హైకోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉంది.



క్యూలైన్‌లో వేచి ఉన్న సర్వదర్శన భక్తులు

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. రెండవ శనివారంతో పాటు ఆదివారం, పైగా శివరాత్రి కావడంతో శ్రీవారి దర్శనార్థం భక్తులు భారీగా తిరుమలకు చేరుకున్నారు. ఈక్రమంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దాదాపు 14 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, టైంస్లాట్ భక్తులకు కూడా దాదాపు మూడు గంటల తర్వాత దర్శనం లభిస్తోంది. మరోవైపు రద్దీ పెరిగిన క్రమంలో శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూ కేంద్రం, అన్నప్రసాద భవనం, ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన కూడళ్లలో భక్తుల సందడి నెలకొంది.

లడ్డూ కల్తీకి నిరసనగా పొర్లుదండాలు

- నెల్లూరులో జనసైనికుడి వినూత్న నిరసన



నెల్లూరులో పొర్లుదండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న మల్లికార్జున్ యాదవ్, మద్దతుగా వీరమహిళలు, జనసేన నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) ఫిబ్రవరి 14 ఆంధ్రజ్యోతి): పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ కల్తీకి నిరసనగా సనాతన ధర్మరక్షణ కోసం నెల్లూరుకు చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ శనివారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. శ్రీవారి మాల ధరించిన ఆయన నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి మాగుంట లేఅవుట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు సుమారు 4 కి.మీ పొర్లు దండాలు పెడుతూ సాగారు. మార్గమధ్యంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పలువురు టీడీపీ నేతలు ఆయన్ను కలిసి మద్దతు పలికారు. ఈ సందర్భంగా మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాక్షస పాలన సాగించిందని, అన్ని రంగాల్లో ప్రజలను విస్మరించడంతోపాటు తిరుమల లడ్డూ కల్తీ చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీవారి లడ్డూ విషయంలో పాత్రధారులు, సూత్రధారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జనసేన నేతలు, కార్యకర్తలతోపాటు, శ్రీవారి మాలధరించిన వీరమహిళలు పలువురు ఆయనకు మద్దతుగా అనుసరించారు.

రేపు ఐచ్ఛిక సెలవు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈ నెల 16వ తేదీని ఐచ్ఛిక సెలవుగా ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. 15వ తేదీ మహాశివరాత్రి నేపథ్యంలో ప్రజలు ప్రత్యేక పూజలతోపాటు ఆదివారం రాత్రి జాగరణ చేయనున్నారు. అందువల్ల సోమవారం ఐచ్ఛిక సెలవుగా ప్రకటించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ ప్రభుత్వానికి విన్నవించారు. ఆ విన్నపం మేరకు ప్రభుత్వం 16వ తేదీని ఐచ్ఛిక సెలవుగా ప్రకటించింది. గతేడాది డిసెంబరు 4వ తేదీన ఇచ్చిన ఉత్తర్వులకు ఈ మేరకు చిన్న సవరణ చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.



సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద నివాళుల అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో మంత్రి సంధ్యారాణి

సంత్ సేవాలాల్ స్ఫూర్తితో ఆదివాసీల అభివృద్ధి

- నీట్, ఐఐటీ సీట్లు సాధించేలా ఎస్టీ విద్యార్థులకు శిక్షణ
- గిరిజన సంక్షేమానికి బడ్జెట్‌లో 9 వేల కోట్లు
- సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రూ.50 లక్షలు కేటాయించి సేవాలాల్ జయంతిని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. నీట్, ఐఐటీ సీట్లు సాధించేలా గురుకులాల్లో ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తామని చెప్పారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 287 జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సంత్ శ్రీ సేవాలాల్ మన రాష్ట్రంలో జన్మించడం మన అదృష్టమని తెలిపారు. బంజారాల ఆరాధ్య దైవమైన ఆయన సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శమేనన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నామని. 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ. 9,190 కోట్లు ఎస్టీల కోసం కేటాయించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు మిరియాల శిరీషాదేవి, తోయక జగదీశ్వరి, చిర్రిబాలరాజు, గిరిజన నేతలు, గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇలా ఇచ్చి.. అలా లాగేశారు!

- ఉపాధి మెటీరియల్ నిధులపై కేంద్రం దోబూచులాట
- కేంద్ర మంత్రి పెమ్మసాని జోక్యం చేసుకోవాలని వినతి

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధుల విషయంలో కేంద్రం దోబూచులాడుతోంది. రాష్ట్రానికి రూ.480 కోట్ల మెటీరియల్ నిధులు విడుదల చేస్తూ జనవరి 27న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అంతలోనే పొరపాటున ఉత్తర్వులు ఇచ్చామని, మెటీరియల్ నిధులు మీకు ఇప్పుడే ఇవ్వడం కుదరదని చెబుతూ ఆ ఆదేశాలను వెనక్కి తీసుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగో విడత మొదటి భాగంగా రూ.480 కోట్లు, పాత బకాయిలు మరో రూ.75 కోట్లు కలిపి సుమారు రూ.556 కోట్లు స్పర్శ అకౌంట్ ద్వారా విడుదల చేస్తూ జనవరి 27న ఆదేశాలిచ్చింది. ఈ ఉత్తర్వులను ఎన్ఆర్ఈజీఏ వెబ్‌సైట్‌లో కూడా పెట్టారు. ఈ నిధులకు రాష్ట్ర వాటా కూడా కలిపి మొత్తం రూ.740 కోట్లు చెల్లింపులు చేసే అవకాశం ఉంది. దీంతో గతేడాది అక్టోబరు వరకూ ఉపాధి పథకంలో మెటీరియల్ పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించే అవకాశం ఏర్పడిందని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు భావించారు. అయితే నిధులు ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కి లాగేసుకోవడంపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఈ పనులు చేపట్టిన వెండర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది పల్లెపండుగ 1.0 కింద రాష్ట్ర వ్యాప్తంగా సిమెంట్ రోడ్లు, మినీ గోకులాల నిర్మాణ పనులకు ఇప్పటికీ బిల్లులు పూర్తిగా చెల్లించలేదు. తాజాగా పల్లెపండుగ 2.0 పనులు కూడా భారీగా చేపడుతున్నారు. రాష్ట్రానికి సుమారు రూ.2వేల కోట్ల వరకూ బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికి కేంద్ర అధికారులు రాష్ట్రంపై చిన్నచూపు చూస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జోక్యం చేసుకుని రాష్ట్రానికి ఉపాధి మెటీరియల్ నిధులు తిరిగి మంజూరు చేయించాలని కోరుతున్నారు.

పదమూడేళ్లు వచ్చినా.. పసిబిడ్డే!

- శారీరక, మానసిక ఎదుగుదలలేని బాలిక
- వైద్యం చేయించలేని దీనస్థితిలో తల్లిదండ్రులు
- కనీసం పింఛనైనా ఇప్పించాలని వేడుకోలు



నలుగురు కుమార్తెలతో తల్లిదండ్రులు, తల్లి చేతుల్లో కీర్తన

కలువాయి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అమ్మ ఒడిలో ఉన్న ఈ బాలికను చూశారా!! చూడ్డానికి రెండేళ్ల వయసు చిన్నారిలా కనిపిస్తోంది కదూ! అయితే, మీరు పొరపడ్డట్టే!! ఆ బాలిక వయసు అచ్చంగా 13 ఏళ్లు. పుట్టినప్పటినుంచే సరైన శారీరక, మానసిక ఎదుగుదల లేదు. కూర్చోలేదు.. నిలబడలేదు.. ఎప్పుడూ తల్లి ఒడిలో ఉండాల్సిందే. మాటలు రావు. సమయానికి అన్నం పెడితే తింటుంది. లేదంటే అంతే! ఇదీ.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని మండల కేంద్రమైన కలువాయికి చెందిన బాలిక కీర్తన దీనగాథ. కలువాయిలోని గిరిజన కాలనీకి చెందిన గంటా వాసుదేవకుమార్, కృష్ణవేణి దంపతులు దినసరి కూలీలు. వీరికి స్వప్న, కీర్తన, అర్చన, నందన అనే నలుగురు ఆడపిల్లలు. రెండో కుమార్తె కీర్తనకు 13 ఏళ్ల వయస్సు. పుట్టినప్పటి నుంచే ఆ చిన్నారికి శారీరక, మానసిక ఎదుగుదల లేకపోవడంతో ఇప్పటికీ ఏడాది రెండేళ్ల చిన్నారిలా ఉంటుంది. కీర్తన పుట్టినప్పుడు బరువు కేవలం 750 గ్రాములు ఉందని, ఆ తర్వాత ఎదుగుదల లేదని ఆమె తల్లి కృష్ణవేణి కన్నీరు పెట్టుకుంది. వైద్యం చేయించేందుకు ఆర్థికస్తోమత సరిపోకపోవడంతో కుమార్తెను ఇంటివద్దే ఉంచుకున్నారు. కూలి పనులకు వెళ్లే దంపతులు.. కీర్తన ఆలనాపాలనా చూసుకునేందుకు ఏడో తరగతి చదువుతున్న మొద టి కుమార్తె స్వప్నను మూడేళ్ల క్రితం చదువు మాన్పించారు. స్వప్నకు చదువంటే ఎంతో ఇష్టమని ఇప్పుడు కూడా ఏదో ఒక పుస్తకం చదువుతూ ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉండేందుకు ఇల్లు కూడా లేని ఆ కుటుంబం అద్దె ఇంటిలో ఉంటోంది. కీర్తనకు ఆరోగ్యం బాగోలేనప్పుడు తమ బాధ వర్ణనాతీతంగా ఉందని, వైద్యులు పాపకు చికిత్స చేయాలన్నా భయపడుతున్నారని తల్లిదండ్రులు కన్నీరు పెట్టుకుంటున్నారు. సదరన్ క్యాంప్‌లో కీర్తనకు 90శాతం వికలత్వం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చినా పింఛను మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కలువాయికి వచ్చిన కలెక్టర్ హిమాన్షు శుక్లాకు కూడా తమ పరిస్థితి చెప్పుకుని పింఛను మంజూరు చేయాలని వేడుకున్నా, ఫలితం లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైకల్యంతో బాధపడుతున్న చిన్నారి పోషణకు పింఛనుతోపాటు అవసరమైన వైద్యసాయం అందేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

మోదీ సర్కారులో ఉపాధి పథకానికి ముప్పు

- కూటమితో పాటు జగన్ కూడా బీజేపీ బానిసే: వైఎస్ షర్మిల



కడపలో ఉపాధి హామీ కూలీలతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న షర్మిల

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజల వలసలు తగ్గించి, ఆకలి కేకలు లేకుండా చేసిన ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ సర్కారు నిర్వీర్యం చేస్తోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కడప నగరంలోని యానాది కాలనీలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధి హామీ కూలీలతో ఆమె రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2005లో గ్రామాల్లో వలసలు ఆపాలని, ఉపాధి కల్పించి ఆదుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వాన్ని ఒప్పించి అనంతపురం జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారన్నారు. నాటి నుంచి నేటి వరకు వలసలు ఆగి, పల్లె ప్రజలు ఉపాధి పనులతో జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి పథకానికి మోదీ సర్కారు గండి కొట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజల కోసం వైఎస్ తెస్తే.. తనయుడుగా ఆ పథకాన్ని కాపాడాల్సిన జగన్ బీజేపీకి బానిసగా మారారని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ వాది గాడ్సే గాంధీని హత్య చేస్తే, ఇప్పుడు ఉపాధి హామీ పథకానికి ఉన్న మహాత్మాగాంధీ పేరును తొలగించి మోదీ ఖూనీ చేశారని విమర్శించారు. మోదీ తెచ్చిన వీబీరామ్‌జీ చట్టం గ్రామ స్వరాజ్యానికి వ్యతిరేకమన్నారు. బీజేపీ మత రాజకీయాలకు జగన్ మద్దతు ఉండడం విచారకరమన్నారు. రాష్ట్రంలో ఎంపీలంతా బీజేపీ వారేనన్నారు. బాబు, పవన్‌తో పాటు జగన్ కూడా బీజేపీ బానిసలుగా మారారని ఎద్దేవా చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధమని షర్మిల తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

'నేనే రాజు.. నేనే మంత్రి..' అదే నిజమా..!

'ఓరి పొట్టోడా! నీకు ఉంటుంది'... అని రాజకీయ ప్రత్యర్థులు చులకనగా మాట్లాడితే మాట్లాడి ఉండవచ్చుగాక! 'నేను పొట్టివాడిని అయితే అయి ఉండ వచ్చునుగానీ గట్టివాడిని' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నాయకత్వంలో జరుగుతున్న ప్రతి ఎన్నికలో రుజువు చేసుకుంటున్నారు. తాజాగా జరిగిన మునిసిపల్ ఎన్నికల్లోనూ తన సత్తా చాటుకుంది కాంగ్రెస్ పార్టీ. స్థానిక ఎన్నికలు ఎక్కడ జరిగినా అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు రావడం సహజం! సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు స్థానిక ఎన్నికల ఫలితాలు ప్రామాణికం కాదు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, వైసీపీలు ఘన విజయం సాధించాయి. రెండు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలైన కాంగ్రెస్, తెలుగుదేశం కోలుకుంటాయా? అన్న సందేహాన్ని రాజకీయ విశ్లేషకులు వెలిబుచ్చారు. కాలం గిర్రున తిరిగి సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. రెండు రాష్ట్రాల్లోనూ అధికార పార్టీలు చతికిలపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో వెల్లడైన మునిసిపల్ ఎన్నికల ఫలితాలు మూడేళ్ల తర్వాత జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూడా ప్రతిఫలిస్తాయని భావించలేం! అయితే అదే సమయంలో ఈ ఫలితాలను తేలికగా తీసిపారేయ కూడదు. 'అధికారంలో ఉండి కూడా 90శాతం స్థానాలను గెలుచుకోలేకపోతే అదొక గెలుపా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేలికగా తీసిపారేసి ఉండవచ్చును గానీ, కాంగ్రెస్ గెలుపునకు ప్రాధాన్యం ఉంది. ఐదేళ్ల క్రితం స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగినప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉంది. అప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఏడాది తర్వాత మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. అయినా బీఆర్ఎస్ 90శాతం స్థానాలను గెలుచుకోలేదు. మొత్తం 120 మునిసిపాలిటీలకు గాను 81 బీఆర్ఎస్ గెలుచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ 116 మునిసిపాలిటీలకుగాను 74 మునిసిపాలిటీలను కైవసం చేసుకుంది. అప్పట్లో ఏడాది తర్వాత ఎన్నికలు జరగగా, ఇప్పుడు రెండేళ్ల తర్వాత జరగడం విశేషం. ప్రభుత్వాలు ఏర్పడిన రెండున్నరేళ్ల తర్వాత జరిగే స్థానిక ఎన్నికలు, ఉపఎన్నికల్లో ప్రజా వ్యతిరేకత ఉంటే అది ప్రతిబింబిస్తుంది. ప్రథమార్థంలో పాలకపక్షానికి ఉండే అనుకూలతలు క్రమంగా కరిగిపోతూ ఉంటాయి. ఈ కారణంగానే అనేక సందర్భాలలో ద్వితీయార్థంలో జరిగిన ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీలకు వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో తాజా మునిసిపల్ ఎన్నికలను చూడాలి.

> **కారణం తెలియదుగానీ కేసీఆర్ కుటుంబంపై బీజేపీ అగ్ర నాయకత్వానికి సదభిప్రాయం లేదు. ఈ కారణంగానే పొత్తు పెట్టుకుందామని బీఆర్ఎస్ నాయకులు స్వయంగా ప్రతిపాదించినా 'కుదరదు' అని బీజేపీ అగ్ర నాయకత్వం తేల్చి చెప్పింది. కోల్పోయిన ప్రజాభిమానం చూరగొనే ప్రయత్నం చేయకుండా తెలంగాణ సెంటిమెంటును మాత్రమే కేసీఆర్ అండ్ కో ఇంకా నమ్ముకుంటూ కాలక్షేపం చేస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయి. తెలుసుకోవలసింది కేసీఆర్ అండ్ కో మాత్రమే!**

పట్టు నిలుపుకొంటూ...

రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో ఈ మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వంపై కొంత కాలంగా విరుచుకుపడుతోంది. రేవంత్‌రెడ్డి సర్కార్ పనైపోయినట్టేనని ప్రచారం చేస్తోంది. ఆ పార్టీ నాయకులు అది నిజమని కూడా నమ్ముతున్నారు. ఈ ప్రచారానికి తోడు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినందున మునిసిపల్ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలపై సందేహాలు నెలకొన్నాయి. అయితే రాజకీయ పండితుల అంచనాకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించింది. కేటీఆర్ వంటి వారి కంటికి ఈ ఫలితాలు ఆనకపోయి ఉండ వచ్చుగానీ, కాంగ్రెస్ వంటి పార్టీ ఈ స్థాయి ఫలితాలు సాధించడం విశేషం. కాంగ్రెస్ అంటేనే అసమ్మతి గుర్తుకు వస్తుంది. ఆ పార్టీలో ఎవరికి వారే ముఖ్యమంత్రి స్థాయి నాయకులమని భావిస్తారు. ఏక నాయకత్వాన్ని అంగీకరించరు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే తీసుకుందాం! కాంగ్రెస్ పార్టీలో ఆయన జూనియర్ అని పలువురు వ్యాఖ్యానించడాన్ని చూస్తున్నాం. కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బేషరతుగా అంగీకరిస్తున్నారని చెప్పలేని పరిస్థితి. లాటరీ తగిలినట్టు రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కిందని భావిస్తున్నారుగానీ ఆయనలో నాయకత్వ పటిమ ఉందని అంగీకరించే స్థితిలో వారు లేరు. మొత్తంగా చూస్తే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా కనిపిస్తోంది. అయితే, రేవంత్‌రెడ్డి మాత్రం సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ పార్టీలో, ప్రభుత్వంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ వస్తున్నారు. పార్టీపై తనకు పట్టు లేదన్న అభిప్రాయాలను మనసుకు తీసుకోకుండా సందర్భం వచ్చినప్పుడు మాత్రం తనకున్న పట్టు ఏమిటో నిరూపించుకుంటున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో మంత్రులందరికీ జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించి సమన్వయం చేసుకొని సత్ఫలితాలను సాధించారు. కాంగ్రెస్ పార్టీ పనైపోయిందని పలువురు భావిస్తున్న వేళ... అందులో నిజం లేదని రుజువు చేస్తూ వస్తున్నారు.

ఉత్తర దక్షిణాల్లో 'హస్త'వాసి

ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ అన్న తేడా లేకుండా దాదాపు అన్ని జిల్లాల్లోనూ మంచి ఫలితాలను సాధించేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేశారు. ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ బలంగా ఉన్నాయన్న అభిప్రాయం ఇప్పటిదాకా ఉండింది. అయితే, మునిసిపల్ ఎన్నికల ఫలితాలు ఈ అంచనాలను పటాపంచలు చేశాయి. ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ బలంగా ఉన్నట్టు కనిపించేది. ఈ ఎన్నికల ఫలితాలతో అందులో కూడా నిజం లేదని తేలిపోయింది. బీఆర్ఎస్ ఉమ్మడి మెదక్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లోనే ప్రభావం చూపగలిగింది. 'తెలంగాణలో నేనే రాజు – నేనే మంత్రి' అని రేవంత్‌రెడ్డి ప్రకటించిన రెండో రోజే వెలువడిన మునిసిపల్ ఎన్నికల ఫలితాలు ముఖ్యమంత్రి మాటల్లో నిజం లేకపోలేదన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. తనకంటే ఎంతో మంది సీనియర్లున్న కాంగ్రెస్‌ను ఏక తాటిపై నడిపించడంలోనూ రేవంత్‌రెడ్డి కృతకృత్యులయ్యారు. కాంగ్రెస్ సీనియర్లు కూడా తన నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితిని కల్పిస్తూ వస్తున్నారు. రాజకీయాల్లో పార్టీలకైనా, నాయకులకైనా ఎన్నికల ఫలితాలే గీటురాయి. మొన్న పంచాయతీ ఎన్నికలు, నిన్న మునిసిపల్ ఎన్నికల్లో 60 శాతం పైగా స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా తన నాయకత్వ విషయంలో ఎదురవుతున్న ఆటంకాలను ఆయన అధిగమిస్తూ వచ్చారు. ఈ ఫలితాలతో పాటు తెలంగాణలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ముఖ్యమంత్రిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నట్టుగా ఉంది.

కాంగ్రెస్‌లో కొత్త లెక్క...

2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి తాజాగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ సంస్కృతికి ఇలాంటి ప్రకటనలు విరుద్ధం. అధిష్ఠానం ఎవరిని నిర్ణయిస్తే వారే ముఖ్యమంత్రి అని ప్రకటించడం కాంగ్రెస్ ఆనవాయితీ. దీనికి భిన్నంగా, గతంలో ఏ కాంగ్రెస్ నాయకుడూ సాహసించని విధంగా వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడకపోవచ్చుగానీ... మునిసిపల్ ఎన్నికల ఫలితాలతో నిరసన వ్యక్తం చేయలేని అసహాయ స్థితి ఏర్పడింది. ప్రస్తుతానికి కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఒక్కరే బయటపడ్డారు. కాంగ్రెస్ రాజకీయాలను గమనించే వారికి మాత్రం రేవంత్‌రెడ్డి తాజా వ్యాఖ్యలు ఆశ్చర్యపరచక మానవు. "ఆయన తెలంగాణకు మాత్రమే నేనే రాజు – నేనే మంత్రి అన్నట్టుగా లేదు. కాంగ్రెస్ పార్టీలో కూడా ఆయనే రాజు ఆయనే మంత్రి అన్నట్టుగా ఉంది" అని ఒక ప్రముఖుడు వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో రేవంత్‌రెడ్డిది దూకుడు స్వభావం. ఆ దూకుడే ఆయనకు ఇప్పటివరకూ కలసి వచ్చింది. చిన్న వయసులోనే ముఖ్యమంత్రి కాగలిగారు. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఈ ఫలితాలు ప్రభుత్వంలో, పార్టీలో రేవంత్‌రెడ్డి స్థానం మరింత పటిష్ఠమవడానికి మాత్రమే ఉపయోగపడతాయి. సార్వత్రిక ఎన్నికలకు ఇంకో మూడేళ్ల వ్యవధి ఉంది. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని ముఖ్యమంత్రి చెబుతున్నారు. అది నిజమైతే బీఆర్ఎస్‌కు మైనస్ అవుతుంది. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోగలిగితే పదేళ్లకు పైగా ముఖ్యమంత్రిగా ఉండాలన్న తన లక్ష్యాన్ని రేవంత్‌రెడ్డి నెరవేర్చుకోవచ్చు.

> **రాజకీయాల్లో పార్టీలకైనా, నాయకులకైనా ఎన్నికల ఫలితాలే గీటురాయి. మొన్న పంచాయతీ ఎన్నికలు, నిన్న మునిసిపల్ ఎన్నికల్లో 60 శాతం పైగా స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా తన నాయకత్వ విషయంలో ఎదురవుతున్న ఆటంకాలను రేవంత్ రెడ్డి అధిగమిస్తూ వచ్చారు.**

దిద్దుబాట పట్టాలి...

మునిసిపల్ ఎన్నికల ఫలితాలను పక్కనపెట్టి నిష్పాక్షికంగా గమనిస్తే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన విరుగుడు చర్యలు అనేకం ఉన్నాయి. ముందుగా ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. ఈ అంశంపై కూడా ముఖ్యమంత్రి దృష్టి సారించాలి. తెలుగు ప్రజలు చాలా కాలంగా ప్రాంతీయ పార్టీల ఏలుబడికి అలవాటుపడి ఉన్నారు. ఈ కారణంగానే బహు నాయకత్వం వింతగా కనిపిస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారు. అప్పుడు అధికారం అంతా ఆయన చుట్టూనే కేంద్రీకృతం అయి ఉండేది. ప్రభుత్వం అంటే కేసీఆర్ – కేసీఆర్ అంటే ప్రభుత్వం అన్న అభిప్రాయం ఏర్పడింది. అది వాంఛనీయమా? కాదా? అన్నది పక్కనపెడితే, అదుపులేని స్వేచ్ఛ కూడా మంచిది కాదు. ఏ ప్రభుత్వంలోనైనా ముఖ్యమంత్రి నిర్ణయమే ఫైనల్ అన్నట్టుగా ఉండాలి. ఇప్పుడు తెలంగాణలో అటువంటి అభిప్రాయం లేదు. కొంతమంది మంత్రులు సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారన్న అభిప్రాయం ఉంది. మంత్రులకు వారి శాఖల విషయంలో స్వేచ్ఛ ఉండాలిగానీ, అది అపరిమితం కాకూడదు. ముఖ్యమంత్రి కూడా జోక్యం చేసుకోలేనంత స్వేచ్ఛ మంత్రులకు వాంఛనీయం కాదు. మంత్రులెవరైనా ముఖ్యమంత్రి అధికారానికి లోబడే పనిచేయాలి. ఇలాంటి లోపాలను సరిదిద్దుకోగలిగితే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూడా రేవంత్‌రెడ్డి నాయత్వంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించవచ్చు. అయితే రాజకీయాలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. ఎప్పుడైనా ఏమైనా జరగవచ్చు. ఒక్క సంఘటన చాలు రాజకీయ సమీకరణాలను మార్చివేయడానికి!

ప్రతిపక్షాల పరిస్థితి ఇదీ...


ఇప్పుడు భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల విషయానికి వద్దాం! రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి తొమ్మిదిన్న రేళ్లు తెలంగాణను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన కేసీఆర్‌కు ఇంకా మంచి రోజులు వచ్చినట్టు లేవు. రేవంత్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా విజయం తమదే అని బీఆర్ఎస్ నాయకులు తలపోస్తూ వచ్చారు. ఈ భావన బలపడి, ఆ పార్టీకి చెందిన కేటీఆర్, హరీశ్‌రావు వంటి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఇటీవలి కాలంలో ఆత్మవిశ్వాసం కాస్తా అతివిశ్వాసంగా మారింది. నిజానికి రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణలో జరిగిన ఏ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ చెప్పుకో దగిన ఫలితాలను సాధించలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటే తమకు లెక్కలేదని చెప్పడానికే బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారు తప్ప తమకు దూరమైన ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేయలేదు. కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణను టచ్ చేసినట్టేనని భ్రమిస్తూ కాలం గడుపుతున్నారు. కేసీఆర్‌ను కాళేశ్వరం, టెలిఫోన్ ట్యాపింగ్ కేసులలో విచారణకు పిలిపించడం జరిగింది. కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణను టచ్ చేసినట్టే... అనే మాటలే నిజమైతే ఈ విచారణ తర్వాత ప్రజల్లో ఆయనపై సానుభూతి పెల్లుబికి మునిసిపల్ ఎన్నికల్లో ఎంతో కొంత అది ప్రతిఫలించాలి కదా? అదేమీ జరగలేదు! ఉమ్మడి మెదక్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు లేకపోతే బీఆర్ఎస్ పరిస్థితి మరీ అన్యాయంగా ఉండేది. హరీశ్‌రావు పుణ్యమా అని ఉమ్మడి మెదక్ జిల్లాలో కొన్ని మునిసిపాలిటీలను గెలుచుకోగలిగారు. హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉండటంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించి ఉండటం వంటి కారణాల వల్ల ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉంది. ఫలితంగా ఈ జిల్లాలో కొన్ని మునిసిపాలిటీలను బీఆర్ఎస్ గెలుచుకో గలిగింది. ఉద్యమ సమయంలో బలంగా కనిపించిన నిజామాబాద్ వంటి జిల్లాలో బీఆర్ఎస్ నానాటికీ బలహీనపడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. బీఆర్ఎస్ నాయకులు తక్షణం ఆత్మ విమర్శ చేసుకొని విరుగుడు చర్యలు తీసుకోని పక్షంలో పార్టీ మనుగడకే ముప్పు రావొచ్చు. మునిసిపాలిటీలతో పోల్చితే నగరపాలక సంస్థల్లో బీఆర్ఎస్ పనితీరు మరీ పేలవంగా ఉంది.

> **బలమైన నాయకులను ప్రోత్సహించినప్పుడే తెలంగాణలో బలపడగలమని బీజేపీ అగ్ర నాయకత్వం గుర్తించాలి. కరీంనగర్, నిజామాబాద్ నగర పాలక సంస్థల్లో బలంగా ప్రభావం చూపగలిగారంటే అక్కడ బండి సంజయ్, ధర్మపురి అరవింద్ వంటి వారు ఉండటమే కారణం.**

పట్టణాల్లో బీజేపీ, గ్రామాల్లో కాంగ్రెస్ మరింతగా బలపడితే బీఆర్ఎస్ పరిస్థితి ఏమిటి? పట్టణ ప్రాంత ప్రజల్లో కేసీఆర్ కుటుంబంపై ఏర్పడిన వ్యతిరేకత ఇంకా తొలగిపోలేదా? అన్న అనుమానం కలుగుతోంది. కేవలం అహంకారం కారణంగానే గత ఎన్నికల్లో కేసీఆర్ ఓడిపోయారని ఆయన కుమార్తె కవిత రెండు రోజుల క్రితం విమర్శించారు. అధికారం తలకెక్కి అహంకారంతో వ్యవహరిస్తూ, ప్రశ్నించిన వారిపై కత్తి దూశారని కవిత చేసిన విమర్శలను తేలికగా తీసుకోవడానికి లేదు. బీఆర్ఎస్‌ను విమర్శిస్తున్న కవితను కూడా వారు ఇప్పుడు తెలంగాణ ద్రోహి అంటారేమో తెలియదు. మునిసిపల్ ఎన్నికల్లో తమకు ఓటు వేయని ప్రజలను కూడా తెలంగాణ ద్రోహులు అని నిందిస్తారా? ఆత్మవంచన, పరనింద ఎల్లకాలం చెల్లుబాటుకావని బీఆర్ఎస్ నాయకులు గ్రహించాలి. తెలంగాణను పాలించమని ప్రజలు అధికారం ఇస్తే... ఏకంగా దేశాన్ని ఏలాలని కలలు కని, తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చుకొని, చేతిలో ఉన్న డబ్బును కేసీఆర్ పోగొట్టుకోగా, సోషల్ మీడియాను మాత్రమే నమ్ముకొని కేటీఆర్ కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నారు. తాను ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియాలో పనిచేసేవారు పెడుతున్న వీడియోలు, పోస్టులు చూసుకుంటూ అదే నిజమని నమ్ముతూ కేటీఆర్ భ్రమల్లో బతుకుతున్నారు. తమ లోపాలను ఎత్తిచూపే వారిని తెలంగాణ ద్రోహులుగా ముద్ర వేస్తూ ఆత్మవంచనకు పాల్పడుతూ కాలక్షేపం చేస్తే ప్రయోజనం ఉండదు. రక్తం పంచుకుపుట్టిన కవిత మాటలనైనా కేసీఆర్ సీరియస్‌గా తీసుకుంటే ఆయనకే మంచిది. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించినందుకుగాను కేసీఆర్ కుటుంబాన్ని తొమ్మిదిన్నరేళ్లపాటు తెలంగాణ సమాజం ఆదరించి అధికారం కట్టబెట్టింది. అధికారంతోపాటు వచ్చిన సంపద అదనం! తెలంగాణ తెచ్చినందుకు ఇంకేమి చేయాలి? దేశానికి స్వాతంత్ర్య సాధనలో నాయకత్వం వహించిన మహాత్మాగాంధీ కుటుంబానికి దేశం ఏమిచ్చింది? స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వదేశీ శక్తుల చేతిలో ప్రాణాలు వదిలిన గాంధీ కుటుంబీకులు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? తనదైన పంథాలో స్వాతంత్ర్య పోరాటం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ కుటుంబం పరిస్థితి ఏమిటి? ఆ కుటుంబాల పరిస్థితి చూస్తే కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ సమాజం చాలా ఎక్కువే చేసింది. రుణం తీర్చుకుంది. ఇప్పటికైనా కేసీఆర్ కుటుంబం నేల మీదకు దిగివస్తే వారికే మంచిది. లేని పక్షంలో ఇలాంటి ఎన్నికల ఫలితాలే వస్తూ ఉంటాయి. పార్టీ పరిస్థితి మరింత దిగజారినా ఆశ్చర్యపోవాల్సింది లేదు.

బీజేపీ: బలపడే అవకాశమున్నా!

ఇప్పుడు భారతీయ జనతా పార్టీ విషయానికి వద్దాం! తెలంగాణలో మరింతగా బలపడే అవకాశం ఉన్నప్పటికీ, కారణం తెలియదుగానీ ఆ పార్టీ అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో తెలంగాణలో ఆ పార్టీ మరింత బలపడి ఉండాల్సింది. అలా ఎందుకు జరగడం లేదో ఆత్మపరిశీలన చేసుకోవాలి. బీఆర్ఎస్ నాయకులు ఒక దశలో తమ పార్టీని బీజేపీలో విలీనం చేయడానికి లేదా పొత్తు పెట్టుకోవడానికి ప్రతిపాదించారు. అయినా ఆ ప్రతిపాదనలను బీజేపీ అగ్ర నాయకత్వం తిరస్కరించింది. తెలంగాణలో సొంతంగానే అధికారంలోకి రావాలన్నది ఆ పార్టీ అధినాయకత్వం ఆకాంక్ష. అలాంటప్పుడు అందుకు తగిన వ్యూహాలను రూపొందించుకోవాలి కదా? బలమైన నాయకులను ప్రోత్సహించినప్పుడే తెలంగాణలో బలపడగలమని బీజేపీ అగ్ర నాయకత్వం గుర్తించాలి. కరీంనగర్, నిజామాబాద్ నగర పాలక సంస్థల్లో బలంగా ప్రభావం చూపగలిగారంటే అక్కడ బండి సంజయ్, ధర్మపురి అరవింద్ వంటి వారు ఉండటమే కారణం. గట్టి నాయకులు ఉన్నచోట బీజేపీ ప్రభావం చూపగలుగుతోంది. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. అదే జరిగితే... బీజేపీకి అనుకూలించే అంశం అవుతుంది. జమిలి ఎన్నికల వల్ల జాతీయ పార్టీలకు అదనపు ప్రయోజనం ఉంటుంది. తెలంగాణ ప్రజల్లో కూడా ప్రధాని మోదీకి మంచి ఆదరణ ఉంది. ఈ కారణంగానే గత లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఎనిమిది సీట్లు లభించాయి. 2029లో నిజంగానే జమిలి ఎన్నికలు వస్తే జాతీయ రాజకీయాల ప్రభావంతో శాసనసభ ఎన్నికల్లో కూడా బీజేపీ లాభపడవచ్చు. అయితే ఇప్పటినుంచే అందుకు తగిన వ్యూహరచన చేసుకోవాలి. జమిలి ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. లోక్‌సభ ఎన్నికలు కూడా ఉంటాయి కనుక ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంటుంది. అదే జరిగితే ఆ ప్రభావం అసెంబ్లీ ఎన్నికల మీద కూడా పడి బీఆర్ఎస్ నష్టపోవచ్చు. ఇప్పుడు వెలువడిన మునిసిపల్ ఎన్నికల ఫలితాలతో నిమిత్తం లేకుండా తెలంగాణ రాజకీయాలు ఉంటాయని మాత్రం చెప్పవచ్చు. కేసీఆర్ అండ్ కో ఈ ముప్పును ఎలా అధిగమిస్తారో వేచి చూడాలి. కారణం తెలియదుగానీ కేసీఆర్ కుటుంబంపై బీజేపీ అగ్ర నాయకత్వానికి సదభిప్రాయం లేదు. ఈ కారణంగానే పొత్తు పెట్టుకుందామని బీఆర్ఎస్ నాయకులు స్వయంగా ప్రతిపాదించినా 'కుదరదు' అని బీజేపీ అగ్ర నాయకత్వం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి తాను నిలదొక్కుకొని పార్టీని పటిష్ఠం చేయడానికి కేసీఆర్ ఎటువంటి వ్యూహాలు రచించుకుంటారో వేచిచూడాలి. కోల్పోయిన ప్రజాభిమానం చూరగొనే ప్రయత్నం చేయకుండా తెలంగాణ సెంటిమెంటును మాత్రమే కేసీఆర్ అండ్ కో ఇంకా నమ్ముకుంటూ కాలక్షేపం చేస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయి. తెలుసుకోవలసింది కేసీఆర్ అండ్ కో మాత్రమే!



> **తెలంగాణలో ఐదేళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికలయిన ఏడాది తర్వాత మునిసిపల్ ఎన్నికలు జరగగా, ఇప్పుడు రెండేళ్ల తర్వాత జరగడం విశేషం. ప్రభుత్వాలు ఏర్పడిన రెండున్నరేళ్ల తర్వాత జరిగే స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకత ఉంటే అది ప్రతిబింబిస్తుంది. ప్రథమార్థంలో పాలక పక్షానికి ఉండే అనుకూలతలు క్రమంగా కరిగిపోతూ ఉంటాయి. ఈ కారణంగానే అనేక సందర్భాలలో ద్వితీయార్థంలో జరిగిన ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీలకు వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో తాజా మునిసిపల్ ఎన్నికలను చూడాలి.**

> **కాంగ్రెస్ అంటేనే అసమ్మతి గుర్తుకు వస్తుంది. ఆ పార్టీలో ఎవరికి వారే ముఖ్యమంత్రి స్థాయి నాయకులమని భావిస్తారు. ఏక నాయకత్వాన్ని అంగీకరించరు. కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బేషరతుగా అంగీకరిస్తున్నారని చెప్పలేని పరిస్థితి. లాటరీ తగిలినట్టు రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కిందని భావిస్తున్నారుగానీ ఆయనలో నాయకత్వ పటిమ ఉందని అంగీకరించే స్థితిలో వారు లేరు. మొత్తంగా చూస్తే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా కనిపిస్తోంది. అయితే, రేవంత్‌రెడ్డి మాత్రం సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ పార్టీలో, ప్రభుత్వంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ వస్తున్నారు. పార్టీపై తనకు పట్టు లేదన్న అభిప్రాయాలను మనసుకు తీసుకోకుండా సందర్భం వచ్చినప్పుడు మాత్రం తనకున్న పట్టు ఏమిటో నిరూపించుకుంటున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో మంత్రులందరికీ జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించి సమన్వయం చేసుకొని సత్ఫలితాలను సాధించారు.**

పులిని బతకనివ్వండి!

> **మనిషి శాకాహారం తినగలిగి కూడా రోజూ కోట్ల కొద్దీ కోళ్లు, మేకలను ఆహారం కోసం హతమారుస్తున్నాడు. మాంసాహార జీవి అయిన పెద్దపులి మాత్రం ఏం చేస్తుంది?! ఆకలి తీర్చుకోవడానికి తనకు ఎదురైన జంతువులను వేటాడుతున్నది. పులిని చంపే హక్కు మనిషికి ఉందా?**



రక్తం మరిగిన పులి.. క్రూరంగా ప్రవర్తిస్తున్న పులి.. మనుషుల వెంట పడుతున్న పులి.. పశువులను చంపుతున్న పులి.. ప్రమాదకారిగా మారిన పులి... ఇలా రకరకాల పదాలు మనకీమధ్య సోషల్ మీడియాలో బాగా వినిపిస్తున్నాయి. ఈ పదాల వెనక ఎంత వాస్తవం ఉంది? ఒక కుక్కను చంపాలనుకున్నప్పుడు దాన్ని పిచ్చిదని ముద్ర వేస్తే చంపడం సులభమవుతుంది.

పెద్దపులి పరిస్థితి కూడా ఇలాగే తయారైందనిపిస్తున్నది. వాటి ఆవాసాలు ధ్వంసమైపోయి అడివంటూ మిగలకపోయేసరికి దిక్కుతోచక వందల కిలోమీటర్లు నడిచి, తలదాచుకునే చోటు కోసం వెతుక్కుంటూ వస్తున్నాయి. తినడానికి తిండి లేక కాలే కడుపుతో అడవిని వెతుక్కుంటూ గ్రామాల వైపు నడిచి వస్తున్నాయి. వాటి ప్రయాణం మధ్యలో తగిలే జనావాసాలు, పంట పొలాలు, మానవ సంచారం... వాటిని మరింత ఆందోళనకు, భయానికి గురిచేస్తున్నాయి.

మనిషి శాకాహారం తినగలిగి కూడా రోజూ కోట్ల కొద్దీ కోళ్లు, మేకలను తన ఆహారం కోసం హతమారుస్తున్నాడు. మాంసాహార జీవి అయిన పెద్దపులి మాత్రం ఏం చేస్తుంది?! ఆకలి తీర్చుకోవడానికి, తనకు ఎదురైన జంతువులను వేటాడుతున్నది. తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నది. మనిషి తనకు హఠాత్తుగా ఎదురుపడితేనో లేదా తనకు హాని చేయజూస్తేనో ఆత్మరక్షణార్థం ఎదురు దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నది.

రోజురోజుకూ అటవీ విస్తీర్ణం తగ్గిపోతుంటే, అడవులన్నీ పోడుగా మారిపోతుంటే, వేటగాళ్లు అడవిలో ఉచ్చులు పెట్టి విచ్చలవిడిగా అటవీ ప్రాణుల్ని చంపి తింటుంటే పులులకు తినడానికి తిండి లేక సంచారం మొదలుపెట్టాయి. ఆహార పిరమిడ్‌లో పై భాగంలో పులి ఉంటుంది, అది బతికితేనే అడవి చల్లగా ఉంటుంది, అడవిలో సమతుల్యత ఉంటుంది... పర్యావరణం నిలబడుతుంది. అలాంటి అడవుల్ని రోజురోజుకూ ధ్వంసం చేస్తూ కొంత మంది ఆ భూముల్ని ఆక్రమిస్తుంటే ఒక మంత్రేమో, ఆ భూములకు పట్టాలిస్తాను అంటాడు! అటవీ శాఖ మంత్రేమో– అడవులు నరక వద్దంటాడు. ఒకే ప్రభుత్వంలో ద్వంద్వ వైఖరి ఇది. మనం తరచూ చూస్తున్న చోద్యమే!

మహారాష్ట్రలోని తడోబా, ముఖ్యంగా తిప్పేశ్వర్ అటవీ ప్రాంతాల వరకు మనం వెళ్లి చూడగలిగితే అక్కడ పెరుగుతున్న రిసార్టులతో పాటు గ్రామాలకు గ్రామాలే అడవిని ఆక్రమిస్తున్న వైనం మనకు కనిపిస్తుంది. తిప్పేశ్వర్ కేవలం 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న చిన్న అడవి. అక్కడ ఈ పెద్దపులులు తలదాచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. నానాటికీ కుంచించుకుపోతున్న అడవితో వాటికి నిలువనీడ లేక ప్రాదేశిక తగాదాలతో వాటిలో అవి పోరాటాలు చేసి, ఓడిన పులులు తాము తల దాచుకునే స్థలం కోసం వలసబాట పడుతున్నాయి. వందల కిలోమీటర్లు ప్రయాణించినా అవి బతకడానికి అడవంటూ మిగిలితే కదా! ఒక పులి 600 కిలోమీటర్లు ప్రయాణించి రాజమండ్రి పరిసరాలకు చేరుకున్న వైనం మీరు వినే ఉంటారు! సురక్షితంగా మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆ పులిని విశాఖ జూకు తరలించిన విషయం విని సంతోషించాను. ఎందుకంటే దాన్ని రక్తం మరిగిన పులి అనో.. ప్రమాదకారి అనో ముద్ర వేసి చంపలేదు.

ఇప్పుడు పడుతున్న ఆందోళన అంతా జనగామ, సిద్దిపేట ప్రాంతాల్లో తిరుగుతున్న పులి గురించి. దానినే ఇష్టం వచ్చినట్టు సోషల్ మీడియాలో ప్రమాదకారి అని, రక్తం మరిగిన పులి అని రకరకాలుగా ఆకతాయితనంతో దుష్ప్రచారం చేస్తున్నారు. ఒకసారి ఆ పులిని ప్రమాదకారిగానో లేదా మనుషుల్ని తినేదిగానో ముద్ర వేస్తే దాని కథ ముగిసిపోయినట్టే! మత్తు తూటాతో నిద్రపుచ్చి పెద్దపులిని సంరక్షించాల్సిన చేతులే, దాన్ని పట్టుకోవడం మా వల్ల కాదు అని చేతులెత్తేస్తే... రేపు జరగబోయేది ఇదే!

ఈ మధ్య మహారాష్ట్ర అసెంబ్లీలోనైతే ఒక మంత్రి– చిరుత పులి వేషంలో వచ్చి, 'అవి జన జీవనానికి ఆటంకం కలిగిస్తున్నాయి, వాటిని చంపేయండి' అని బహిరంగంగా అనడం ఆందోళనకరం. నిజంగా వాటిపై ఏదో ఒక ముద్ర వేసి చంపే హక్కు మనిషికి ఉందా? ఈ భూమిపై ప్రతి ప్రాణికి మనిషితో సమానంగా బతికే హక్కు ఉంది. కానీ మనిషి ఏదో ఒక ముద్ర వేసి వాటిని చంపజూడడం ఎంతవరకు న్యాయం? వాటి నోటికాడి కూడు లాగేసుకుంటూ వాటి ఆవాసాలను ధ్వంసం చేశాక ఆ అసహాయ జీవులు మాత్రం ఏం చేస్తాయి? వీధి కుక్కలు, కోతుల గురించి మాట్లాడే జంతు ప్రేమికుల గొంతు, పులి పట్ల ఎందుకు మూగబోయింది? కుక్కలు, కోతులు మాత్రమే జంతువులా? మనిషి వల్ల రోజూ అనేక రకాల జీవజాతులు శాశ్వతంగా కాలగర్భంలో కలిసిపోతున్నాయి.

పులి ఠీవికి, రాజసానికి, అందమైన మేని ఛాయకు పెట్టింది పేరు. అన్నిటికంటే ముఖ్యంగా స్వేచ్ఛకు ప్రతీక. దానిని జూలలో సంరక్షణ పేరిట బంధించకండి. స్వేచ్ఛగా అడవులలో తిరగనివ్వండి. పులి అడుగుల సవ్వడి వినిపించని అడవులు శ్మశానంతో సమానం. ఆ అందమైన జంతువును బతకనివ్వండి. అడవిని సంరక్షించాలని, జంతువుల్ని రక్షించాలని కలలు కని ఫారెస్ట్ ఆఫీసర్లుగా మారిన నిజాయితీ గల అటవీశాఖ ఉద్యోగులకు ఆయుధాలు ఇవ్వండి, అడవుల విస్తీర్ణాన్ని కాపాడండి. కవ్వాల్, నల్లమల అడవుల్లో పులిగర్జన వినిపించనీయండి!!

▪ డా. అంబటి శ్రీనివాస్‌రాజు

ఆంధ్రజ్యోతి
గుంటూరు
5 ఆదివారం 15 ఫిబ్రవరి 2026


విద్యుత్ వెలుగుల్లో కోటప్పకొండ

శివమయం

- కాంతులీనుతోన్న కోటప్పకొండ క్షేత్రం
- కోటయ్యస్వామి తిరునాళ్లకు భారీగా ఏర్పాట్లు
- 100 అడుగుల ఎత్తులో 23 భారీ విద్యుత్ ప్రభలు
- త్రికోటేశ్వరునికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఉత్సవాలకు సిద్ధమైన శైవక్షేత్రాలు


తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా


ఎస్పీ కృష్ణారావు పర్యటన


కోటప్పకొండ: నందికి పసుపునీటితో అభిషేకం

నేడే మహాశివరాత్రి. శివస్తోత్రాల నామస్మరణలతో భక్తులు పరవశంలో మునిగిపోగా.. శైవక్షేత్రాలు తిరునాళ్లకు సిద్ధమయ్యాయి. పల్నాడు, గుంటూ రు, బాపట్ల జిల్లాల పరిధిలోని శైవక్షేత్రాలు, శివాల యాలు విద్యుత్ వెలుగుల్లో కాంతులీ నుతున్నాయి. భక్తులు ప్రభలతో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఆల యాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కల్యాణో త్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. శైవక్షేత్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా.. దర్శనాల సమయంలో భక్తులు ఇబ్బంది పడకుండా అధికారులు సకల ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి ఉత్సవాలు, తిరునాళ్లను పురస్కరించు కుని కోటప్పకొండ, గోవాడ, క్వారీలకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసింది. కాగా దేశ ప్రసిద్ధి చెందిన కోటప్ప కొండ తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలివస్తా రన్న అంచనాలతో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర పండుగ హోదా నేపథ్యంలో ప్రభుత్వం తరపున త్రికోటేశ్వరస్వామికి ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టువస్త్రాలు, వెండి ప్రభను సమర్పించ నుండగా అందుకు దేవదాయ శాఖ ఏర్పాట్లు చేసింది.

వనదుర్గాదేవీగా భ్రమరాంబ

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శని వారం భ్రమరాంబ అమ్మవారి వనదుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉత్సవాల్లో నాలుగో రోజు సుప్రభాతసేవ, మహా హారతి, మహాన్యా సపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు, పంచహారతులు నిర్వహించారు. మ యూర వాహనంపై స్వామివార్లకు గ్రామోత్సవం


పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం

నిర్వహించగా భక్తులు దర్శించుకుని తరించారు. విద్యుత్ కాంతులతో మల్లేశ్వరస్వామి దేవస్థానం దేదీప్యమానంగా వెలుగొందుతుంది. ఆదివారం మహాశివరాత్రికి భారీగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలు, పార్కింగ్ ప్రదేశాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజాము 3 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించనున్నారు.

పులివాహనంపై గ్రామోత్సవం

అమరావతి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో బాలచాముండి సమేత అమరేశ్వరస్వామికి శనివారం పులివాహనం, పల్లకిలో



గ్రామోత్సవం నిర్వ హించారు. ఉదయం మండప పూజ, నిత్యో పాసన, రుద్ర హోమం, బలిహరణ కార్యక్ర మాలు జరిగాయి. మూల విరాట్‌కు ఆది వారం ఉదయం నా లుగు గంటలకు తొలి అభిషేకం నిర్వహించనున్నట్లు అర్చ కులు తెలిపారు. రాత్రి 9 గం టల కు లింగోద్భవకాల అభి షేకం, ఒంటిగంటకు ఎదురు కోల ఉత్సవం, తెల్లవారు జామున 3 గంటలకు కల్యాణోత్సవం జరగనున్నది.

గోవాడలో పశు ప్రదక్షిణలు

అమృతలూరు: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భం గా గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో ఆది వా రం భక్తులు పశువులను అలంకరించి తీసుకువచ్చి ప్రద క్షిణలు చేశారు. స్వామి వారికి వెన్న తదితర మొక్కు లను భక్తులు చెల్లించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద చలువ పందిళ్లను నిర్మించి, ప్రత్యేకంగా క్యూలు ఏర్పాటు చేశారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఐదు రోజులు జరగడం విశేషం.


గోవాడ: పశువులతో ప్రదక్షిణ చేస్తున్న రైతులు

క్వారీ.. భక్త సంద్రం

చేబ్రోలు: వడ్లమూడి క్వారీ వద్ద కొలువై ఉన్న శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయం స ర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శివయ్య దర్శనం కోసం వేలాదిగా తరలివస్తున్న భ క్తులతో ఆలయ ప్రాంగణం జనసంద్రాన్ని తలపి స్తోంది. పలు గ్రామాల నుంచి భక్తులు ఎడ్లబం డ్లు, ట్రాక్టర్లపై బాలప్రభలను మేళతాళాలతో స్వా మివారి సన్నిధికి తీసుకొచ్చారు. వడ్లమూడి పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావర ణం ఉట్టిపడుతోంది. భక్తుల కోలాట ప్రద ర్శనలు, శివనామ స్మరణలతో పరిసర ప్రాంతాలు మారుమోగుతున్నాయి. నారాకోడూరు లో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభలు ఆకట్టు కుంటున్నాయి.



విద్యుత్ కాంతులతో క్వారీ బాలకోటేశ్వరాలయం



కొండకు పయనమైన ప్రభలు..

కోటప్పకొండ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి 23 భారీ విద్యుత్ ప్రభలు శనివారం పయనమయ్యాయి. ప్రభల రాక కోసం చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం, గణపవరం గ్రామాల నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట మండలం పురుషోత్తమపట్నం నుంచి ఆరు, గంగన్నపాలెం నుంచి రెండు, బొ ప్పూడి నుంచి రెండు, కమ్మవారిపాలెం, మద్ది రాల, గోవిందాపురం, కోమటినేని వారిపా లెం, కావూరు, యడవల్లి, నరసరావుపేట మండలం ఉప్పలపాడు, గురవాయపాలెం, కాకాని, చింతలపాలెం నుంచి ఒక్కొక్క ప్రభలు కొండకు వస్తున్నాయి. నరసరావుపేట పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రభలు కొండకు తరలి వస్తు న్నాయి.

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు కోటప్పకొండ ముస్తాబైంది. ఆదివారం అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లలో 100 అడుగుల ఎత్తులో 23 ప్రభలు కాంతులీన నున్నాయి. శనివారం ఉదయం ఆయా గ్రామల నుంచి ఊరేగింపుగా ప్రభలు కొండకు పయనమయ్యాయి. కోటప్పకొండ దిగువన, దేవస్థాన ప్రాంగణాన్ని విద్యు త్ దీపాలతో ముస్తాబు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సత్యసాయి సేవా సమితి (మిగతా 6వ పేజీలో)


కాంతులీనుతున్న కోటప్పకొండ దిగువ ప్రాంతం



అనుసంధానం.. అమరావతికి నిధులు

బడ్జెట్‌లో కేటాయింపులు

- గోదావరి-పెన్నా తొలిదశకు రూ.200 కోట్లు
- డెల్టా, పులిచింతల ప్రాజెక్టులకు రూ.300 కోట్లు
- రాజధాని అభివృద్ధి మూలధనంగా రూ.6 వేల కోట్లు
- సూర్యలంక బీచ్‌లో అభివృద్ధి పనులకు ఆమోదం

గుంటూరు, తుళ్లూరు, బాపట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు గోదావరి - పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టుని ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో శనివారం ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా అమరావతితో పాటు నదుల అనుసంధానానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. గత బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించినా వాటిని ఖర్చు చేయలేదు. ఈ క్రమంలో తాజా బడ్జెట్‌లో మరోసారి రూ.200 కోట్లను కేటాయించారు. బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా నిధులు విడుదల జరిగితే నదుల అనుసంధానం పనులు పురోగతిలోకి వస్తాయి. కృష్ణా పశ్చిమ, తూర్పు డెల్టాలకు కలిపి రూ.300 కోట్లు కేటాయించారు. డాక్టర్ కేఎల్ రావు సాగర్ పులిచింతల డ్యాం నిర్వహణ కోసం రూ.16.3765 కోట్లను కేటాయించారు.



రాజధాని పనులు వేగవంతం..

బడ్జెట్‌లో ప్రభుత్వం రాజధానికి గత ఏడాది మాదిరిగానే రూ.6 వేల కోట్ల నిధులను మూలధనం కింద కేటాయించింది. దీంతో రాజధానిలో నిర్మాణం జరుగుతున్న అభివృద్ధి పనులు పరుగులు పెట్టనున్నాయి. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, హైకోర్టు జడ్జిల నివాసాలు, ఏఐఎస్ అధికారుల భవన నిర్మాణాలు ఈ ఏడాది పూర్తి అయ్యేలా నిధుల కేటా యింపు జరిపారు. రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్లు, స్మృతివనాలకు కూడా నిధులు అందుబాటులో ఉంటాయి. ఏపీసీఆర్‌డీఏ రూ.836.26 కోట్లు రుణాలు తీసుకునేందుకు బడ్జెట్‌లో ప్రభు త్వం అనుమతించింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ పనులకు కూడా బడ్జెట్‌లో రూ.10 కోట్లతో పాటు ఆర్థికసాయం కింద రూ.3.05 కోట్లు, రతన్ టాటా ఐటీ ఇన్నో వేషన్ హబ్‌కు రూ.50 కోట్లు కేటాయించింది. అమరావతి ఎకనామిక్ రీజియన్ కింద రూ.10 కోట్లు కేటా యించింది. అమరావతి సైన్స్ సిటీకి మరో కోటి పొందుపరిచింది. వ్యవసాయ విశ్వ విద్యాలయానికి రూ.504.09 కోట్లు కేటా యించింది. గుంటూరు జిల్లాలో పప్పు ధాన్యాల క్లస్టర్ ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. పర్యాటక గ్రాంట్ పేరిట విడుదలైన నిధులతో సూర్యలంక బీచ్‌లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరగడాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించారు. బాపట్ల కేంద్రంగా కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు బడ్జెట్ అనుమతి ఇచ్చింది. వ్యవసాయంలో టెక్నాలజీని మరింతగా ప్రవేశపెట్టే చర్యలలో భాగంగా జిల్లా కేంద్రంగానే డ్రోన్ ఆధారిత శిక్షణా కేంద్రాల ప్రతిపాదనలకు చోటు కల్పించారు. ఎంఎస్ఎంఈల్లో జిల్లా వాటా రూ.180 కోట్ల వరకు ఉంది.

లోకేశ్.. ఆత్మీయ సమావేశం


విందుకు హాజరైన ప్రజాప్రతినిధులు • కుటుంబ కార్యక్రమంలా కలియక

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): కుటుంబ కార్యక్రమంలా.. రాజకీయాలకు దూరంగా జిల్లా ప్రజాప్రతినిధులతో ఉండవల్లిలోని నివాసంలో శనివారం మధ్యాహ్నం మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సందడిగా ఆనందాల కలబోతలకు ఈ ఆత్మీయ కలయిక వేదికగా నిలిచింది. ఎమ్మెల్యేల పిల్లలతో లోకేశ్ సరదాగా గడిపారు. వారి కెరీర్, జీవిత లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చదువు, కెరీర్ ఒక్కటే జీవితం కాదని క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇచ్చేలా పిల్లలను ప్రోత్సహించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎమ్మెల్యే కుటుంబాలతో గ్రూపు ఫొటో దిగి, మహిళలకు మంగళగిరి చేనేత చీరలను కానుకగా అందజేశారు. తొలుత కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, ధూళి పాళ్ల నరేంద్రకుమార్, గల్లా మాధవి, నసీర్‌అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్ తమ కుటుంబ సభ్యులతో రాగా వారికి లోకేశ్ ఎదురెళ్లి స్వాగతం పలికారు. అనంతరం అంతా కలిసి ఒకే చోట భోజనం చేస్తూ మాట్లాడుకున్నారు. గతంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యలపై ఇచ్చిన వినతిపత్రాలపై ఏ మేరకు చర్య తీసుకున్నారో వివరించారు. అలానే కొత్తగా వినతిపత్రాలను కూడా స్వీకరించారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ జన్మదినం కావడంతో ఆయనకు లోకేశ్ ప్రత్యేకంగా పుట్టిన రోజు శుభా కాంక్షలు తెలిపారు. అసెంబ్లీ, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత లోకేశ్ గుంటూరు, విజయవాడ పార్లమెంటు నియోజకవర్గాల ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, వారి కుటుంబసభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాయకులంతా తమ కుటుంబాలతో తరలి రాగా లోకేశ్ నివాసంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.


ఎమ్మెల్యే నరేంద్రతో..


ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ దంపతులతో..


ఎమ్మెల్సీ ఆలపాటి దంపతులతో..


ఎమ్మెల్యే బూర్ల కుటుంబంతో..


ఎమ్మెల్యే మాధవి దంపతులు


మంత్రి మనోహర్‌తో..


ఎమ్మెల్యే నసీర్ కుటుంబంతో..

22న జిల్లాకు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య రాక

● నారాకోడూరులో సమృద్ధి కేంద్రం ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈ నెల 22న గుంటూరు జిల్లాకు రానున్నారని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం తెలిపారు. చేబ్రోలు మండలం నారా కొడూరులో పైలట్ ప్రాజెక్ట్ కింద నిర్మించిన సమృద్ధ్ గ్రామ్ ఫిజిటల్ సర్వీసెస్ సెంటర్ (సమృద్ధి కేంద్రం)ను ప్రారంభించనున్నారని చెప్పారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శనివారం ఆయన కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, సంబంధిత అధికారులతో సమీక్షించారు. దేశ వ్యాప్తంగా మూడు పైలట్ ఫిజిటల్ ప్రాజెక్టుల్లో ఇది ఒకటి అని పెమ్మసాని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఆరి, ఉమ్రీ గ్రామాల్లో, ఉత్తరప్రదేశ్‌లోని చౌరవాలాకు మరో రెండు మంజూరైనట్లు వెల్లడించారు. భారత్ నెట్ మౌలిక సదుపాయాలను వినియోగిస్తూ గ్రామీణ భారతాన్ని భౌతిక, డిజిటల్ సేవల సమన్వయంతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కమ్యూ నికేషన్స్ మంత్రిత్వ శాఖ ఈ సమృద్ధ్ గ్రామ్ ఫిజిటల్ సర్వీసెస్ పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్యం, వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి, ఈ-కామర్స్ వంటి పౌరసేవలను ఒకే కేంద్రంలో అందించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర మంత్రి పర్య టన దృష్ట్యా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతలో పరిశోధన సామర్థ్యం పెరగాలి

● ఎస్ఆర్ఎం స్నాతకోత్సవంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్
● డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ ఎస్వీ కామత్‌కు గౌరవ డాక్టరేట్



డీఆర్డీవో చైర్మన్ కామత్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న కేంద్ర మంత్రి అర్జున్ రామ్

తుళ్లూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బలహీనతలు తగ్గించుకుని.. యు వత బలాలపై దృష్టి సారిస్తే అన్నింటా విజయం సొంతమవుతుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పేర్కొన్నారు. నూతన సాంకేతికతలను ఆవిష్కరించే పరిశోధనల వైపు పరుగులు తీయాలని సూచించారు. శనివారం సాయంత్రం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయ వ్యవస్థలోనూ కృత్రిమ మేధ వాడకంపై పరిశీలన జరుగుతోందని మంత్రి అర్జున్ రామ్ పేర్కొన్నారు. గౌరవ అతిథి డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ ఎస్వీ కామత్ మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక సాంకేతికత వినియోగం ఎంతో ఉందన్నారు. ఎస్ఆర్ఎం ఫ్యాకల్టీతో సమావేశం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. యూనివర్సిటీ ప్రదా నం చేసిన గౌరవ డాక్టరేట్‌ను ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. వర్సిటీ వ్యవస్థాపక కులపతి డాక్టర్ టీఆర్ పారివేందర్ మాట్లాడుతూ.. కేవలం ఎనిమిదేళ్ల కాలంలోనే మల్టీ డిసిప్లేన్ యూనివర్సిటీగా గుర్తింపు తెచ్చుకోవడం హర్షణీయమన్నారు. యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణన్ మాట్లాడుతూ త్వరలో వర్సిటీలో డిఫెన్స్ ఇంజనీరింగ్‌ను ప్రారంభిస్తున్నామని తెలి పారు. ఏడుగురు రీసెర్చ్ స్కాలర్‌లకు పీహెచ్‌డీ డిగ్రీలు ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ కామత్‌కు చాన్సలర్ డాక్టర్ పారివేందర్, కేంద్ర మంత్రి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. అనంతరం ఆయనను, మంత్రి అర్జున్ రామ్‌ను సత్కరించి జ్ఞాపికలను ప్రదా నం చేశారు. ఉపకులపతి సీహెచ్ సతీష్, ఎస్ఆర్ఎం ట్రస్టీ మెంబర్ మణిమంగై, రీసెర్చ్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.నారాయణరావు, రిజిస్ట్రార్ ప్రేమ్‌కు మార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ షీలాసింగ్, వినాయక్ పాల్గొన్నారు.

భద్రతా సిబ్బందికి తులసి సీడ్స్ భోజన వసతి

● ప్రారంభించిన తులసి రామచంద్రప్రభు


భద్రతా సిబ్బందికి అన్నప్రసాదాన్ని ప్రారంభిస్తున్న తులసి రామచంద్రప్రభు

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లలో భక్తుల భద్రత నిమిత్తం సేవా శిబిరానికి విచ్చేసిన 400 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్, 3 వేల మంది పోలీస్ సిబ్బందికి తులసి సీడ్స్ సంస్థల చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు. శనివారం కొండపై భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవా కార్యక్రమాలు దేశభక్తిని, సేవాతత్పరతను పెంపొందిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. 15 ఏళ్లుగా.. తిరునాళ్లలో పోలీస్ సిబ్బందికి తులసి సీడ్స్ మూడు రోజులు భోజన సదు పాయం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కన్వీనర్ రాంబాబు, ఆఫీస రు టి.శ్రీనివాసరా వు, సహాయకులు వీవీ హరనాథ్, షేక్ దావూద్, ఎస్ అంజిరెడ్డి, తులసి సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యంతో పాటు నైతిక విలువలు నేర్పాలి



మాట్లాడుతున్న జడ్జి ఇందిరా ప్రియదర్శిని

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నేటి విద్యా విధానంలో నైపుణ్యంతో కూడిన విద్య అవసరమని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ హెడ్ ప్రొఫెషనల్ డాక్టర్ లలిత్‌ప్రసాద్ అన్నారు. శనివారం గోరంట్ల భాష్యం ఇంటర్నేషనల్ స్కూల్లో బ్లూమ్స్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి లలిత్ ప్రసాద్ మాట్లాడుతూ కేంబ్రిడ్జి కరికులం ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకుంటున్నారని తెలిపారు. జిల్లా, తెనాలి పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎం.ఇందిర ప్రియదర్శిని మాట్లాడుతూ.. రామాయణం, మహాభారతం లాంటి ఇతిహాసాల ద్వారా మంచిని గ్రహించి ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. పూర్వ విద్యార్థి, ఆర్థోపెడిక్ డాక్టర్ ఘంటా చైతన్య మాట్లాడుతూ తన లక్ష్యసాధనలో భాగమైన భాష్యం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. భాష్యం తనలో నాటిన విలువలే తన విజయానికి కారణమన్నారు. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ.. భాష్యం బ్లూమ్స్‌ని స్థాపించి 22 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. నాటి నుంచి ఎన్నో విజయాలు సాధించామని, ఇదే స్ఫూర్తితో ఎండీ భాష్యం సాకేత్ రామ్ సారథ్యంలో భాష్యం ఇంటర్నేషనల్ స్కూల్‌ని ప్రారంభించినట్లు చెప్పారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, ఎండీ భాష్యం సాకేత్‌రామ్, బ్లూమ్స్ జెడ్ ఈఓ అండ్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి, సెకండరి ప్రిన్సిపాల్ గిరిజారాణి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శాలి వాహన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వాహకులు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 25 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. శనివారం నగరంలోని శారదకాలనీ 18వ లైనులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకుడు, చైర్మన్ రాజవరపు భిక్షపతి మాట్లాడుతూ.. స్కాల ర్‌షిప్‌లు పొందిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరు కుని..మరో పది మంది విద్యార్థులకు సహాయపడాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టు ప్రెసిడెంట్ కానూళ్ల ప్రవీణ్‌కుమార్, సెక్రెటరీ పి.ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ ఉదయ్‌శంకర్, జాయింట్ సెక్రెటరి కె.కోటేశ్వరరావు, సభ్యులు కాజా శ్రీనివాసరావు, రాజవరపు శ్రీనివాసరావు, సజ్జన త్రినేత్రం, మురహరిరావు, నారాయణ, గిరీష్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 123, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

34 వేల మంది మెడికల్ ఎగ్జిబిషన్ సందర్శన

● శనివారం ఒక్కరోజే 5,345 మంది హాజరు


సీపీఆర్ ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్ మెడ్ ఫ్యూజన్-26కు విద్యార్థుల నుంచి చక్కటి స్పందన కనిపిస్తోంది. మూడు దశాబ్దాల తర్వాత వైద్య కళాశాలలో నిర్వహిస్తున్న ఈ విజ్ఞాన ప్రదర్శన తిలకించేందుకు అధిక సంఖ్యలో విద్యార్థులు తరలివస్తున్నారు. శనివారం ఒక్కరోజే 5,345 మంది సందర్శకులు ఈ ఎగ్జి బిషన్‌ను తిలకించారు. దీంతో కళాశాల ప్రాంగణం అంతా పిల్లలు, పెద్దలతో కళక ళలాడింది. ఇప్పటి వరకు మెడికల్ ఎగ్జిబిషన్‌ను 33,721 మంది సందర్శకులు తిలకి ంచినట్లు కళాశాల అధికార వర్గాలు శనివారం సాయంత్రం ప్రకటించాయి. ఆదివారం సెలవు కావడంతో సందర్శ కులు అధికంగా వస్తారని అధికారులు భావిస్తున్నారు. ప్రదర్శనలో పలు స్టాల్స్‌ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం సీపీఆర్ ప్రదర్శన సందర్శకులను ఆకట్టు కుంది. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో స్కిన్ గ్రాఫ్టింగ్ ప్రదర్శన ప్రత్యేకంగా ఆకర్షించింది. కాలిన గా యాలకు, డయాబెటిక్ ఫుట్ వంటి మానని పుండ్లు ఉన్నప్పుడు ఈ స్కిన్ గ్రాఫ్టింగ్ విధానాన్ని ఉపయోగిస్తారని వైద్య విద్యార్థులు సందర్శకులకు వివరించారు. పాఠశాల విద్యార్థులు, సొరకాయపై స్కిన్ గ్రాఫ్టింగ్ విధానాన్ని ప్రాక్టికల్‌గా చేసి, వైద్య విజ్ఞానాన్ని అనుభవపూర్వకంగా గ్రహించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారీ పర్యవేక్షించారు.

శివమయం

(5వ పేజీ తరువాయి)

సభ్యులు భక్తులకు సేవలు అందించేందుకు కొండకు తరలివచ్చారు.ఈతిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరపున కోటయ్య స్వామికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టు వస్త్రాలు, వెండి ప్రభ సమర్పించనున్నారు. ఉదయం 9 గంటలకు నిర్వ హించేందుకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. కొండ దిగువన, దేవాలయం వద్ద ప్రసాదం విక్రయిస్తున్నారు. చిలకలూరిపేట మేజర్ కాల్వ వద్ద భక్తుల కోసం స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశారు. తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బీ కృష్ణారావు ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు, దేవస్థానం ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. ఈ సారి స్వామి దర్శనం ఆదివారం తెల్లవారు జామున ఒంటి గంట నుంచి భక్తులకు కల్పించారు. కోటప్ప కొండకు ఆర్టీసీ 618 బస్సులను ఏర్పాటు చేసింది. కొండ వద్ద చిలకలూరిపేట రోడ్డులో, ఘాట్ రోడ్డు పక్కన, కొండపైన ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్లను నిర్వహిస్తున్నది. కాళింది మడుగులో బోట్ షికార్, పిల్లల రాజ్యంలో చిన్నారుల కోసం ఆట వస్తువులను, ట్రాయ్ ట్రైన్‌ను ఏర్పాటు చేశారు.

కొండ దిగువున అన్నదానానికి ఏర్పాట్లు

కొండ దిగువున వివిధ సామాజిక సత్రా లలో పెద్ద ఎత్తున అన్నదానం జరగనుంది. మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా అన్న దానం చేసేందుకు సత్రాల నిర్వహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చిన్న పిల్లల ఆట వస్తువుల స్టాల్స్, జెయింట్ వీల్స్, రంగుల రాట్నాలు, చెరుకు విక్రయ కేంద్రాలు ఏర్పా టయ్యాయి. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దేవస్థానం వద్ద, కొండ దిగువ ప్రాంతాలలో తొమ్మిది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొండలోని పీహెచ్‌సీలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్య సేవలకు 108, 104 వాహనలను సిద్ధం చేశారు. కొండ దిగువన న్యాయ శాఖ మొబైల్ కోర్టు ఏర్పాటు చేసింది. నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో కోటప్పకొండ తిరునాళ్లకు 3,000 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం నుంచే పోలీసులకు విధులు కేటాయించారు. కొండ ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పెట్లూరివారిపాలెం రహదారుల్లో ట్రాఫిక్‌జామ్ కాకుండా చర్యలు చేపట్టారు.

గుంటూరు సిటీ వార్తలు

● గుంటూరు తూర్పు ● పశ్చిమ

బడ్జెట్‌తో మైనారిటీల జీవితాల్లో వెలుగులు

● సీఎం, ఆర్థిక మంత్రికి ఎమ్మెల్యే నసీర్ కృతజ్ఞతలు



మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మైనారిటీల సంక్షేమానికి రూ.6,090 కోట్లు కేటాయించడం ఆహ్వానించదగిన విషయమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై శనివారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయాన్ని బడ్జెట్ స్పష్టం చేసిందన్నారు. 2025-26 బడ్జెట్లో రూ.5,434 కోట్లు కేటాయించగా, ఇప్పుడు అదనంగా రూ.656 కోట్లు కేటాయించి మైనారిటీల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. మైనారిటీ అభ్యున్నతి కోసం సబ్ ప్లాన్‌కు రూ.3133 కోట్లు కేటాయించడం గొప్ప విషయమన్నారు. హజ్ యాత్రికులకు లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సాయం, హజ్ యాత్ర నిర్వహణ ఖర్చుల కోసం హజ్ కమిటీకి రూ.6.97 కోట్లు, పోటీ పరీక్షల శిక్షణకు రూ.3.97 కోట్లు, ఉర్దూ అకాడమీకి రూ.7.83 కోట్లు, ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాల నిర్మాణానికి రూ.2.85 కోట్లు, ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాలకు రూ.90 కోట్లు కేటాయించడం ద్వారా మైనారిటీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కంకణం కట్టుకున్నట్టు చెప్పారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు మైనార్టీ వర్గాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తాడేపల్లిలోని మంత్రి నారా లోకేశ్ నివాసంలో గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. తూర్పు అభివృద్ధికి నిధుల కోసం మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందించారు.

విధులకు డుమ్మాకొట్టిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

● షోకాజ్ నోటీసులు జారీకి కలెక్టర్ ఆదేశం



అధ్యాపకుల మూమెంట్ రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విధులకు డుమ్మా కొట్టిన చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 13న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చేబ్రోలు డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది గైర్హాజరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయకుండా కళాశాలకు గైర్హాజరు కావడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధ్యాపకులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులను ఆదేశించారు. ఆడిటోరియం గ్రంథాలయం, కళాశాల వాతావరణం అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించేది లేదని ఆమె హెచ్చరించారు.



కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

మెడికల్, ఫార్మా మాఫియాపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మెడికల్, ఫార్మా రంగాల్లో పెరుగుతున్న అవినీతి, దోపిడీని అరికట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మెడికల్ మాఫియాకు వ్యతిరేఖంగా కలెక్టరేట్ ఎదుట శనివారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఫార్మా కంపెనీలు, కార్పొరేట్ ఆస్పత్రులు అధిక ధరలు, నాసిరకం మందుల విక్రయాలు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించకపోతే జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యతని, అటువంటి బాధ్యతను విస్మరించడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, ప్రైవేట్ కళాశాలల్లో స్టైఫండ్ ఎగవేతపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసనల్లో అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, చిన్న తిరుపతయ్య, మేడా హనుమంతురావు, రాధాకృష్ణమూర్తి, చల్లా చిన ఆంజనేయులు, పుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంతెన కూల్చివేతలో రికార్డు

● శంకర్‌విలాస్ ఆర్వోబీ కార్మికులకు పెమ్మసాని సత్కారం

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ పాత ఆర్వోబీ ప్రధాన రైల్వే వంతెన కూల్చివేతలో ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా రికార్డు సమయంలో పనులు పూర్తి చేయడంపై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పనుల్లో భాగస్వాములైన అధికారులు, కాంట్రాక్టర్, కార్మికులను ఆయన శనివారం స్థానిక రైల్ వికాస్ భవన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ మనం కష్టపడి ఎన్నో పనులు చేసినా వాటిల్లో కొన్ని పనులు మాత్రం జీవితంలో సంతృప్తిని కలిగిస్తాయన్నారు. అలాంటి పనుల్లో శంకర్ విలాస్ పాత ఆర్వోబీ వంతెన కూల్చివేత పనులు ఒకటని చెప్పారు. చిన్న తప్పు జరిగినా ఎన్నో ఇబ్బందులు తలెత్తేవని, ఎక్కడా, ఎలాంటి సమస్య రాకుండా జాగ్రత్తగా పనులు పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు సరైన పద్ధతిలో సమన్వయపరుచుకుంటే ఎంత అద్భుతంగా పని చేయవచ్చుననేందుకు ఇది ఒక చక్కటి కేస్ స్టడీగా ఉంటుందన్నారు. 30 రోజుల లక్ష్యంతో పనులు మొదలుపెట్టగా 22 రోజుల్లో పూర్తి చేయడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం సుధేష్ణ సేన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆర్వోబీ కాంట్రాక్టర్‌ను అభినందిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, డీఆర్ఎం సుధేష్ణసేన్

మార్చి 19న రాష్ట్రస్థాయి సినీ గీతాల పోటీలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో గుంటూరు, అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 19న రాష్ట్ర స్థాయి సినీగీతాల పోటీలను నిర్వహిస్తున్నట్లు కళావేదిక గౌరవ అధ్యక్షురాలు, లలిత గ్రూప్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ పి.విజయ, వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. గాయకులు తమ పేర్లను ముందుగానే నమోదు చేసుకోవాలన్నారు. పోటీలలో పాల్గొనే వారు రెండు మెలోడీ పాటలు పాడాలన్నారు. పోటీదారులకు భోజనం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. విజేతలకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు బహుమతి ఇస్తున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 94401 09795, 95024 03525 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ

సమస్యల పరిష్కారానికి కృషి

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని కృష్ణనగర్‌లో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఔట్‌సోర్సింగ్ టీచర్స్ అసోసియేషన్ ఐదవ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 ఔట్ సోర్సింగ్ టీజీటీలను కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్పులో ఉన్న అడ్డంకులను తొలగించాలని కోరారు. సమస్యలను మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వివరిస్తానని చెప్పారు. ప్రభుత్వం టీచర్ల సమస్యలు పరిష్కరించడానికి సానుకూలంగా ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, ఎన్ఎన్‌టీపీ అసోసియేటెడ్ అధ్యక్షుడు చిగురుపాటి వినాయకపాణి, ఎస్‌సీఎం సుభాని, ఉప్పల రామ్మోహన్‌రావు, చిమతా నాగేశ్వరరావు, జి.కుమార్ యాదవ్, కోశాధికారి జి.లక్ష్మయ్య, కే.ఖాదర్ వలీరెడ్డి, ఎ.అనిత, వై.రమాదేవి పాల్గొన్నారు.

అమరావతికి చట్టబద్ధత కల్పించాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అమరావతికి చట్టబద్ధత కల్పించి, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. గుంటూరు, బ్రాడీపేట, సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షత జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజధానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. అమరావతి రాజధానిని కార్పొరేట్ రాజధానిగా గాక ప్రజారాజధానిగా అభివృద్ధి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ రాజధాని అభివృద్ధికి, రైల్వేలైన్‌ల నిర్మాణానికి ఔటర్ రింగ్ రోడ్లకు అవసరానికి మించి భూములు సేకరించడం తగదన్నారు. ఈ సమావేశంలో ఈమని అప్పారావు, ఎమ్ రవి, బూరుగు వెంకటేశ్వర్లు, ఎన్‌భావన్నారాయణ, కె.నళీనికాంత్, డి.శ్రీనివాసకుమారి, ఎల్ అరుణ, ఎస్.చెంగయ్య, డి లక్ష్మీనారాయణ, కంచుమాటి అజయ్ కుమార్, నళీనికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలను అందించడమే సేవా తీర్థ ధ్యేయం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతమైన పాలన, ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే ప్రధాని నూతన కార్యాలయం సేవా తీర్థ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ తాడువాయి రామకృష్ణ అన్నారు. కార్యాలయ ప్రారంభం సందర్భంగా లక్ పతీదీదీలుగా అభివృద్ధి, వ్యవసాయ రంగ మౌలిక సదుపాయాలు, స్టార్ట్ అప్ ఇండియా 2.0 ఫైల్స్‌పై మోదీ సంతకం చేశారని గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తులో నిస్వార్థ సేవకు సేవా తీర్థ భవనం ప్రతీకగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణానికి 5 నామినేషన్లు

గుంటూరుకార్పొరేషన్,ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు శనివారం 5 నామినేషన్లు వచ్చాయని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్, స్టేడియం పాలక వర్గ ఎన్నికల నిర్వహణాధికారి సి.హెచ్. శ్రీనివాస్ తెలిపారు. వాటిలో సెక్రటరీకి 1, ట్రెజరర్‌కి 1, ఎక్జిక్యూటివ్ బాడిమెంబర్స్‌కు 3 నామినేషన్లు వచ్చాయని తెలిపారు.

20న జిల్లాలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పర్యటన

● ఉపాధి హామీ చట్టం పరిరక్షణపై సమావేశం

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 20న జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమె షెడ్యూల్ వివరాలను జిల్లా నేతలకు తెలియజేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును ఇటీవల కేంద్ర ప్రభుత్వం తొలగించిన నేపథ్యంలో ఏపీసీసీ ఆధ్వర్యంలో షర్మిల రాష్ట్ర వ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో కార్యకర్తలు, ప్రజలతో సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పథకం ప్రవేశ పెట్టిన ఉద్దేశ్యం, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలకు తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 20న జిల్లా పరిధిలోని తెనాలి, పొన్నూరు, ప్రత్తిపాడు ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే ఇందుకు సన్నాహకంగా రాజీవ్‌గాంధీ భవన్‌లో కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు యన్నం సుధీర్‌బాబు, ఎండీ ఖలీల్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నారు.

నేడు ఈషా ఫౌండేషన్ వారి మహా శివరాత్రి వేడుకలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో, ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నైట్ లాంగ్ పేరున వేడుకలను నిర్వహిస్తున్నట్టు ఈషా వలంటీరు సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటలకు వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతా యన్నారు. వేడుకల్లో భాగంగా కోయం బత్తూరులో జరిగే మహా శివరాత్రి వేడుకల ప్రత్యక్ష ప్రసారం, అనంతరం యోగాసనాలు, సాంప్రదాయ నృత్య విన్యాసాలు, గాన కచేరీలు, వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు 77992 21189 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఆర్వీఆర్ అండ్ జేసీలో ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ పరీక్షలు ప్రారంభం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈనెల 14, 15 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు.

ఘనంగా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం

● హాజరైన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ భీమినేని వందనాదేవి ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా జరిగింది. అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వందనాదేవి ఎన్నో ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఒక సామాన్య కార్యకర్తగా కష్టపడి పని చేస్తోందన్నారు. ఆమె కష్టానికి తగిన గుర్తింపుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పదవిని కేటాయించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ మహిళ కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, గళ్లా మాధవి, జూలకంటి బ్రహ్మారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, జనసేన ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ సజీల, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మన్నవ మోహన్‌కృష్ణ, మల్లె ఈశ్వరరావు, బ్రహ్మంచౌదరి, వడ్రాణం హరిబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, అబ్బూరు మల్లి తదితరులు పాల్గొన్నారు.


జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న భీమినేని వందనాదేవి

కాసరనేని కుటుంబంతో విడదీయలేని అనుబంధం

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కాసరనేని సదాశివరావు కుటుంబానికి, తమ కుటుంబానికి విడదీయలేని అనుబంధం ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో అన్నమయ్య కళా వేదికపై డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా సమితి ఆత్మీయ పురస్కార వేడుక, ముగింపు నాటకోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంస్థ చైరన్ యర్రా నాగేశ్వరరావు, డాక్టర్ రమాబాల, డాక్టర్ ఉషాబాల, డాక్టర్ పాతూరి కిరణ్ చౌదరి, డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్, రాజకీయ విశ్లేషకులు అడుసుమల్లి శ్రీనివాసరావు, అప్పసాని రాజేష్, మందలపు బంగారుబాబు, రంగస్థల నటులు గెద్ద వరప్రసాద్, కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాదు తదితరులతో కలిసి మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజికి డాక్టర్ కాసరనేని సదాశివరావు ఆత్మీయ పురస్కారాన్ని ఆమె అందజేశారు. అనంతరం మల్లాది క్రియేషన్స్ మల్లాది రవికిరణ్ రచన, మల్లాది భాస్కర్ దర్శకత్వం వహించిన ఆవేశంలో ఆనందం హాస్యనాటిక ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఆదూరి పాపారావు, నల్లా శేషు తదితరులు పర్యవేక్షించారు.



గౌతు శ్యామ్‌సుందర్‌కు ఆత్మీయ పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష, కళా సమితి సభ్యులు

ముఖ శస్త్ర చికిత్సల్లో వారిది కీలక పాత్ర

● డాక్టర్ ఎం.కిరణ్ కుమార్

పెదకాకాని, ఫిబ్ర వరి 14(ఆంధ్రజ్యోతి): ముఖ వ్యాధులకు ఓర ల్ మ్యాగజిలో ఫేషి యల్ సర్జన్లది కీలక పాత్రని ఒంగోలు ప్రభు త్వ వైద్యశాల దంత వైద్య విభాగధిపతి డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సిబార్ దంత వైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అంతర్జాతీయ ఓరల్, మాక్సిల్లో ఫేషియల్ సర్జన్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్.కిరణ్ కుమార్ పాల్గొన్నారు. దవడ, ముఖ వ్యాధులు, గాయాలకు సరైన చికిత్స అందించడంలో ఓరల్, మాక్సిల్లోఫేషియల్ సర్జన్ల కీలకగా మారారన్నారు. డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ తదితరులు కళాశాలకు విశేష సేవలు అందించిన డాక్టర్ శాకమూరి అనిల్‌కుమార్ ని శాలువా, మెమెంటోతో సత్కరించారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెలలో నమోదు చేసుకొన్న వారికి, చీలిక పెదవి, చీలిక అంగిలి కలిగిన చిన్నారులకి ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి. రమణ రెడ్డి, ఓరల్, మాక్సిల్లోఫేషియల్ సర్జరీ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ పి. శ్రీనివాస్ చక్రవర్తి పాల్గొన్నారు.


డాక్టర్ కిరణ్ కుమార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ కృష్ణప్రసాద్

ప్రజా సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిన రాష్ట్ర బడ్జెట్

● వై.నేతాజీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న రాష్ట్రాన్ని.. మరింత అప్పుల ఊబిలోకి నెట్టేదిగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజధానికి కేవలం రూ.6 వేలు కోట్లే కేటాయించారని, విద్యుత్తు, విద్య, ప్రజా సంక్షేమానికి గతేడాది కంటే కోత విధించారని తెలిపారు. వ్యవసాయ ధరల స్థిరీకరణ నిధి రూ.1200 కోట్ల నుంచి రూ.500 కోట్లకు తగ్గించడం.. రైతులను మార్కెట్ మాయాజాలానికి బలి చేయడమే అవుతుందన్నారు.

విలువలకు మారు పేరు దామోదరం సంజీవయ్య

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్


దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నిజాయితీకి, నిరాడంబరత్వానికి, విలువలకు మారు పేరు దామోదరం సంజీవయ్య అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. కలెక్టరేట్‌లో, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం దామోదరం సంజీవయ్య జయంతిని నిర్వహించారు. కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి ఆయన సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం సంజీవయ్య కృషి చేశారన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పేదల సంక్షేమం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి దామోదరం సంజీవయ్య కృషి చేసారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉన్నత స్థాయికి ఎదిగారని, ఆయన అడుగుజాడలు నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలీ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో...

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెండవ, తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని శనివారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. వెస్ట్ డీఎస్పీ అరవింద్, పోలీస్ అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితం, నాయకత్వ లక్షణాలను స్మరించుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో జన్మించారన్నారు. న్యాయవాదిగా ప్రాక్టీసు చేసి, రాజకీయ రంగంలో ప్రవేశించి, కేవలం 38 ఏళ్ల వయస్సులోనే సీఎంగా బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారన్నారు. భారతదేశంలో అతి పిన్న వయస్సులో ముఖ్యమంత్రి అయిన నేతల్లో ఆయన ఒకరన్నారు. హోమ్ గార్డు ఆర్ఐ రామకృష్ణరెడ్డి, ఆర్ఐ ఏసురాజు, ఎస్బీ పీఆర్వో శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ భవన్‌లో...

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రిత్వ శాఖల్లో పనిచేసినా సొంత ఆస్తుల్లేని నిజాయితీకి నిలువెత్తు రూపం దామోదరం సంజీవయ్య అని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు పేర్కొన్నారు. కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు యన్నం సుధీర్ బాబు, ఎండీ ఖలీల్ ఆధ్వర్యంలో ఏపీ మాజీ సీఎం దివంగత దామోదరం సంజీవయ్య 105వ జయంతి కార్యక్రమం శనివారం రాజీవ్‌గాంధీ భవన్‌లో జరిగింది. కాంగ్రెస్ నాయకులు గడ్డం పాల్ విజయ్‌కుమార్, జాన్‌బాబు, వెంకటరెడ్డి, బోడపాటి నాగేశ్వరరావు, వాల్మీకి శ్రీనివాస్, సుబ్రమణ్యం, పరిశుద్ధరావు, శ్యామ్, సుభాని పాల్గొన్నారు.


సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లింగంశెట్టి, సుధీర్, ఖలీల్


వేడుకలలో పాల్గొన్న దాసరి రాజామాస్టారు తదితరులు

ప్రజల మనిషి ఎమ్మెల్యే నసీర్

● దాసరి రాజామాస్టారు

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి నిత్యం పరితపించే నాయకుడు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ దాసరి రాజామాస్టారు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, తెలుగు యువత నాయకుడు అబ్బూరి మల్లి కట్ చేసి, ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమతా, జమీర్, పద్మావతి, కొనకళ్ల సత్యం, విజయలక్ష్మి, గాలి సతీశ్, మల్లెంపూడి శ్రీనివాసరావు, దయారత్నం, ఫిరోజ్, ఏడుకొండలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, గాలి సతీశ్ ఆధ్వర్యంలో...

ఎమ్మెల్యే నసీర్ జన్మదిన వేడుకలు కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, గాలి సతీశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొత్తపేట జలగం రామారావు పాఠశాలలో కొనకళ్ల సత్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. రామిరెడ్డితోటలో జానీ బాషా, పాత గుంటూరులో హుస్సేన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వినోభా నగర్‌లో అన్నదానం, 48 కేజీల కేక్ కటింగ్ చేశారు. దేవెళ్ల వెంకట్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని అనాథ ఆశ్రమంలో పిల్లలకు పండ్లు పంచిపెట్టారు.


జీజీహెచ్‌లో పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న టీడీపీనేతలు

జీజీహెచ్‌లో పండ్లు, రొట్టెలు పంపిణీ

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ జన్మదిన వేడుకలు టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాలాపేట శ్రీ జగన్నాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ మారం కిశోర్, మిర్చియార్డు మాజీ వైస్ చైర్మన్ కొత్తూరి వెంకట్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మానుకొండ శివప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఫిరోజ్, మిర్చి యార్డు మాజీ డైరెక్టర్ ఉప్పుతల సాంబ శివరావు, పల్ల సుబ్రహ్మణ్యం, తెలుగు యువత నాయకులు బెజ్జం అనిల్, రెహమాన్ తదితరులు గుంటూరు జీజీహెచ్‌లో కాన్పుల వార్డులో గర్భిణులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

17 నుంచి రిలే నిరాహార దీక్షలు

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు-2 డిపో గ్యారేజ్ పరిరక్షణ కోసం జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి రిలే నిరాహార దీక్షలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు జేఏసీ కన్వీనర్ ఎస్టీ దత్తు తెలిపారు. శనివారం ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ పేరుతో గుంటూరు-2 గ్యారేజ్‌ను ప్రైవేటు యాజమాన్యానికి కట్టబెట్టాలన్న యాజమాన్య నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. జేఏసీ చైర్మన్ పి.అమర్‌నాథ్, కో-కన్వీనర్ ఆర్ఎస్ రావు, లక్ష్మీ, డీఎంకేరెడ్డి తదితరులున్నారు.

అన్న క్యాంటీన్ కూల్చివేత

● తమ్ముళ్ల ఆగ్రహం.. ఎక్స్‌కవేటర్లు సీజ్


కూల్చివేసిన అన్న క్యాంటీన్

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పలకలూరు రోడ్డులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను కూల్చివేశారు. అనుమతి లేకుండా శివాలయానికి దారి పేరుతో క్యాంటీన్ కూల్చివేతపై టీడీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎంతోమంది కార్మికులు, పేదల ఆకలి తీర్చిన ఈ క్యాంటీన్‌ను వైసీపీ ప్రభుత్వంలో మూసివేశారు. దీంతో దీని వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో స్థానికులు శివాలయం నిర్మించారు. దారి లేకపోయినప్పటికీ క్యాంటీన్ పక్కన చిన్న సందులో మార్గం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శివాలయానికి వెళ్లడానికి అడ్డుగా ఉన్న అన్న క్యాంటీన్‌ను తొలగించాలంటూ అనేకసార్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కానీ.. స్థానిక ఎమ్మెల్యే, కమిషనర్ నుంచి క్యాంటీన్ తొలగింపునకు.. ఎటువంటి అనుమతి ఇవ్వలేదు. ప్రత్యామ్నాయం చూపకుండానే అన్న క్యాంటీన్‌ను తొలగించడంపై టీడీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విషయం తెలుసుకున్న నాయకులు ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నారు. తక్షణం కూల్చి వేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం రాత్రి బయటకు పొక్కడంతో పార్టీ వర్గాలు, అధికారులు అప్రమత్త మయ్యారు. అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదు రావడంతో.. కూల్చివేత పనులు చేస్తున్న రెండు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు.

బాలికపై ఉపాధ్యాయుడు అత్యాచారం

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులను చేయాల్సిన బాధ్యత కలిగిన ఉపాధ్యాయుడు కామంతో బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతోంది. అదే స్కూల్లో టీచర్‌గా పని చేసే పెద్ద పలకలూరుకు చెందిన తులసి నాగార్జున (36) ఆ బాలికకు మాయమాటలు చెప్పి, బెదిరించి లొంగదీసుకున్నాడు. తాను చెప్పినట్లు వినకుంటే ఆత్మహత్య చేసుకుని చనిపోతానని బెదిరించి, బాలికను తన బండిపై విజయవాడ తీసుకెళ్లి అక్కడ లాడ్జిలో ఆమెపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలిసి ప్రశ్నించిన బాలిక కుటుంబ సభ్యులను కులం పేరుతో దూషించాడు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు నిందితుడు నాగార్జునపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలు సహా అన్ని వర్గాలకు పెద్దపీట!

● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి


సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం శాసన సభలో శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు అధిక నిధులు కేటాయించడం ఎంతో హర్షణీయమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన అనంతరం గుంటూరు పశ్చిమ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బడ్జెట్ రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేసే విధంగా రూపుదిద్దుకుందని, గత ప్రభుత్వం బీసీలను విస్మరించిందని, ప్రస్తుత ప్రభుత్వం అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో చూస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి విభజనతో జరిగిన నష్టంతో పాటు, గత ప్రభుత్వ పాలన వల్ల ఆర్థిక విధ్వంసం చోటుచేసుకుందనీ, ఆ పరిస్థితులను సరిదిద్దడానికి రెండేళ్ల సమయం సరిపోదని చెప్పారు. అయినప్పటికీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కృషి చేశామని, స్వర్ణాంధ్ర విజన్- 2047లక్ష్యంతో 2026-2027 బడ్జెట్ ప్రవేశపెట్టామని, 2025లో ప్రవేశపెట్టిన బడ్జెట్ గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దే దిశగా ఉండగా, ఈసారి భవిష్యత్ అభివృద్ధికి బాటలు వేస్తున్నామని ఎమ్మెల్యే గళ్లా మాధవి వివరించారు. కేంద్ర ప్రభుత్వం సహకారం అత్యంత అద్భుతంగా ఉందని తెలిపారు.

● అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి మర్యాద పూర్వకంగా కలిశారు.

భావితరాల భవిష్యత్తుకు రూపం ఇచ్చిన బడ్జెట్ : మేయర్

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి సమతుల్యం పాటిస్తూ.. జరిపిన కేటాయింపులు వాస్తవాలకు అద్దం పడుతున్నాయని మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. వార్షిక బడ్జెట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి నిర్మాణం అత్యంత కీలకంగా భావించి దానికి ఆరు వేల కోట్లు కేటాయించడం, అలానే అమరావతి ఎకనామిక్ రీజియన్, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్‌కు కలిపి 30 వేల కోట్లు, అదేవిధంగా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌కు 28 వేల కోట్లు కేటాయించడం కూటమి ప్రభుత్వానికి ఉన్న దూరదృష్టి అని మేయర్ కోవెలమూడి రవీంద్ర అభివర్ణిం చారు. పోలవరం నిర్మాణానికి 6,105 కోట్లు కేటాయించడం త్వరతగతి నిర్మాణా నికి నిదర్శనం అన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే విద్యా శాఖకు 32,308 కోట్లు కేటాయించి ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యా శాఖకు పెద్దపీట వేశారన్నారు. అలానే మేదస్సుకు, మేధో సంపత్తికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ ఆవిష్కరణలు సాంకేతిక పురోగతిపై దృష్టి సారించటం విశేషం అన్నారు. పట్టణ అభివృద్ధికి 14,539 కోట్లు కేటాయించారని గత కేటాయింపు కన్నా ఇది అధికమని అన్నారు. ఈ బడ్జెట్ ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని అభివర్ణించారు.


బిల్‌గేట్స్ పర్యటన బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బిల్ గేట్స్ పర్యటనకు పటిష్ట బందోబస్తు

● ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లిలో ఈ నెల 16న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "సంజీవని ప్రాజెక్ట్" ప్రారంభోత్సవ కార్యక్రమానికి మైక్రోసాఫ్ట్ సంస్థ అధినేత బిల్ గేట్స్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉండవల్లిలో సమావేశం నిర్వహించే స్థలాన్ని ఎస్పీ వకుల్ జిందాల్, అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు అలహరి శ్రీనివాస్, రాంబాబు, వీరేంద్రబాబు ఇతర పోలీసు అధికారులతో పరిశీలించారు. నిర్వహణ ప్రదేశానికి చుట్టూ పటిష్టంగా బారికేడింగ్ నిర్వహించాలని, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

బడ్జెట్ సమావేశాలకు...

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వెలగపూడిలో జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో.. పరిసర ప్రాంతాల్లో భద్రత, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్ క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, తుళ్లూరుడీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అలహరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కేంద్రం కృషి

● కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో గుంటూరు నరెడ్కో నాయకులు

గుంటూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శనివారం ఢిల్లీలో జరిగిన అర్బన్, రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కాన్‌క్లేవ్-2026లో నరెడ్కో ఏపీ ప్రతినిధుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు అధికారులు, రెరా చైర్మన్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, పరిశ్రమ ప్రముఖులతో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నరెడ్కో ఏపీ ప్రెసిడెంట్ గద్దె చక్రధర్, క్యాపిటల్ జోన్ అధ్యక్షుడు అంకారావు, వైస్ ప్రెసిడెంట్ వి.శ్రీనాథ్, సెక్రటరీ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

AP బడ్జెట్ 2026-27



● అభివృద్ధి, సంక్షేమం దిశగా బడ్జెట్



'గత ప్రభుత్వం వారసత్వంగా వదిలిపెట్టిన రూ.10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని అధిగమిస్తూ, అభివృద్ధి, సంక్షేమం, రైతు భరోసాకు బడ్జెట్ ప్రధాన్యం ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా భవిష్యత్తుపై నమ్మకం కల్పిస్తోంది. గత ప్రభుత్వం హయాంలో 4.41 శాతంగా ఉన్న రెవెన్యూ లోటు 1.11 శాతానికి తగ్గించడం, ద్రవ్యలోటును 3.48 శాతానికి నియంత్రించడం రాష్ట్ర ఆర్థిక పురోగతికి స్పష్టమైన సూచికలు. గృహ నిర్మాణ రంగానికి రూ.6,250 కోట్లు కేటాయించడం ద్వారా ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మించాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యం సాకారమవుతుంది..'

- కొలుసు పార్థసారథి, మంత్రి

● దుర్గమ్మ పాదాల చెంత బడ్జెట్ ప్రతులు



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందుగా ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు బెజవాడ కనక దుర్గమ్మను శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి పాదాల చెంత బడ్జెట్ ప్రతులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూశ్ కుమార్, కార్యదర్శి డి.రోనాల్డ్ రోస్, ఐఏఎస్ అధికారులు సూరజ్ గనోరే, గౌతమ్ అల్లాడ పూజల్లో పాల్గొన్నారు. ఈవో వీకే శీనానాయక్ సమక్షంలో వేద పండితుల నుంచి వేద ఆశీర్వచనం పొందారు. అమ్మవారి చిత్రపటం, లడ్డూప్రసాదం, శేషవస్త్రం అందుకున్నారు.







స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు బడ్జెట్ ప్రతులున్న బ్యాగ్‌ను అందజేస్తున్న ఆర్థిక మంత్రి కేశవ్, పక్కన డిప్యూటీ స్పీకర్ రఘురామ, నేతలు సీఎం రమేశ్, గంటా, విష్ణుకుమార్ రాజు, పితాని తదితరులు, బడ్జెట్ ప్రసంగం వింటున్న ప్రజాప్రతినిధులు

అడుగు ముందుకే...!

(మొదటి పేజీ తరువాయి)

ఉద్ఘాటించడం గమనార్హం.

అప్పులు... మూలధన వ్యయం...

జీఎస్‌డీపీలో రాష్ట్ర పబ్లిక్ డెట్ 36 శాతం... అంటే రూ.7,11,094 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇది 2025-26తో పోల్చితే 75వేల కోట్లు అధికం. జీఎస్డీపీలో పబ్లిక్ డెట్ వాటా 36 శాతం యథాతథంగా ఉండటం ఇందులో సానుకూల అంశం. ఇక... అభివృద్ధికి, ఆస్తుల కల్పనకు సంకేతమైన మూలధన వ్యయాన్ని కూడా బాగా పెంచారు. బడ్జెట్‌లో ఇందుకు రూ.53,915 కోట్లు కేటాయించారు. మొత్తం ఖర్చులో ఇది 16 శాతం. 2024-25లో 8 శాతం, 2025-26లో 13 శాతం ఉన్న మూలధన వ్యయం ఈసారి 16 శాతానికి చేరడం విశేషం. దీనినే రూపాయల్లో చూస్తే... రాబోయే బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని రూ.53,915 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.34,498 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.21,172 కోట్లను మూలధనం కోసం ఖర్చు చేశారు.

కేంద్ర పన్నులపై అంచనాలిలా...

కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రూ.64,362 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.56,741 కోట్లు వస్తాయని అంచనా. గత ఆర్థిక సంవత్సరంలో రూ.52,080 కోట్లు వచ్చాయి.

మండలిలో బడ్జెట్ చదివిన అనిత, అనగాని

శాసన మండలిలో ఆర్థిక బడ్జెట్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. బడ్జెట్ సారాంశం, వివిధ పథకాలు, కీలక రంగాలకు నిధుల కేటాయింపులను వివరించారు. అనంతరం వ్యవసాయ బడ్జెట్‌ను రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చదివి వినిపించారు.





సొంత ఆదాయంపై...

పన్నేతర ఆదాయం రూ.11,474 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14,324 కోట్లుగా పేర్కొన్నారు. అంటే... కొంత వాస్తవికంగా ఆలోచించి అంచనాలు తగ్గించారన్న మాట. కానీ, గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.5972 కోట్లు మాత్రమే వచ్చింది. సొంత పన్నుల ఆదాయం 2026-27లో రూ.1,25,846 కోట్లు వస్తుందని అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.98,025 కోట్లు వస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.89,435 కోట్లు వచ్చింది. బడ్జెట్లో అంచనా వేసిన మొత్తం ఆదాయంలో పన్ను ఆదాయం 54 శాతం, పన్నేతర ఆదాయం 5 శాతం, గ్రాంట్లు 14 శాతం, కేంద్ర పన్నుల్లో వాటాగా 27 శాతంగా చూపించారు.

లోటు... పాట్లు!

రాబోయే ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో అప్పులను రూ.98,065 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అప్పులు రూ.1,03,631 కోట్లకు చేరుతాయని చూపించారు. 2026-27లో అంచనా వేసిన అప్పుల్లో ఆర్‌బీఐ నుంచి 78 శాతం, కేంద్రం నుంచి తీసుకునే రుణాల ద్వారా 19 శాతం, ఇతర రుణాలు 2 శాతం, డిపాజిట్లు, ట్రాన్సాక్షన్ నెట్ రూపంలో ఒక శాతం అప్పులు వస్తాయి.

రెవెన్యూ వ్యయం ఇలా...


2026-27లో రెవెన్యూ వ్యయాన్ని రూ.2,56,143 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత (2025-26) ఆర్థిక సంవత్సరంలో రూ.2,38,022 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ వ్యయం రూ.2,27,961 కోట్ల మేర జరిగింది. ఈసారి అంచనా వేసిన మొత్తం రెవెన్యూ వ్యయంలో సంక్షేమానికి 23 శాతం, సాధారణ విద్యకు 18 శాతం, ఆరోగ్య రంగానికి 11 శాతం, ఇంధన రంగానికి 11 శాతం, వ్యవసాయ, అనుబంధ రంగాలకు 8 శాతం, పట్టణాభివృద్ధికి 8 శాతం, గృహనిర్మాణ రంగానికి 7 శాతం, రవాణా విభాగానికి 6 శాతం, ఇతర ఖర్చులు 8 శాతం ఉన్నాయి. రెవెన్యూయేతర వ్యయంలో మూలధన వ్యయానికి 64 శాతం, లోన్లు, అడ్వాన్సులకు 7 శాతం, అప్పుల అసలు చెల్లింపుల కోసం 29 శాతం ఉన్నాయి.

ఆదాయ... వ్యయాలు!

2026-27లో అన్ని మార్గాల్లో రూ.2,34,140 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం ఇది రూ.1,96,904 కోట్లు మాత్రమే. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,67,676 కోట్ల ఆదాయం వచ్చింది.

- 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం జీఎస్‌డీపీ రూ.19,75,073 కోట్లు. అంచనా వేసిన రెవెన్యూ లోటు ఈ జీఎస్‌డీపీలో 1.11 శాతంగా, ద్రవ్యలోటు 3.84 శాతంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌డీపీ రూ.17,62,357 కోట్లుగా అంచనా వేశారు. రెవెన్యూలోటు అంచనాలు ఇందులో 2.33 శాతం, ద్రవ్యలోటు అంచనాలు 4.57 శాతంగా ఉంటాయని భావిస్తున్నారు.
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.15,91,226 కోట్ల జీఎస్‌డీపీ నమోదుకాగా, రెవెన్యూ లోటు 3.79 శాతంగా, ద్రవ్యలోటును 5.11 శాతంగా నిర్ధారించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంకంటే రాబోయే ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన జీఎస్‌డీపీ 12.07 శాతం మేర పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీఎస్‌డీపీ 10.75 శాతం మేర పెరిగింది.

లోటు తగ్గింపే సవాల్! (జీఎస్‌డీపీలో శాతం)



అమరావతికి రూ.6 వేల కోట్లు



మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖకు బడ్జెట్‌లో రూ.14,538 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన రూ.11,252 కోట్లు కంటే 3,286 కోట్లు అధికంగా కేటాయించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి గతేడాది రూ.3,200 కోట్లు కేటాయిస్తే.. ఈసారి రూ.6వేల కోట్లు కేటాయించారు. తాగునీటి సరఫరా కోసం ఏఐఐబీ రుణాలకు రాష్ట్ర వాటాగా రూ.205 కోట్లు కేటాయించారు. మున్సిపల్ వార్డ్ సెక్రటరీలకు రూ.1397 కోట్లు, మున్సిపాలిటీ/కార్పొరేషన్ల ఏర్పాటుకు రూ.1265.73 కోట్లు, అన్న క్యాంటీన్లకు రూ.50 కోట్లు, మున్సిపల్ పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ.10 కోట్లు కేటాయించారు.

విద్యుత్తు రంగానికి రూ.13,934 కోట్లు

వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్తు, ఆక్వా రంగానికి సబ్సిడీ విద్యుత్తును అందించడమే ప్రాధాన్యంగా విద్యుత్తు రంగానికి రూ.13,934.25కోట్లు కేటాయించారు. గతేడాది కన్నా ఇది 334.25 కోట్లు ఎక్కువ. 49,200 మంది ఆక్వా రైతులకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ఆక్వా రంగానికి సబ్సిడీ విద్యుత్ కోసం రూ.890 కోట్లు కేటాయించారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్తుకుగాను వ్యవసాయ, అనుబంధ రంగాలకు సబ్సిడీ రూ.12,832 కోట్లు కేటాయించారు. దీంతో 21,86,922 మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. విద్యుత్తు ప్రమాదాల పై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు డైరెక్టరేట్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీకి రూ.10 కోట్లు కేటాయించారు. నిరంతర విద్యుత్తు సరఫరా కోసం తుంగభద్ర హైడ్రో ఎలక్ట్రిక్ స్కీమ్ నిర్వహణ, విద్యుత్తు ఉత్పత్తి కోసం రూ.42 కోట్లు కేటాయించారు.

బీసీ సంక్షేమానికి రూ.51,021 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖకు బడ్జెట్‌లో అత్యధికంగా రూ.51,021 కోట్లు కేటాయించారు. 2025-26లో రూ.47,456 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.3,665 కోట్లు అధికంగా కేటాయించారు. ఈడబ్ల్యూఎస్ సంక్షేమానికి రూ.10,669 కోట్లు, ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1,000 కోట్లు, ఉచిత విద్యుత్ కోసం చేనేతలకు రూ.150 కోట్లు, సెలూన్లకు రూ.50 కోట్లు కేటాయించారు.

బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యం: మంత్రి సవిత

బీసీల అభ్యున్నతిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి బడ్జెట్ కేటాయింపుల ద్వారా మరోసారి రుజువైందని మంత్రి సవిత అన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కనీవిని ఎరుగని రీతిలో కేటాయింపులు చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా బడ్జెట్‌ను రూపొందించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి సింహభాగం నిధులు కేటాయించిన సీఎం చంద్రబాబుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

సాంఘిక సంక్షేమ శాఖకు రూ.20,644 కోట్లు

సాంఘిక సంక్షేమ శాఖకు రూ.20,644 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో భవనాల కోసం రూ.100 కోట్లు, పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్పుల కోసం రాష్ట్ర వాటాగా రూ.536.50 కోట్లు, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం రూ.389.88 కోట్లు, ప్రభుత్వ హాస్టళ్ల కోసం రూ.581 కోట్లు, భవనాల కోసం రూ.100 కోట్లు కేటాయించారు. ఎస్సీలకు ఉచిత విద్యుత్ కోసం రూ.300 కోట్లు, అంబేడ్కర్ విగ్రహాలకు రూ.50 కోట్లు, పీఎం అజయ్ హాస్టల్ కాంపోనెంట్ కింద రూ.64 కోట్లు, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద రూ.185 కోట్లు, ఎస్సీలకు ఎన్టీఆర్ పెన్షన్ కింద రూ.4,973 కోట్లు, తల్లికి వందనం ఎస్సీ విద్యార్థులకు రూ.1,882 కోట్లు, డ్రైవర్లకు రూ.108 కోట్లు కేటాయించారు. ఇవి కాకుండా ఆయా శాఖలకు ఎస్సీ కాంపోనెంట్ ద్వారా కేటాయింపులు చేశారు.

గిరిజన సంక్షేమ శాఖకు రూ.9,190 కోట్లు

ఈ ఏడాది గిరిజన సంక్షేమ శాఖకు రూ.9,190 కోట్లు కేటాయించారు. వ్యవసాయశాఖకు రూ.572 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.54.84 కోట్లు, పశు సంవర్థక శాఖకు రూ.16.68 కోట్లు, కళాశాల విద్యకు రూ.23.76 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.227 కోట్లు, పాఠశాల విద్యకు రూ.449 కోట్లు, పౌరసరఫరాలకు రూ.402 కోట్లు, వైద్యశాఖకు రూ.451 కోట్లు, హౌసింగ్ కోసం రూ.1,414 కోట్లు, గ్రామీణ నీటిసరఫరాకు రూ.524 కోట్లు ఇలా పలు శాఖలకు ఎస్టీ కాంపోనెంట్ కేటాయించారు. దీంతో పాటు ఈసారి బడ్జెట్‌లో జెండర్, చైల్డ్ బడ్జెట్‌లకు వేర్వేరుగా కేటాయింపులు చేశారు.

జీఎస్టీ ద్వారా 17,603 కోట్ల రాబడి

ఐజీఎస్టీ నుంచి 18,893 కోట్లు

రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ నుంచి భారీగా ఆదాయం

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆదాయార్జన పెరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు రూ. 17,603 కోట్లుగా ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేసింది. గత బడ్జెట్ సవరించిన అంచనాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరం ముగింపు సమయానికి రూ. 15,889.37 కోట్లు జీఎస్టీ వసూలవుతుందని భావిస్తున్నారు. 2024-25లో రూ. 15,210 కోట్లు జీఎస్టీ వసూలైంది. ఇక 2026-27లో ఐజీఎస్టీ రూ. 18,893.64 కోట్లుగా అంచనా వేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.16,755 కోట్లు వస్తుందని భావిస్తున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీగా పెరుగుతుందని ప్రభుత్వం లెక్కలు వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 18,701.35 కోట్లు వస్తుందని అంచనా వేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి రూ. 11,024.60 కోట్లు వస్తాయని భావిస్తున్నారు. 2024-25లో రిజిస్ట్రేషన్ల శాఖకు రూ. 8,837 కోట్ల ఆదాయం వచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ నుంచి రూ. 30,066 కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. 2025-26 ముగిసే నాటికి రూ. 23,648 కోట్లు వస్తాయని భావిస్తున్నారు. అమ్మకాలు, వాణిజ్య పన్నుల ద్వారా రూ. 24,125 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంచనాలు వేయగా, 2025-26లో రూ. 18,006 కోట్లు వచ్చాయి. ఇక విద్యుత్ పన్నుల ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 512 కోట్లు వస్తాయని భావిస్తున్నారు.



పన్ను ఆదాయం ఇలా.. (అంకెలు రూ.కోట్లలో)

వివరాలు	2024-25 (వా.గ)	2025-26 (బ.అం)	2025-26 (స.అం)	2026-27 (బ.అం)
సీజీఎస్టీ	15,210	16,759	15,889	17,603
భూమి శిస్తు	195	222	255	279
రిజిస్ట్రేషన్ ఆదాయం	8,837	13,150	11,024	18,701
రాష్ట్ర ఎక్సైజ్	19,882	27,097	23,648	30,066
అమ్మకాలు, వాణిజ్యపన్ను	17,422	20,873	18,006	24,125

వా.గ : వాస్తవ గణాంకాలు.. బ.అం : బడ్జెట్ అంచనా.. స.అం : సవరించిన అంచనా

మైనార్టీల సంక్షేమానికి రూ.6,090 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి రూ.6,090 కోట్లు కేటాయించింది. గతేడాది బడ్జెట్‌లో రూ.5,434 కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది 6,090 కోట్లు కేటాయించింది. గత ఏడాది కన్నా రూ.656 కోట్లు అదనంగా కేటాయించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ మైనార్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. మైనార్టీ సబ్‌ప్లాన్ ద్వారా ఇతర శాఖల ద్వారా మైనార్టీలు లబ్ధి పొందేందుకు వీలుగా సబ్‌ప్లాన్‌కు రూ.3,133 కోట్లు కేటాయించిందని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇలా...

ప్రస్తుత బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద రూ.300 కోట్లు, స్వయం ఉపాధి, ఆర్థిక భరోసాకు రూ.183 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీల స్వయం ఉపాధి, ఆర్థిక భరోసాకు రూ.21 కోట్లు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల భవన నిర్మాణాలకు రూ.20 కోట్లు, హజ్ యాత్రికులకు రూ.లక్ష చొప్పున, ఇతరత్రా హజ్ యాత్ర నిర్వహణ కోసం హజ్ కమిటీకి రూ.6.97 కోట్లు, వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చేందుకు సీఈడీయంకు రూ.3.97 కోట్లు, ఉర్దూ అకాడమీకి రూ.7.83 కోట్లు, ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాల నిర్మాణానికి రూ.2.85 కోట్లు, ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాలకు రూ.90 కోట్లు కేటాయించారు.

పర్యాటకానికి 439 కోట్లు హర్షణీయం

'పర్యాటక, సాంస్కృతిక రంగాలకు బడ్జెట్‌లో రూ.439 కోట్లు కేటాయించడం హర్షణీయం.పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి, పెట్టుబడులను ఆకర్షించడం వల్ల రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రూ.28 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలను కుదుర్చుకుని 1,22,631 ఉద్యోగాల కల్పన పర్యాటకశాఖ ద్వారా చేస్తున్నాం. దీనిలో ఇప్పటికే రూ.6,671 కోట్ల పనులు పట్టాలెక్కాయి..' - కందుల దుర్గేశ్, మంత్రి

అద్భుతమైన బడ్జెట్

'కూటమి ప్రభుత్వం అద్భుతంగా పని చేస్తోందని చెప్పడానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక నిదర్శనం. బీజేపీ ఈ బడ్జెట్‌ను హృదయపూర్వకంగా స్వాగతిస్తోంది. ఇది అద్భుత బడ్జెట్.' - విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యే, బీజేపీ

గత ఏడాదికన్నా ఆరోగ్యానికి ఎక్కువ కేటాయింపు

'గత బడ్జెట్ కన్నా మిన్నగా ఈ బడ్జెట్‌లో ఆరోగ్యానికి 9.5 శాతం కేటాయించడం హర్షణీయం. మూలధన వ్యయానికి రూ.51 వేల కోట్లుకు పైగా నిధులు సమకూర్చడంతో గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో నిలిచిన పలు అభివృద్ధి పథకాలు ఊపందుకుంటాయి.' - సత్యకుమార్, మంత్రి

ప్రజా సంబంధాల శాఖలకు అధిక కేటాయింపులు

'వ్యవసాయం, అనుబంధ శాఖలకు రూ.53,752 కేట్లు కేటాయించడం ఈ బడ్జెట్ అత్యంత ప్రాధాన్యతాంశం. అదే విధంగా రోడ్లు భవనాల శాఖకు, ఆరోగ్య శాఖకు అధిక నిధులు కేటాయించడం ద్వారా ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న శాఖలకు బడ్జెట్‌లో ప్రభుత్వం అధికప్రాధాన్యం ఇచ్చినట్లు అయింది.' - సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, టీడీపీ

ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట

'బడ్జెట్ ప్రజల ఆశలు నెరవేర్చేలా ఉంది. బడ్జెట్‌లో ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట వేశారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ రూపకల్పన చేశారు. రుణాల్ని నియంత్రించేలా, సామాజిక న్యాయం దిశగా బడ్జెట్ రూపొందించడం బాగుంది.'

- యనమల రామకృష్ణుడు, మాజీ ఆర్థిక మంత్రి

లోటు తగ్గింపుపై దృష్టి పెట్టారు

'ఆర్థిక క్రమశిక్షణ, బడ్జెట్ లోటును తగ్గించడంపై దృష్టి సారించింది. రెవెన్యూ లోటును రాష్ట్ర ఉత్పత్తిలో 1.11 శాతానికి... రూ.22,002 కోట్లకు పరిమితం చేయడం మంచి పరిణామం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడమే కాకుండా పారిశ్రామిక ప్రగతికి, 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి బడ్జెట్ బలమైన పునాది వేసింది.'

- నీలయపాలెం విజయకుమార్, చైర్మన్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు

ఆచరణాత్మకం... సంక్షేమ హితం

'రాష్ట్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం. బడ్జెట్ ఆచరణాత్మక, సంక్షేమ ఆధారమైనది. ఆర్థిక పరివర్తనపై దీర్ఘకాలిక దృష్టితో రూపొందించారు. ప్రస్తుతం ఆర్థిక లోటు నియంత్రణ అత్యంత కీలకం. అభివృద్ధితో పాటు ఆర్థిక క్రమశిక్షణ అవసరం. స్థిరమైన, సమ్మిళిత వృద్ధికి రోడ్‌మ్యాప్‌ను ఈ బడ్జెట్ సూచిస్తోంది. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంపొందించడానికి మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధికి అధిక కేటాయింపులతో పాటు గ్రాంట్లు, సబ్సిడీలను సకాలంలో విడుదల చేయడానికి ఎస్క్రో యంత్రాంగాన్ని ప్రవేశపెట్టాలని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.'

- పొట్లూరి భాస్కరరావు, అధ్యక్షుడు, ఏపీ చాంబర్స్

ఆత్మస్తుతి... పరనింద

'తమకు మేలు చేస్తారని ప్రజలు ఎంతో ఆశతో ఎదరు చూస్తే నిరాశపరిచారు. బడ్జెట్ ప్రసంగం అంతా ఆత్మస్తుతి, పరనిందలా ఉంది. రాష్ట్ర బడ్జెట్ వాస్తవాలకు దూరంగా అంకెల గారడీలా,తప్పుల తడకగా ఉంది. బడ్జెట్‌పై కచ్చితంగా మండలిలో చొక్కాపట్టుకొని నిలదీస్తాం.'

- బొత్స సత్యనారాయణ, ప్రతిపక్ష నేత

ప్రజా కంటక బడ్జెట్

'బడ్జెట్ అంతా అప్పుల కుప్ప అంకెల గారడీలా ఉంది. వెన్నుపోటు, ప్రజా కంటక బడ్జెట్ ఇది. ఉద్యోగస్తులకు మొండిచెయ్యి చూపారు.

- వరుదు కల్యాణి, మొండితోక అరుణ్ కుమార్, ఎమ్మెల్సీలు, వైసీపీ

ఎన్నికల హామీలు బారెడు.. కేటాయింపులు మూరెడు

'బడ్జెట్‌లో సూపర్ సిక్స్‌కు ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం దారుణం. ఈ బడ్జెట్ కొత్త సీసాలో పాత సారాలా, అంకెలు ఘనం... అప్పుల కుప్పలా, ఊహజనితంగా ఉంది. ఎన్నికల హామీలు బారెడైతే.. కేటాయింపులు మూరెడు. అనేక ఎన్నికల హామీలను ఎగ్గొట్టారు. ఇది మంచి ప్రభుత్వం కాదు... ముంచే ప్రభుత్వం. కూటమి గెలిచి రెండేళ్లు అవుతున్నా మహాశక్తి పథకం అసలు ఉందో లేదో తెలియదు. మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని నమ్మించి కోటిన్నర మంది మహిళలను రెండేళ్లుగా చంద్రబాబు మోసం చేస్తున్నారు. రూ.10 లక్షల వరకూ ఉచిత రుణాలు ఇస్తానని చెప్పి సున్నా వడ్డీ పథకానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. 50 లక్షల మంది నిరుద్యోగులను చంద్రబాబు మరోసారి మోసం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు చిల్లిగవ్వ కేటాయించలేదు. ప్రభుత్వ ఉద్యోగులనూ చంద్రబాబు వంచించారు. అన్నదాత సుఖీభవ పథకానికి నిధులు పెంచకుండా మళ్లీ పాత కేటాయింపు... రూ.6,000 కోట్లే కొనసాగించడం దారుణం.'

- వైఎస్ షర్మిల, రాష్ట్ర అధ్యక్షురాలు, కాంగ్రెస్

నిరాశపరిచిన బడ్జెట్

» పీఆర్‌సీ, ఆర్థిక అంశాల ప్రస్తావన లేదు: ఉపాధ్యాయ సంఘాలు

అమరావతి/విజయవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌పై ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తంచేశాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక అంశాలను ప్రస్తావించకుండా బడ్జెట్ నిరాశపర్చిందని పేర్కొన్నాయి. 12వ పీఆర్‌సీ ఊసే లేదని, చెల్లించిన వాటి గురించి చెప్పిన ప్రభుత్వం, మిగిలిపోయిన బకాయిల గురించి చెప్పలేదని యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగుల సంక్షేమానికి కేటాయింపులులేవని, బకాయిల విడుదలపై ఎలాంటి ప్రకటనా చేయలేదని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1500 కోట్ల కేటాయింపులు సరిపోవని ఆపస్ అధ్యక్షుడు ఎస్.బాలాజీ పేర్కొన్నారు. బడ్జెట్ వేతన జీవులను నిరాశపర్చిందని, విద్యా రంగానికి కూడా కేటాయింపులు అరకొరగానే ఉన్నాయని, ఆశా, అంగన్‌వాడీ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్, కంటిన్జెంట్ ఉద్యోగుల వేతనాల గురించీ ప్రస్తావించలేదని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి విమర్శించారు. ఈ బడ్జెట్ విద్యారంగ అభివృద్ధికి దోహదపడేలా లేదని, కొఠారి కమిషన్ సిఫారసులను ప్రభుత్వం పాటించలేదని, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం: ఏపీటీఎఫ్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాటం చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.బసవలింగరావు చెప్పారు. విజయవాడలోని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యాయంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర సబ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ 2010కి ముందు ఉపాధ్యాయ వృత్తిలో నియామకం పొందినవారికి టెట్ నుంచి మినహాయింపు కోరుతూ మార్చి 10న ఢిల్లీలో ఆందోళన నిర్వహిస్తామన్నారు.టెట్ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తాలని కోరుతూ ఈనెల 23-28 వరకు ఎంపీలకు వినతిపత్రాలు ఇస్తామని చెప్పారు. ఈనెల 26, 27 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని పాతతాలూకా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామన్నారు.

వ్యవ'సాయం' పెంపు

రూ.53,752 కోట్లతో ప్రత్యేక బడ్జెట్

గతేడాది కన్నా 5,410 కోట్లు ఎక్కువ

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు 2026-27 బడ్జెట్‌లో రూ.53,752.12 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది. శనివారం శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ మేరకు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు. శాసనమండలి ముందు రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వ్యవసాయ బడ్జెట్‌ను ఉంచారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఈ ఏడాది కూడా ప్రాధాన్యం ఇచ్చారు. 2025-26 బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.48,341.14 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం.. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.5,410 కోట్లు పెంచింది. కీలక రంగాలకు నిధులను పెంచింది. ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు గతేడాది రూ.12,773.25 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.13,722 కోట్లు ప్రతిపాదించింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు నిరుడు రూ.12,903.41 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.14,276 కోట్లు ప్రతిపాదించింది. వ్యవసాయ శాఖకు గతేడాది రూ.12, 401.58 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.12, 152 కోట్లు కేటాయించింది. పశుసంవర్థక శాఖకు గతేడాది రూ.1, 112.07 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1,121 కోట్లు, ఉద్యాన శాఖకు గతేడాది రూ.931 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1,123 కోట్లు, మత్స్యశాఖకు గతేడాది రూ.540.19 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.523 కోట్లు, మార్కెటింగ్ శాఖకు నిరుడు రూ.315.32 కోట్లు కేటాయించగా, ఈ సారి రూ.515 కోట్లు ప్రతిపాదించింది. రైతులకు నేరుగా లబ్ధి కలిగించే అన్నదాత-సుఖీభవ పథకానికి రూ.6,600 కోట్లు, ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లు, పంటల బీమాకు రూ.250 కోట్లు, వడ్డీ లేని రుణాలకు రూ.250 కోట్లు ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించింది.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్ ప్రతిపాదన

	(రూ.కోట్లలో)
సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ	14,276.89
రైతులకు విద్యుత్ సబ్సిడీ	13,722.00
వ్యవసాయ శాఖ	12,152.32
ఉద్యాన శాఖ	1,123.86
పశుసంవర్థక శాఖ	1,121.26
ఉపాధి హామీ	500.00
మత్స్యశాఖ	523.52
మార్కెటింగ్ శాఖ	515.39
అగ్రి వర్సిటీ	504.11
సహకార శాఖ	209.30
వెటర్నరీ వర్సిటీ	163.01
హార్టికల్చర్ వర్సిటీ	97.99
పట్టు పరిశ్రమ	95.87
ఫిషరీస్ వర్సిటీ	39.20

పథకాల వారీగా కేటాయింపులు	(రూ.కోట్లలో)
అన్నదాత సుఖీభవ	6,600.00
రాష్ట్రీయ కృషి వికాస్ యోజన	1,927.00
ధరల స్థిరీకరణ నిధి	500.00
సూక్ష్మసేద్యం	475.00
మత్స్యశాఖ పథకాలు	398.00
మత్స్యకార సేవలో..	260.00
పంటల బీమా	250.00
వడ్డీ లేని రుణాలు	250.00
కృషి సించాయ్ యోజన	250.00
విత్తన రాయితీ	240.00
ఆయిల్‌పామ్ తోటల పెంపకం	204.00
సామాజిక ప్రకృతి సేద్యం	208.00
సమగ్ర ఉద్యాన అభివృధి	176.50
వ్యవసాయ యాంత్రీకరణ	139.65
ఎరువులు బఫర్ స్టాక్	40.00
పశుగ్రాస భద్రత	22.00
రైతుసేవా కేంద్రాల నిర్వహణ	15.68
వీధి పశువులకు గోకులాలు	14.00
అగ్రి ల్యాబ్స్	4.66

సాగునీటికి పెద్దపీట



జలవనరుల శాఖకు 18,223 కోట్లు

ఇందులో పోలవరానికి 6,105 కోట్లు

ప్రాధాన్య పథకాలకు అధిక కేటాయింపులు

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పరుగులు పెట్టేలా జల వనరుల శాఖకు 2026-27 వార్షిక బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం లభించింది. ప్రాధాన్య ప్రాజెక్టులకు పెద్ద పీట వేస్తూ రూ.18,223.67 కోట్లను కేటాయించారు. 2025-26 బడ్జెట్ కేటాయింపుల కంటే ఇది 204 కోట్లు మాత్రమే అదనం. వాస్తవానికి ప్రాధాన్య ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేందుకు రూ.48,488 కోట్లు కావాలని జల వనరుల శాఖ అభ్యర్థించింది. అయితే ప్రాధాన్య ప్రాతిపదికన రూ.18,223,67 కోట్లను ఆర్థిక శాఖ కేటాయించింది. ఇందులో పోలవరం ప్రాజెక్టు తప్ప మిగతా మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వాటా రూ.9,906 కోట్లు. రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు తొలిదశను వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న నేపథ్యంలో.. 2026-27 సంవత్సరానికి రూ.6,105 కోట్లు కేటాయించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేయాలని జల వనరుల శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనకాపల్లి వరకు గోదావరి జలాలను తరలిస్తూనే.. అటు ఉత్తరాంధ్రలోని వంశధార-నాగావళి నదుల అనుసంధాన పథకాలను చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రాజెక్టుల నిర్వహణ, వరద నియంత్రణ, డ్రైనేజీ పనులకు 450 కోట్లు కేటాయించింది.

ప్రాధాన్య ప్రాజెక్టులకు ఎంతెంత?

ప్రాజెక్టు కేటాయింపు	(రూ.కోట్లలో)
పోలవరం	6,105.79
హంద్రీ-నీవా	2,621.74
తెలుగుగంగ	936.87
గాలేరు-నగరి	665.37
వెలిగొండ	492.9
ఉత్తరాంధ్ర సుజల స్రవంతి	605.75
ఉత్తర కోస్తా ప్రాజెక్టులు	469.84
గోదావరి-పెన్నా అనుసంధానం తొలిదశ	200.00
చింతలపూడి	430
కృష్ణా డెల్టా	1,003.73
కడప ఇరిగేషన్ ప్రాజెక్టులు	926.2
కర్నూలు ఇరిగేషన్ ప్రాజెక్టులు	479.57
అనంతపురం ఇరిగేషన్ ప్రాజెక్టులు	3,160.41
కేసీ కెనాల్	184.38
నాగార్జునసాగర్	181.9
నేరడి బ్యారేజీ	182.15
పులివెందుల కెనాల్	130.69
పుష్కర ఎత్తిపోతల	119.21
తుంగభద్ర హెచ్ఎల్‌సీ స్టేజ్-1	50.00
తుంగభద్ర హెచ్ఎల్‌సీ స్టేజ్-2	53.45
తుంగభద్ర ఎల్ఎల్‌సీ	250.00
గోదావరి డెల్టా సిస్టమ్	203.4
మహేంద్రతనయ	90.00
కొరిశపాడు లిఫ్టు	35.00
గురురాఘవేంద్ర	26.00
శ్రీశైలం కుడి గట్టు కాలువ	26.00
తాడిపూడి లిఫ్టు	20.00
ఏలేరు రిజర్వాయర్	17.89
గాజులదిన్నె	11.62
గుండ్లకమ్మ	10.00
మైనర్ ఇరిగేషన్	663.84

రైతును రాజుగా మార్చే పంచసూత్రాలు

- లాభసాటి సాగుకు ఆధునిక సాంకేతికత జోడింపు
- లక్ష కోట్లతో సీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్
- ఉద్యాన పంటల వైపు రైతుల్ని ప్రోత్సహిస్తున్నాం
- ప్రకృతి వ్యవసాయంలో ఏపీ దేశానికే రోల్ మోడల్
- ధరల స్థిరీకరణ నిధితో రైతుల్ని ఆదుకుంటాం
- కోకో హబ్‌గా పశ్చిమగోదావరి జిల్లా
- వ్యవసాయ బడ్జెట్ ప్రసంగంలో అచ్చెన్నాయుడు



అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'రైతును రాజుగా చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో పంచసూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే అంశాలకు అధిక ప్రాధాన్యం కల్పించి, రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం శాసనసభలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.53,752.12 కోట్లతో 2026-27 ప్రతిపాదిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. స్వర్ణాంధ్ర-2047 సాధన కోసం రూపొందించిన పది సూత్రాలలో వ్యవసాయ రంగానికి సంబంధించి 'ఫార్మర్స్ అగ్రిటెక్' ముఖ్యమైన అంశమన్నారు. ఆధునిక సాంకేతికతలతో వ్యవసాయాన్ని లాభసాటిగా, అధిక ఆదాయ వనరుగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు. "రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17,62,357 కోట్లు ఉండగా, వ్యవసాయ రంగ వాటా 33.20 శాతంతో రూ.5,39,454 కోట్లు అందించింది. జాతీయ వ్యవసాయ వృద్ధి రేటు 0.80 శాతం ఉండగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఏపీ వ్యవసాయ వృద్ధి రేటు 7.83 శాతం నమోదైంది. దేశ వ్యవసాయ రంగ ఉత్పత్తిలో ఏపీ వాటా 10 శాతం ఉందని గర్వంగా చెప్తున్నాం. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధనలో ఈ రంగంలో 15 శాతం వృద్ధిని సాధించేందుకు 11 వ్యవసాయ పంటలను గ్రోత్ ఇంజన్లుగా గుర్తించాం. ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.20 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద అందిస్తున్నాం. 2025-26లో రెండు విడతల్లో 46.86 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.6,309.44 కోట్లు చెల్లించాం. 2026-27లో రూ.6,600 కోట్లు ప్రతిపాదించాం. ధాన్య సేకరణకు పాత బకాయిలు రూ.1,674.47 కోట్లు చెల్లించి రైతుల్ని ఆదుకున్నాం. ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకంలో 22.5 లక్షల పంపుసెట్లకు రోజూ 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాం. గత డిసెంబరు వరకు రూ.13,241 కోట్లు ప్రభుత్వం రాయితీ భరించింది. ఇప్పటి వరకు 69 వేల కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. ఈ ఏడాది విద్యుత్ రాయితీ కింద రూ.13,722 కోట్లు ప్రతిపాదించాం. వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ అనుసంధానం కింద గతేడాది రూ.2,783 కోట్లతో 831 లక్షల పని దినాలు కల్పించాం. ఎన్టీఆర్ జలసిరి కింద ఈ ఏడాది ఉచిత బోర్లు వేసి, మోటార్లు ఉచితంగా ఇస్తాం. రైతులకు నీటి భద్రత కోసం అవసరమైన కాలువల పూడికతీత, ప్రాజెక్టుల నిర్వహణకు ఈ ఏడాది రూ.14,277 కోట్లు ప్రతిపాదించాం. రైతుల వ్యవసాయ యాంత్రీకరణకు రూ.139.65 కోట్లు, రాయితీ విత్తనాలు పంపిణీకి రూ.240 కోట్లు కేటాయించాం. గతేడాది 37.53 లక్షల టన్నుల ఎరువులు సరఫరా చేయగా, ఈసారి రూ.40 కోట్లతో బఫర్‌స్టాక్ పెడతాం. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయంలో ఏపీ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద 8.357 గ్రామాల్లో కమ్యూనిటీ బేస్డ్ నేచురల్ ఫార్మింగ్ అమలు చేస్తున్నాం. ఉత్తమ ప్రకృతి సేద్య విధానాలు అవలంబిస్తున్న 12,319 మంది చాంపియన్ రైతులను క్షేత్రస్థాయి శిక్షకులుగా తయారు చేశాం. 2.83 లక్షల మంది రైతులు 3.55 లక్షల ఎకరాల్లో రసాయన రహిత ఎస్2ఎస్ వ్యవసాయాన్ని అనుసరించారు. ఈ ఏడాది ప్రకృతి సేద్యానికి రూ.208 కోట్లు కేటాయించాం. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కేంద్రమైన వ్యవసాయ శాఖకు రూ.12,152.32 కోట్లు ప్రతిపాదించాం" అని అన్నారు.

పశ్చిమలో కోకో హబ్

రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టును ప్రైవేట్ పెట్టుబడులు, కేంద్రం సహకారంతో అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని అచ్చెన్న వెల్లడించారు. ఇందులో ప్రభుత్వ వాటా రూ.30 వేల కోట్లు కాగా, ఉద్యాన అభివృద్ధికి రూ.15 వేల కోట్లు వెచ్చించనున్నట్టు తెలిపారు. రాయలసీమతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో 22 ప్రధాన పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టి, నాణ్యమైన మొక్కల సరఫరా నుంచి ఎగుమతుల వరకు సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. పశ్చిమగోదావరి జిల్లాను కోకో హబ్‌గా చేసి, కోకో సిటీ ఏర్పాటుతో చాక్లెట్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పండ్ల తోటల రైతులకు స్థిరమైన ఆదాయ భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా సంప్రదాయ సాగు నుంచి అధిక ఆదాయమిచ్చే ఉద్యాన పంట వైపు రైతుల్ని ప్రోత్సహిస్తున్నామని అన్నారు.

"మూడోసారి వ్యవసాయ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం ఇచ్చిన సీఎంకు కృతజ్ఞతలు. యువతను వ్యవసాయం వైపు తిప్పేందుకు లాభదాయక వృత్తిగా చేస్తాం. డిమాండ్ ఆధారిత పంటల్ని ప్రోత్సహిస్తాం. తుఫాన్ల ప్రభావం తగ్గింపే ప్రభుత్వ లక్ష్యం. కృష్ణా, గోదావరి డెల్టాల్లో ఖరీఫ్ సాగును ముందుకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. దీనికి రైతుల సహకారం ముఖ్యం. ప్రతి రైతుకూ యూనిక్ ఐడీ ఇస్తున్నాం. ఇప్పటికి 46.59 లక్షల మంది రైతు రిజిస్ట్రీలో నమోదయ్యారు" అని అచ్చెన్న అన్నారు.

ప్రతి రైతుకూ యూనిక్ ఐడీ

సీమ సిగన 'ఉద్యాన' సిరి

(మొదటి పేజీ తరువాయి)



పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే ఉత్పత్తి, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సీమను ఉద్యానవన హబ్‌గా అభివృద్ధి చేసేందుకు మూడు కీలక రంగాలపై సుమారు రూ.41వేల కోట్ల పెట్టుబడి పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రూ.30వేల కోట్లను ప్రస్తుత బడ్జెట్‌లోనే కేటాయించారు. అదనంగా, ప్రైవేటు రంగం నుంచి (రైతులు, పారిశ్రామికవేత్తలు, లాజిస్టిక్స్ సంస్థలు) మరో రూ.59వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. మొత్తం మీద రానున్న ఏడాది, రెండేళ్లలో సుమారు లక్ష కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉంది. ప్రభుత్వం దృష్టి సారించిన మూడు ప్రధాన రంగాలివీ..

నీటిపారుదల రంగం..

నీటి పారుదల రంగంలో సుమారు రూ.20వేల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నారు. అధిక విలువ పంటలకు సాగునీటి సుస్థిరత కల్పించడమే లక్ష్యంగా ఈ పెట్టుబడులు పెడుతున్నారు. తద్వారా కొత్తగా తొమ్మిది లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు ప్రస్తుతం సాగులో ఉన్న 3.6 లక్షల ఎకరాలకు సాగునీటి వ్యవస్థను పటిష్ఠం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వెలిగొండ, గాలేరు - నగరి సాగునీటి పథకం, హంద్రీ- నీవా సాగునీటి పథకం, పేరూరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, శ్రీ బాలాజీ రిజర్వాయర్ వంటి ప్రాజెక్టులు పూర్తి చేయడంతోపాటు చెరువుల పునరుద్ధరణ, సూక్ష్మ నీటి పారుదల (మైక్రో ఇరిగేషన్) విస్తరణ ద్వారా నీటి వినియోగ సామర్థ్యం పెంచనున్నారు.

అధిక విలువ కల్పించడం.

ఉద్యానవన పంటలకు అధిక విలువ కల్పించే కార్యక్రమం కోసం సుమారు రూ.15వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. 200కి పైగా క్లస్టర్లను అభివృద్ధి చేయడం ద్వారా ఉత్పత్తి, నాణ్యత, మార్కెటింగ్‌ను మెరుగుపర్చనున్నారు. ఆధునిక నర్సరీల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటివి చేస్తారు. ఆరు లక్షల హెక్టార్లలో సూక్ష్మ నీటి పారుదల, మూడు లక్షల హెక్టార్లలో ఉన్న తోటల పునరుజ్జీవం ద్వారా ఉత్పత్తిని పెంచడంపై దృష్టి పెడుతున్నారు. తద్వారా అరటి, మామిడి, దానిమ్మ, మొసంబి, టమాటా, మిర్చి వంటి పంటలను ప్రపంచ స్థాయి నాణ్యతతో ఎగుమతులకు సిద్ధం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గ్రామీణ రోడ్లను మెరుగుపర్చడం...

గ్రామీణ రోడ్లను మెరుగుపర్చేందుకు సుమారు రూ. ఆరు వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. ఉత్పత్తి కేంద్రాలను మార్కెట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఓడరేవులు, విమానాశ్రయాలతో అనుసంధానించేందుకు 7,326 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను మెరుగుపర్చడం, పునర్నిర్మించడం చేస్తారు. దీనివల్ల రవాణా సమయం, ఖర్చు తగ్గి, పాడైపోయే పంటలను త్వరగా మార్కెట్లకు చేర్చడం సులభతరం అవుతుంది.




ఆర్థిక సామాజిక ప్రభావం

భారీ పెట్టుబడుల వల్ల రాయలసీమ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక ప్రభావం ఎంతో ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రతి సంవత్సరం 4.4 లక్షల మందికిపైగా రైతులు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతారు. ఉద్యానవన రంగం నుంచి ఏటా రూ.24వేల కోట్లకుపైగా అదనపు ఆదాయం వస్తుంది. పంట దిగుబడిలో సుమారు 10 శాతం మెరుగుదల, పంటకోత అనంతర నష్టాల నుంచి ఏటా 12 నుంచి 15 లక్షల మెట్రిక్ టన్నుల పంటను కాపాడటం జరుగుతుంది.

జిల్లాలవారీగా ప్రయోజనాలివీ..

- **అనంతపురం** : 1,372 కిలోమీటర్ల గ్రామీణ రోడ్ల అభివృద్ధి, తొమ్మిది లక్షలమందికి లబ్ధి
- **అన్నమయ్య** : 478 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి, 2.5 లక్షల మందికి ప్రయోజనం
- **చిత్తూరు** : 482 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి, నాలుగు లక్షల మందికి ప్రయోజనం
- **కర్నూలు** : 909 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి, 8.5 లక్షల మందికి ప్రయోజనం
- **నంద్యాల** : అలగనూరు రిజర్వాయర్ పునరుద్ధరణ, 844 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి, ఏడు లక్షల మందికి ప్రయోజనం
- **ప్రకాశం, మార్కాపురం**: వెలిగొండ, పాలేరు ప్రాజెక్టులతో నీటి భద్రత
- **శ్రీసత్యసాయి** : హంద్రీనీవా సుజల స్రవంతి కాల్వలతో నీటిసరఫరా, 933 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి, ఐదు లక్షల మందికి ప్రయోజనం
- **తిరుపతి** : 371 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి, 4.5 లక్షల మందికి ప్రయోజనం, తిరుమలకు తాగునీటి భరోసా
- **కడప** : గాలేరు నగరి, వెలిగొండ ద్వారా జలాలు, 746 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి



బడ్జెట్ సమగ్ర స్వరూపం



వివరం	2024-25	2025-26 (బ.అం)	2025-26 (స.అం)	2026-27 (బ.అం)
1) రెవెన్యూ వసూళ్లు	1,67,676	2,17,976	1,96,903	2,34,140
ఎ) పన్ను ఆదాయం	89,436	1,09,007	98,025	1,25,846
బి) పన్నేతర ఆదాయం	5,972	19,119	14,324	11,474
సి) కేంద్ర పన్నుల్లో వాటా	52,080	57,566	56,741	64,362
డి) గ్రాంట్లు	20,188	32,284	27,813	32,458
2) మూలధన వసూళ్లు	1,04,646	1,04,383	1,03,631	98,065
3) మొత్తం వసూళ్లు	2,72,322	3,22,359	3,00,534	3,32,205
4) రెవెన్యూ వ్యయం	2,27,961	2,51,162	2,38,022	2,56,142
5) మూలధన వ్యయం	16,141	40,636	33,135	48,698
6) రుణాలు, వడ్డీ చెల్లింపు	28,184	30,561	29,378	27,365
7) మొత్తం వ్యయం	2,72,286	3,22,359	3,00,535	3,32,205
8) రెవెన్యూ లోటు	(-)60,285	(-)33,186	(-)41,118	(-)22,002
9) ద్రవ్య లోటు	(-)81,362	(-)79,927	(-)80,567	(-)75,868

బ.అం.- బడ్జెట్ అంచనా స.అం.- సవరించిన అంచనా (అంకెలు రూ. కోట్లలో)

రహదారులకు 6 వేల కోట్లు



కొత్తగా రోడ్ల విస్తరణ, అభివృద్ధికి నిధులు

పలు ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు


అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో రహదారి ప్రాజెక్టులకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రాజెక్టులతో పాటు కొత్తగా రహదారుల విస్తరణ, అభివృద్ధికి రూ.6 వేల కోట్ల మేర నిధులను ప్రతిపాదించింది. రైల్వే వర్కులు, ఆర్‌వోబీలకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.100 కోట్లు, రైల్వే భద్రత, రహదారి భద్రత పనుల కోసం రూ.45 కోట్లు, జిల్లా రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం రూ.281 కోట్లు ప్రతిపాదించింది. జిల్లా ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం మరో రూ.255 కోట్లు కేటాయించారు. కోర్ నెట్‌వర్క్ స్కీమ్ కింద చేపట్టే ప్రాజెక్టులకు రూ.250 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రహదారి అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ) ద్వారా చేపట్టే ప్రాజెక్టులకు రూ.130 కోట్లు, ఆర్ఐడీఎఫ్ ప్రాజెక్టులకు రూ.200 కోట్లు, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు రుణంతో అమలు చేస్తోన్న రెండు కీలక ప్రాజెక్టులు, బ్రిడ్జీల పునర్నిర్మాణం కోసం రూ.580 కోట్ల నిధులను బడ్జెట్ పద్దుల్లో ప్రతిపాదించారు. సీఆర్ఎఫ్ కింద రూ.400 కోట్లు, సేతబంధన్ ప్రాజెక్టు వర్క్‌లకు రూ.81 కోట్లు, సీఐఆర్ఎఫ్ రహదారి పనులకు రూ.400 కోట్లు ప్రతిపాదించారు. వివిధ పథకాల కింద కేంద్రమే రూ.2,600 కోట్ల నిధులు ఇచ్చేలా బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

50 పేజీలు... గంటా 13 నిమిషాలు

బడ్జెట్ ప్రసంగాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ గంటా 13 నిమిషాల్లో పూర్తిచేశారు. బడ్జెట్ పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో కలిపి 80 పేజీలు రూపొందించగా, అందులో తెలుగు ప్రసంగం 50 పేజీలను చదివారు. ఉదయం 11.21గంటలకు బడ్జెట్ ప్రసంగం ప్రారంభించి, 12.34గంటలకు ముగించారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌ను చదివి అవగాహన పెంచుకునేందుకు ఆది, సోమవారాల్లో సభకు విరామం ఇచ్చారు.



AP బడ్జెట్ 2026-27





ఇది భవిష్య దర్శిని

దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు దార్శనిక పత్రం

గత ప్రభుత్వంలో విధ్వంసం... ఇప్పుడు వికాసం

- పెట్టుబడిదారులను తిరిగి రప్పిస్తున్నాం
- గ్రోత్ ఇంజన్లుగా విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలు
- ఉత్తరాంధ్రకు 28వేలకోట్లు... సీమకు 30వేల కోట్లు
- ఇకపై రాయలసీమ అంటే కొరత కాదు..మిగులు
- ధరల స్థిరీకరణకు రూ.500 కోట్లు
- పోలీసులకు మూడు వేల కొత్త వాహనాలు
- బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల వెల్లడి

"గత ప్రభుత్వం మిగిల్చిన గాయాలను మాన్పి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా నడిపించేందుకు 2024 బడ్జెట్ పునాది వేసింది. అంతటి విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మించడానికి రెండేళ్లు చాలా తక్కువ సమయం. రాష్ట్ర విభజన రాష్ట్రానికి మొదటి దెబ్బ అయితే, వైసీపీ పాలన మరో పెద్ద షాక్. ఇన్ని సవాళ్లను ఎదుర్కొంటూ కూడా కూటమి ప్రభుత్వం 20 నెలల్లో అద్భుతమైన అభివృద్ధి పథంలో సాగింది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ప్రజల జీవితాల్లో గొప్ప మార్పు తీసుకురావడం బడ్జెట్ ఉద్దేశం." - ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):"ఈరోజు మనం ఎంచుకున్న మార్గాలే, రేపటి మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఈ స్ఫూర్తికి ఈ బడ్జెట్ అద్దం పడుతుంది. ఇది కేవలం మన రాష్ట్రాన్ని రేపటి కోసం సిద్ధం చేసేందుకు ఉద్దేశించింది మాత్రమే కాదు. భవిష్యదర్శిని. కేవలం వృద్ధి లెక్కలు చెప్పేది మాత్రమే కాకుండా, భావి ఆర్థిక గమనాన్ని, లక్ష్యాన్ని బలంగా చాటిచెబుతుంది' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఈ బడ్జెట్‌ను తాత్కాలిక ఉపశమనం కలిగించేదిగా కాకుండా, దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు ఉద్దేశించిన దార్శనిక పత్రంగా ఆయన అభివర్ణించారు. 2026-27 వార్షిక బడ్జెట్‌ను శనివారం శాసనసభలో పయ్యావుల ప్రవేశపెట్టారు. శాఖల వారీగా కేటాయింపులను తన ప్రసంగంలో వివరించారు.

విధ్వంసం నుంచి వికాశం దిశగా..

"కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాం. 2019-24 మధ్య 10.3 శాతానికి పడిపోయిన ఆర్థిక వృద్ధి రేటును 11.75 శాతానికి పెంచాం. డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుచేయాలన్న గూగుల్ నిర్ణయంతో ఒక్కసారిగా ప్రపంచమంతా ఏపీవైపు చూసింది. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తూ, ప్రభుత్వంపై నమ్మకం పెరిగిందంటే దానికి సీఎం చంద్రబాబు దార్శనిక పాలన, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విశ్వసనీయ భాగస్వామ్యమే కారణం. దేశ జనాభాలో 4.2 శాతంగా ఉన్న ఏపీ...పెట్టుబడుల సాధనలో మిగిలిన రాష్ట్రాలను వెనక్కి నెట్టింది. కేంద్ర బడ్జెట్ ఆశాకిరణంగా మారింది. తూర్పు కోస్తా పారిశ్రామిక కారిడార్, పర్యాటక కేంద్రాల అభివృద్ధి, విద్యుత్ బస్సుల కొనుగోలుకు 'పూర్వోదయ' ఉపయోగపడుతుంది."

ఆ మూడు రీజియన్లూ గ్రోత్ ఇంజన్లు

"విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లను గ్రోత్ ఇంజన్లుగా ప్రభుత్వం గుర్తించింది. విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు (వీఈఆర్) మాస్టర్ ప్లాన్ తయారుచేశాం. మెట్రో రైలు ప్రాజెక్టులతో సహా వీఈఆర్‌కు రూ.28వేల కోట్లు ప్రతిపాదిస్తున్నాం. ఈ తరహాలోనే ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలతో అమరావతి ఎకనమిక్ రీజియన్ అభివృద్ధి చేస్తాం. రాయలసీమ రీజియన్‌ను గ్లోబర్ హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం.

రాయలసీమ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేశాం. 2030 నాటికి ఉద్యాన పంటలను 14.41 లక్షల హెక్టార్లకు పెంచుతాం. దీనివల్ల లక్షల మంది రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో 9 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇకపై రాయలసీమ పేరు చెబితే 'మిగులు' అన్న మాట తప్ప, కొరత అనే మాట వినబడదు. ఈ ప్రాజెక్టుకు రూ.30వేల కోట్లు ప్రతిపాదిస్తున్నాం."

జల వనరులతో కరువు రహితం: "సాగునీటి రంగానికి బడ్జెట్ అధిక ప్రాధాన్యమిస్తోంది. పోలవరం ప్రాజెక్టులో రూ.5వేల కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించి, పనులు వేగవంతం చేశాం. అన్నదాత సుఖీభవ పథకం కింద 46.86 లక్షల కుటుంబాలకు రూ.20వేలు చొప్పున అందించాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో ధరల స్థిరీకరణ నిధికి 880 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. మేం ఒక్క ఏడాదిలోనే రూ.1,200 కోట్లపైగా ఖర్చు చేశాం. తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు భర్తీ చేశాం."

ఆర్థిక క్రమశిక్షణ చర్యలు

"గత ప్రభుత్వం 12.3% వడ్డీ రేటుతో అప్పులు చేసింది. దానిని 9% లోపునకు తెచ్చేందుకు చర్యలుచేపడుతున్నాం. ఇప్పటివరకూ రూ.43,298 కోట్ల రుణాలకు వడ్డీ తగ్గించి, రూ.327కోట్లు ఆదా చేశాం. మరో రూ.1.2లక్షల కోట్లపై చర్యలు తీసుకుంటున్నాం. తద్వారా 1658 కోట్లు ఆదా అవుతాయని అంచనా. 2024 జూన్ 12నాటికి పెండింగ్‌లో ఉన్న రూ.24,811కోట్ల బకాయిలు చెల్లించాం. ఏపీ వెల్త్ ఫండ్‌ను 100కోట్ల సీడ్ కార్పస్‌తో ఏర్పాటుచేయాలని ప్రతిపాదిస్తున్నాం. 'బ్రాండ్‌ఆంధ్ర'ను పునరుద్ధరించాం. జూన్ 2024 నుంచి 9.68 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు ఆమోదించడంతో, 5.41 లక్షల ఉద్యోగావకాశాల సృష్టికి మార్గం ఏర్పడింది. దేశంలో అతిపెద్ద ఎఫ్‌డీఐని ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ నిలిచింది. 15 బిలియర్ డాలర్లతో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఎంవోయూ చేసుకున్నాం. ఐటీ మంత్రి లోకేశ్ 'బ్రాండ్ చంద్రబాబు'ను సమర్థంగా ఉపయోగించి ఈ చారిత్రక ఒప్పందాన్ని సాధించారు. ఆయనను 'ఏపీ చీఫ్ జాబ్ క్రియేటర్'గా పిలవడం సముచితం. ఎన్టీఆర్ భరోసా కింద పెన్షన్లకు 19 నెలల్లో రూ.58 వేల కోట్లు వెచ్చించాం.

ఆర్థిక ఒత్తిడి ఉన్నా సూపర్ సిక్స్ అమలుచేస్తున్నాం. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లిస్తున్నాం. 1,100 కోట్ల డీఏ, డీఆర్ బకాయిలు విడుదల చేశాం. వివిధ కేటగిరీల్లో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ధాన్యం కొనుగోళ్లలో ఆదర్శంగా నిలుస్తూ, ఒకేరోజు రికార్డుస్థాయిలో రూ.9,740 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశాం. దీపం 2.0 కింద మహిళలకు ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు అందిస్తూ... 2897 కోట్లు వారి ఖాతాల్లో జమచేశాం. గత ప్రభుత్వం 6,486 కోట్లు ఆరోగ్య రంగంలో బకాయిలు పెట్టింది. వీటిలో చాలా వరకు చెల్లించాం. పౌరుల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ప్రాజెక్టు సంజీవిని చేపట్టాం. ఈ ఏడాది రూ.11వేల కోట్ల విద్యుత్ రాయితీని విడుదల చేసి 22.5 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చాం. పీఎం ఈ-బస్ సేవా పథకం కింద 11 నగరాల్లో 750 ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడతాం. స్త్రీశక్తి కింద మహిళా ప్రయాణికులు లబ్ధి పొందుతున్నారు. గోదావరి పుష్కరాలకు రూ.60 కోట్లు కేటాయిస్తున్నాం."

అమరావతికి చట్టబద్ధత

"అమరావతికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ ప్రారంభించినందుకు ప్రధానికి ప్రత్యేక ధన్యవాదాలు. రాజధానిలో రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చాం. ఇది ప్రజల రాజధాని అమరావతిని నిర్మించాలనే మా నిబద్ధతకు నిదర్శనం. 2027 నాటికి అమృత్ 2.0 కింద 117 యూడీఏల్లోని 506 ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. విశాఖపట్నం, విజయవాడల్లో ఆధునిక మెట్రో రైలులో ప్రయాణించే కల త్వరలో సాకారమవుతుంది. పీఎం ఆవాస్ యోజన- ఎన్టీఆర్ నగర్స్‌లో పేదలకు 25 లక్షల ఇళ్లను అందించడం లక్ష్యం. పోలీసు శాఖకు 3వేల కొత్త వాహనాలు త్వరలో అందిస్తాం. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తాం. కొత్త పోలీసు అకాడమీకి రూ.15 కోట్లు కేటాయిస్తున్నాం. మహిళల భద్రత కోసం 'శక్తి యాప్'ను ప్రారంభించాం. ఏడు నిమిషాల్లోనే స్పందించి, చర్యలు తీసుకుంటున్నాం. కొత్త ఎక్సైజ్ విధానంతో మద్యంలో లీకేజీలను అరికట్టాం. అగ్నిమాపక సేవల కోసం 17 కొత్త అగ్నిమాపక కేంద్రాలు స్థాపిస్తున్నాం." అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.

మీ అప్పులు మేం తీరుస్తున్నాం

"అప్పుల గురించి మాట్లాడుతున్న మిత్రులకు (వైసీపీ నేతలను ఉద్దేశించి) ఒక విషయం గుర్తు చేస్తున్నా. రూ.9.74 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి వెళ్లారు. మీరు చేసిన అప్పులు తీర్చడానికి మేం మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోంది. నేడు మేం చేస్తున్న అప్పులోని ప్రతి రూపాయి కూడా ఉత్పాదక వ్యయంలోకే వెళ్తుంది. సకాలంలో జీతాలు ఇవ్వలేని దుస్థితి నుంచి సమర్థ పాలన దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోంది."



అప్పులు భారమే!

సంవత్సరం	అప్పు(రూ.కోట్లలో)	జీఎస్‌డీపీలో %
2017-18	2,23,705	28
2018-19	2,57,509	28
2019-20	3,01,802	31
2020-21	3,50,557	36
2021-22	3,78,087	33
2022-23	4,29,526	33
2023-24	4,91,734	35
2024-25	5,68,623	36
2025-26 (స.అం.)	6,35,177	36
2026-27 (బ.అం.)	7,11,094	36

స.అం.: సవరించిన అంచనా
బ.అం.: బడ్జెట్ అంచనా

వివిధ పథకాలు, ప్రాజెక్టులకు కేటాయింపులు	(రూ.కోట్లలో)
ఎన్టీఆర్ భరోసా	27,719.00
దీపం	2,601.00
వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతు	2,320.00
స్త్రీశక్తి	1,420.00
బలహీన వర్గాలకు సబ్సిడీ, ఉచిత విద్యుత్	600.00
ఆటో డ్రైవర్ల సేవలో	450.00
తల్లికి వందనం	9,668.00
మహిళా శిశు సంక్షేమం	4,581.00
ఉపకార వేతనాలు	3,836.00
సమగ్ర శిక్ష	2,946.00
ఉన్నత విద్య	2,566.00
డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం	2,161.00
మన బడి, మన భవిష్యత్	1,500.00
నైపుణ్యాభివృద్ధి	1,232.00
సీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా	707.00
సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర	654.00
బీసీ సంక్షేమం	23,650.88
సాంఘిక సంక్షేమం	11,118.84
ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం	10,699.33
యువత, క్రీడలు	438.00
అమరావతి	6,000.00
పోలవరం	6,105.00
మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు	9,906.00
అన్నదాతా సుఖీభవ	6,105.00
రహదారులు	13,546.00
రాష్ట్రీయ కృషి వికాస్ యోజన	1,927.00
ధరల స్థిరీకరణ నిధి	500.00
మత్స్యకార సేవలో	260.00
పంటల బీమా	250.00
పీఎం కృషి సించాయి యోజన	190.00
వీబీ జీరామ్‌జీ	8,365.00
గృహనిర్మాణం (పట్టణ, గ్రామీణ)	5,451.00
ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు	4,000.00
జల్‌జీవన్ మిషన్	4,000.00
పునరుత్పత్తి, చిన్నారుల ఆరోగ్యం	2,144.00
స్వచ్ఛభారత్ మిషన్	1,037.00
నేషనల్ లైవ్‌లీహుడ్ మిషన్	955.00
ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా	838.00

విద్యకు భారీ కేటాయింపులు

- పాఠశాల విద్యకు 32,308 కోట్లు
- తల్లికి వందనం పథకానికి 9,668 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యా రంగానికి 2026-27 బడ్జెట్‌లో ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మొత్తంగా విద్యా రంగానికి 36,107 కోట్లు కేటాయించింది. ఇది మొత్తం బడ్జెట్‌లో సుమారుగా 11 శాతం. పాఠశాల విద్యకు రూ.32,308 కోట్లు కేటాయించగా.. ఇందులో రూ.1500 కోట్లు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తారు. ఉన్నత విద్యా శాఖకు రూ.2567 కోట్లు కేటాయించింది. యువతకు నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దేందుకు.. నైపుణ్యాభివృద్ధి- శిక్షణ శాఖకు రూ.1,232 కోట్లు కేటాయించింది. 1 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఏటా రూ.15వేలు ఇచ్చే తల్లికి వందనం పథకానికి రూ.9,668 కోట్లు కేటాయించింది. ఉన్నత విద్యలో ఫీజు రీయింబర్స్‌మెంట్, మెయింటెనెన్స్ ఫీజుల కింద రూ.3,836 కోట్లు, పాఠశాల విద్యలో సమగ్రశిక్ష విభాగానికి భోజనం పథకానికి రూ.2161 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర(స్టూడెంట్ కిట్లు)కు రూ.654 కోట్లు కేటాయించింది. మొత్తంగా విద్యా రంగానికి బడ్జెట్‌లో దాదాపు 11శాతం నిధులు కేటాయించింది.

చంద్రన్న బీమాకు 300 కోట్లు

కార్మిక శాఖకు ప్రభుత్వం అత్యధికంగా రూ.735.32కోట్లు కేటాయింపులు చేసింది. గతేడాది రూ.732 కోట్లు కేటాయించినా సవరించిన అంచనాల మేరకు 301కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. చంద్రన్న బీమా పథకానికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.300 కోట్లు కేటాయింది. ఈఎస్ఐ కార్పొరేషన్‌కు రూ.344.74 కోట్లు కేటాయించింది.

గృహ నిర్మాణానికి 6,357 కోట్లు

బలహీనవర్గాల గృహ నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.6,357.31 కోట్లు కేటాయించింది. గతేడాది రూ.6,317 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల్లో రూ.2,017కోట్లు మాత్రమే చూపించింది. ఈ ఏడాది రూ.40 కోట్లు పెంచింది.

పర్యాటకానికి 294.61 కోట్లు

పర్యాటక, సాంస్కృతి, యువజన, క్రీడాశాఖలకు కలిపి బడ్జెట్‌లో రూ.439.26 కోట్లు కేటాయించింది. పర్యాటక శాఖకు రూ.294.61, క్రీడా, క్రీడాప్రాధికార సంస్థకు కలిపి రూ.116.38 కోట్లు, యువజన సర్వీసులకు రూ.24.35 కోట్లు, సాంస్కృతిక శాఖకు రూ.3.29 కోట్లు ఇస్తోంది. రూ.60 కోట్ల వరకూ 2027లో వచ్చే గోదావరి నది పుష్కరాల పనులకు ఉపయోగించాలని నిర్ణయించింది.

ప్రతి పోలీస్ స్టేషన్‌కు కొత్త వాహనం



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీసు స్టేషన్లలో పదేళ్లకు పైగా వాడుతున్న డొక్కు జీపులకు మోక్షం లభిస్తోంది. బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో సుమారు 3వేల వాహనాల కొనుగోలు చేయనున్నారు. పోలీసుల వాహనాలు పాతబడి పోయాయని, మరో నాలుగేళ్లలో 3వేలకు పైగా వాహనాలను పక్కకు పెట్టాల్సి వస్తుందంటూ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

నేతన్నకు ఏప్రిల్ 1 నుంచి ఉచిత విద్యుత్



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాల కార్మికులకు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించనుంది. ఎన్నికల సమయంలో చేనేతలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అందులో భాగంగా రాష్ట్రంలో అర్హులైన నేత కుటుంబాల ఎంపిక పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో నేతన్నల ఉచిత విద్యుత్‌కు సంబంధించి నిధులు కేటాయించడంతో ఏప్రిల్ 1 నుంచి ఈ పథకం అమల్లోకి రాబోతోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై నేతన్నల కుటుంబాల తరపున చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే గాడిలోకి!

- కేంద్రం సహకారంతో మెరుగైన బడ్జెట్
- అన్ని రంగాలకూ న్యాయం: చంద్రబాబు



మంగళగిరి చీరలకు లోకేశ్ బాగా బ్రాండింగ్ కల్పిస్తున్నారు. బడ్జెట్ వేళ మహిళా ఎమ్మెల్యేలంతా ఒకే రకమైన చీరలతో రావడం ఐక్యతకు నిదర్శనంగా బాగుంది. - సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర సహకారంతో మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని, ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని రంగాలకు న్యాయం చేస్తూ సమతుల్యమైన బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. అసెంబ్లీ లాబీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ విధ్వంసం నుంచి కోలుకోవాలంటే ఇంకా సమయం పడుతుందని, ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతున్నామని అన్నారు. సమస్యలు ఇంకా చాలా ఉన్నాయని, ఆదాయం తక్కువ.. ఖర్చులు ఎక్కువ.. ఇది వారసత్వంగా వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. 'వ్యవసాయం నుంచి ఎక్కువ ఆదాయం రావాలి. సేవల రంగంలోనూ ఆదాయం పెరగాలి. వచ్చే 2-3 ఏళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతాం' అని చెప్పారు. ఒంగోలు పాలకు.. అనంతపురం పండుకు.. ఎంతో డిమాండ్ ఉందని. ఈ రెండింటి రుచీ మరెక్కడా రాదన్నారు. రెండు మూడేళ్లలో అమరావతికి ఒక రూపం వస్తుందని, రాజధాని దారులను జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నామని.. అమరావతికి రాకపోకలు పెరిగి రాబడి కూడా వస్తుందని చెప్పారు. 'రాయలసీమ ముఖచిత్రం మార్చింది మేమే.. సీమ ఉద్యాన హబ్‌కు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై ఎమ్మెల్యేలు సంతోషంగా ఉన్నారు. ఈ ప్రాంతంలో ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరికే పరిస్థితి లేదు. 2014-19 మధ్య కూడా రెయిన్ గన్స్‌తో పంటలను కాపాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడే హంద్రీ-నీవా సుజల స్రవంతిని సీరియస్‌గా తీసుకున్నాం. ఆ ఫలితాలు ఇప్పుడు చూస్తున్నాం' అని వివరించారు.


మూడోసారి గేట్స్‌ను తీసుకొస్తున్న

బిల్ గేట్స్ సోమవారం అమరావతికి వస్తున్నారని సీఎం చెప్పారు. ఆయన్ను రాష్ట్రానికి మూడుసార్లు తీసుకొచ్చిన ఘనత తనదేనన్నారు. 'తొలిసారి హైటెక్ సిటీ, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం వచ్చారు. ఇప్పుడు సంజీవని పథకం కోసం వస్తున్నారు. దీనికి సంబంధించి ఆర్టీజీఎస్‌లో కార్యక్రమం రూపొందించాం' అని తెలిపారు. 'హైదరాబాద్‌లో ఒకప్పుడు జూబ్లీహిల్స్ దాటితే మొత్తం అడవిలా ఉండేది. 1982లో జూబ్లీహిల్స్‌లో ఇప్పుడు బాలకృష్ణ ఉంటున్న ఇంటి స్థలంలో నాకు ఇల్లు కట్టిస్తానని ఎన్టీఆర్ చెప్పారు. అప్పుడు నేను స్థలం చూడడానికి వెళ్తే.. మొత్తం అడవిలా ఉంది.. అక్కడకు ఆటోలు కూడా రావని.. పెద్దాయనతో సున్నితంగా వద్దని చెప్పా. ఆ తర్వాత అక్కడ బాలకృష్ణకు ఇల్లు కట్టించి ఇచ్చారు. నాలుగేళ్లలోనే అక్కడి పరిస్థితులు మారిపోయాయి. బాలకృష్ణ చెన్నైలో ఉంటే నేను 4 ఏళ్లు అదే ఇంట్లో ఉన్నా. జూబ్లీహిల్స్‌లోనే అక్కడకు సమీపంలో నా ఇల్లు పూర్తయ్యాక అక్కడకు మారాను. అమరావతి అభివృద్ధిలోనూ ఇలాంటి గణనీయ మార్పులే ఉంటాయి' అని సీఎం స్పష్టంచేశారు.

ఇకపై నిక్కచ్చిగా ఉంటా..

ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో ఇచ్చే నివేదిక ద్వారా వారిని వారికి అద్దంలో చూపిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. 1995-96లో మాదిరిగానే ఇప్పుడూ నిక్కచ్చిగా ఉంటానని.. మారకపోతే వాళ్లకే నష్టమని స్పష్టంచేశారు. 'మొత్తం 9 పారామీటర్లలో సర్వే చేయించి నివేదిక ఇస్తున్నా. వారికి తెలియని ఇంకొన్ని పారామీటర్లు కూడా నా వద్ద ఉన్నాయి. లోకేశ్ పని లోకేశ్ చేస్తున్నారు. నా పని నేను చేస్తున్నా. నేతలతో మానం సంబంధం, మోటివేషన్.. రెండూ భయం-భక్తిలా ఉండాలి' అని వ్యాఖ్యానించారు.

అభివృద్ధి వ్యయం పెరిగింది!



పల్లె సీమకు బాసట

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 22941 కోట్లు

- ఉపాధి హామీ స్థానంలో వీబీ-జీరామ్‌జీ
- నిరంతరాయంగా కొనసాగింపునకు రూ. 8,365 కోట్లు
- జలజీవన్ మిషన్‌ను భుజానికెత్తుకున్న రాష్ట్రం
- ఆర్‌డబ్ల్యూఎస్‌కు ఇచ్చిన 5,079 కోట్లలో 4000 కోట్లు ప్రతి ఇంటికీ కొళాయి కోసమే...



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పల్లెలకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలిచింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా పథకాల అమలులో దూకుడుగా ఉండబోతున్నాయి. ఆమేరకు కేటాయింపుల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. బడ్జెట్‌లో ఆ శాఖకు రూ.22,941 కోట్లు కేటాయించారు. స్వర్ణ గ్రామ, వార్డు శాఖకు కేటాయించిన రూ.3,761 కోట్లతో కలిపి... పంచాయతీరాజ్ శాఖలోని పీఆర్ ఇంజనీరింగ్, రాష్ట్ర ఎన్నికల కమిషన్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలకు మొత్తంగా రూ.15,485 కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధి శాఖలోని సెర్ప్, పీఎంకేఎస్‌వై, వీబీ-జీరామ్‌జీ, ఎన్ఆర్ఎల్ఎం విభాగాలకు మొత్తంగా రూ.11,217 కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ప్రధానమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం స్థానంలో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ గ్రామీణ్(వీబీ-జీరామ్‌జీ) పథకం అమలులోకి వస్తోంది. ఆ పథకం మార్గదర్శకాల ప్రకారం గతం కంటే భిన్నంగా రాష్ట్ర వాటా పెరిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రీత్యా భారమైనప్పటికీ ఈ పథకం అమలును కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో జీరామ్‌జీకి రూ.8,365 కోట్లు కేటాయించారు. దీనిలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.5,295 కోట్లు కేటాయిస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.3,070 కోట్లు కేటాయించనుంది. గత ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ వినియోగించుకోవడంలో విఫలమయింది. కూటమి సర్కార్ తిరిగి ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి తగిన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద భగీరథ యత్నం చేసింది. అయితే కేంద్రం ససేమిరా అనడంతో రాష్ట్ర ప్రభుత్వమే ఈ బృహత్తర కార్యక్రమాన్ని భుజానకెత్తుకుంది. కేంద్రం నుంచి పైసా రాకపోయినా ఇంటింటికీ కొళాయి నీరు అందించే జలజీవన్ మిషన్ పథకాన్ని కొనసాగించేందుకే నిర్ణయించింది. ఆమేరకు బడ్జెట్‌లో రూ.4,000 కోట్లు కేటాయించింది. పంచాయతీరాజ్ శాఖలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రూ.22 కోట్లు కేటాయించారు. స్వచ్ఛభారత్ గ్రామీణ్ అమలుకు కేంద్రం నుంచి రూ.523 కోట్లు వస్తాయని చూపిస్తూ... రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.186 కోట్లు కేటాయించింది. వాటర్‌షెడ్ అభివృద్ధి కోసం పీఎంకేఎస్‌వై పథకం కింద రూ.190 కోట్లు, ఈ ఏడాది మార్చి 31తో ముగియనున్న ఉపాధి హామీ పథకం చెల్లింపుల కోసం రూ.100 కోట్లు, సోషల్ ఆడిట్ కోసం రూ.20 కోట్లు కేంద్రం నుంచి వస్తాయని ఆశిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖలో భాగమైన గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమం(సెర్ప్) కోసం రూ.941 కోట్లు కేటాయించారు.



మంత్రివర్గ సమావేశంలో సీఎం బాబు, డిప్యూటీ సీఎం పవన్

గ్రామం నుంచి గ్లోబల్ స్థాయికి..!

- 360 డిగ్రీల గ్రోత్ మోడల్ బడ్జెట్: పవన్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామం నుంచి గ్లోబల్ స్థాయి వరకూ.. విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, యువత, మహిళా సాధికారత, సాంకేతికత.. ఇలా అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే 360 డిగ్రీల సమతుల్య గ్రోత్ మోడల్‌గా రాష్ట్ర బడ్జెట్ రూపుదిద్దుకుందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర బడ్జెట్‌పై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం, సంక్షేమంతో కూడిన అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామన్నారు. 'చంద్రబాబు నేతృత్వంలో 360 డిగ్రీల్లో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బలమైన పునాది వేసేలా.. రూ.3.22 లక్షల కోట్ల వ్యయంతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.22,942 కోట్ల కేటాయింపులు జరపడం ద్వారా రాష్ట్రాభివృద్ధిలో గ్రామాల పాత్ర కీలకమనే విషయాన్ని ఎన్డీఏ ప్రభుత్వం పునరుద్ఘాటించింది. పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలకు 714 కోట్లు కేటాయించింది' అని చెప్పారు.



ఆరోగ్యం.. పెరిగింది

- బడ్జెట్‌లో ఆరోగ్య శాఖకు 19,306 కోట్లు.. గత బడ్జెట్ కన్నా 9.5% ఎక్కువగా నిధులు
- వైద్య విద్యకు పెద్దపీట.. 9 వేల కోట్లకు పైగా కేటాయింపు
- కుటుంబ సంక్షేమానికి 5,352.62 కోట్లు.. కొత్త మెడికల్ కాలేజీలకు 1,419 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచింది. శనివారం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.19,306.03 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్ సవరించిన అంచనాలతో పోల్చితే రూ.1,669 కోట్లు అదనంగా నిధులిచ్చింది. గత కేటాయింపుల కంటే 9.5 శాతం అధికంగా ఆరోగ్యశాఖకు నిధులు అందించింది. వైద్య ఆరోగ్య రంగానికి కేటాయించిన నిధుల్లో వైద్య విద్యా విభాగానికి రూ. 9,380.73 కోట్లు, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.5,352.62 కోట్లు, ప్రజారోగ్య సంక్షేమ శాఖకు రూ.2,582.66 కోట్లు, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు రూ. 1,549.11 కోట్లు, ఆయుష్ విభాగానికి రూ.385.25 కోట్లు, ప్రివెంటివ్ మెడిసిన్‌కు రూ.21.44 కోట్లు, ఔషధ నియంత్రణ మండలికి రూ.25.63 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇక బడ్జెట్‌లో కొత్త మెడికల్ కాలేజీలకు రూ.1,419 కోట్లు, నర్సింగ్ కాలేజీకు రూ. 105.98 కోట్లు, 108 అంబులెన్సులకు రూ. 222.24 కోట్లు, 104 (మొబైల్ మెడికల్ యూనిట్స్) వాహనాలకు రూ. 128.49 కోట్లు ప్రతిపాదించారు. గిరిజన ప్రాంతాల్లో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుకు రూ.110 కోట్లు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటుకు రూ.250 కోట్లు ఇచ్చారు. రోగులకు అందించే మందులు, సర్జికల్ సామగ్రికి రూ.600 కోట్లు కేటాయించింది. అయితే మందులకు మాత్రం కేటాయింపులు పెరగలేదు. కొత్తగా ప్రారంభించే ఎన్టీఆర్ బేబీ కిట్స్ పథకానికి రూ.51.14 కోట్లు ప్రతిపాదించారు. మౌలిక సదుపాయాల కల్పనకు పీఎం ఆయుష్మాన్ భారత్ మిషన్‌కు దాదాపు రెట్టింపు పెంచి రూ.830.75 కోట్లు కేటాయించారు. గతంలో దీనికి రూ.421 కోట్లు ఇచ్చారు. ఈ నిధులతో క్రిటికల్ కేర్ బ్లాక్‌లు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్ నిర్మిస్తారు.

వైద్య సేవ ట్రస్ట్ నిర్వహణ ఎలా?

ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు రూ. 4 వేల కోట్లు, ఇది కాకుండా ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌కు రూ. 180 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ప్రస్తుతం ట్రస్ట్ నిర్వహణకు ఏడాదికి దాదాపు రూ.4,500 కోట్ల వరకూ అవసరం అవుతున్నాయి. ఇది కాకుండా ప్రస్తుతం నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.2,800 కోట్ల బకాయి ఉంది. వీటికే రూ.7,300 కోట్ల వరకూ నిధులు కావాల్సి ఉంది. కానీ బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లే ఇవ్వడంతో ఎన్టీఆర్ వైద్య సేవ నిర్వహణ ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సంజీవనికి నిధులేవీ?

సంజీవనీ పథకాన్ని గేమ్ చేంజర్‌గా ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ కింద రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు చేస్తామని హామీ ఇస్తోంది. కానీ 2026-27 బడ్జెట్‌లో సంజీవనికి, యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సంజీవని కార్యక్రమానికి ఏడాదికి రూ.200 కోట్లు, హెల్త్ స్క్రీనింగ్‌కు దాదాపు రూ.300 కోట్ల వరకూ నిధుల అవసరం ఉంది. బడ్జెట్‌లో ఈ పథకాలకు నిధులు ఇవ్వకపోవడంతో ఈ పథకాల నిర్వహణ ఎలా అన్నది వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారింది.

న్యాయ శాఖకు రూ.1,352 కోట్లు

రాష్ట్ర బడ్జెట్‌లో న్యాయ శాఖకు రూ.1,352.49 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.1,222.03 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో అదనంగా రూ.130.36 కోట్లు కేటాయించారు. హైకోర్టు భవన పనుల నిమిత్తం రూ.30 కోట్లు, న్యాయవాదుల సంక్షేమ సంఘాల కోసం రూ.32 కోట్లు, బాధితుల పరిహార పథకం కోసం రూ.2 కోట్లు, కోర్టు భవనాల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం రూ.180.50 కోట్లు కేటాయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 27 కోర్టు హాళ్లు, 15 నివాస గృహ సముదాయాల నిర్మాణానికి రూ.216.27 కోట్ల పరిపాలనా అనుమతులు ఇచ్చారు. న్యాయవాదుల సంక్షేమం కోసం మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.46 కోట్ల మొత్తాన్ని 1,150 మంది మరణించిన న్యాయవాదుల కుటుంబాలకందించామని మంత్రి ఫరూక్ తెలిపారు.

క్వాంటమ్‌కు రూ.638 కోట్లు

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్, పారిశ్రామిక అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. అమరావతిలో మొట్టమొదటిసారిగా క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో బడ్జెట్‌లో రూ.638 కోట్లు కేటాయించారు. క్వాంటమ్ కంప్యూటర్‌ను ఈ ఏడాది అంతానికి అమరావతిలో ఏర్పాటు చేయనున్నారు. పారిశ్రామిక ప్రగతిలో భాగంగా ఓడరేవులు, రహదారులు, విమానాశ్రయాల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.13,546 కోట్లు కేటాయించారు. ఎంఎస్ఎంఈలు, ఇండస్ట్రియల్ ప్రోత్సాహకాలకు రూ.3,161 కోట్లు, పరిశ్రమలు, విమాన రవాణాకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద రూ.1,500 కోట్లు కేటాయించారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఈ ఏడాదే ప్రారంభించనున్నారు. దుగరాజపట్నం ఓడరేవు పనులనూ ప్రారంభిస్తారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు

ఒకే రంగు చీరలో తళుక్కు..!

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శనివారం మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు ఒకే రంగు చీరలు ధరించి సభకు వచ్చారు. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ఫొటోలు దిగారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో గ్రూప్ ఫొటో దిగారు.

సచివాలయంలో పదోన్నతులు

- సీఎం చంద్రబాబుకు 'అప్సా' కృతజ్ఞతలు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్లను అసిస్టెంట్ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించడానికి డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపింది. దీంతో 80 మంది సెక్షన్ ఆఫీసర్లకు(ఎస్‌వోలకు) అసిస్టెంట్ సెక్రటరీలు(ఏఎస్‌లు)గా పదోన్నతి లభించే అవకాశం ఏర్పడింది. దీనిలోభాగంగా 59 మంది ఎస్‌వోలకు ఏఎస్‌లుగా పదోన్నతి కల్పించారు. మిగిలిన వారికి త్వరలో ఖాళీలను బట్టి పదోన్నతులు లభిస్తాయి. సీనియారిటీ సమస్య వల్ల మూడేళ్ల నుంచి ఈ పదోన్నతులు నిలిచిపోయాయి. సీఎం చంద్రబాబు చొరవతో అడహక్ పద్ధతిలో పదోన్నతులు కల్పించారు. ఇటీవల సుమారు 30 మందికిపైగా మిడిల్ లెవల్ ఆఫీసర్ పోస్టులకు పదోన్నతులు కల్పించారు. దీనిపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చొరవ చూపిన సీఎం చంద్రబాబుకు, సీఎస్‌కు, జీఏడీ ఉన్నతాధికారులకు ఏపీ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి.రామకృష్ణ, కార్యవర్గ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



బీచ్ ఫెస్టివల్‌కు హాజరైన జనం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. పాకల బీచ్ ఫెస్టివల్

ఒంగోలు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకలలో బీచ్ ఫెస్టివల్ సందడి సందడిగా సాగింది. శివరాత్రి సందర్భంగా శని, ఆదివారాల్లో ఈ ఉత్సవాలను ఏపీ టూరిజం కార్పొరేషన్, మారిటైం బోర్డు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఉదయం ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, కలెక్టర్ రాజాబాబు తదితరులు ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజయేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్‌లతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, కీలక నేతలు పాల్గొన్నారు. పగటిపూట హెలికాప్టర్ రైడ్, బోట్, హార్స్ రైడింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం బీచ్ వాలీబాల్, కబడ్డీ వంటి పోటీలు, అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరగ్గా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది తరలివచ్చి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. పెద్ద ఎత్తున స్టాల్స్‌తోపాటు ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయడంతోపాటు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇక్కట్లకు అవకాశం లేకుండా భారీ పోలీసు బందోబస్తు, గజ ఈతగాళ్లతో అవసరమైన చర్యలు చేపట్టారు. టికెట్ ధర ఎక్కువే అయినా.. హెలికాప్టర్ రైడ్‌కు ప్రజలు ఆసక్తిచూపడం విశేషం.



అసెంబ్లీకి వచ్చిన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన విద్యార్థులు తమ ఎమ్మెల్యే శ్రీరామ తాతయ్యతో కరచాలనం చేస్తున్న దృశ్యం

విద్యార్థులూ ఎమ్మెల్యేలు అవుతామంటున్నారు!

- భావి నేతలకు ప్రజాస్వామ్య దేవాలయంపై అవగాహన: స్పీకర్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజామోదంగా అసెంబ్లీ నిర్వహిస్తున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీ కార్యకలాపాలు చూసేందుకు విద్యార్థులను అనుమతిస్తున్నామని, వారు ఇక్కడ అసెంబ్లీ నిర్వహణ చూసి.. తాము కూడా భవిష్యత్తులో ఎమ్మెల్యేలు అవుతామని అంటున్నారని, ఇది చాలా సంతోషకరమైన విషయమన్నారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో స్పీకర్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. సీఎం, డిప్యూటీ సీఎం సలహా మేరకు పాఠశాల విద్యార్థులకు సభా కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని కల్పించామన్నారు. దీనికి అద్భుతమైన స్పందన లభిస్తోందని, ఇప్పటి వరకు దాదాపు 150 పాఠశాలల నుంచి దరఖాస్తులు అందాయని, గత నాలుగు రోజుల్లోనే 22 స్కూళ్లకు చెందిన 798 మంది విద్యార్థులు సభను సందర్శించారని తెలిపారు. సభను సందర్శించిన విద్యార్థులు ఎంతో స్ఫూర్తి పొందుతున్నారని, ప్రజాప్రతినిధులుగా మారి దేశానికి సేవ చేయాలని కోరుకుంటున్నట్లు వారు చెబుతుండటం చాలా సంతోషం కలిగిస్తోందన్నారు.

అసెంబ్లీకి పలువురు ఎంపీల రాక

మరోవైపు సభకు విచ్చేసిన ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు, సీఎం రమేశ్‌తోపాటు నేతలు తంగిరాల ప్రసాద్, బీటెక్ రవి, మల్లికార్జున్‌రెడ్డికి సభ తరపున స్పీకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాధారణ, వ్యవసాయ బడ్జెట్‌పై ఈ నెల 17, 18 తేదీల్లో సుదీర్ఘ చర్చ జరుగుతుందని అన్నారు. 15, 16 తేదీల్లో సభకు విరామమని, సభ్యులందరూ ఈ సమయాన్ని బడ్జెట్ ప్రతిపాదనలపై పూర్తి అవగాహన పెంచుకోవడానికి, అధ్యయనం చేయడానికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాహస హారం.. సాగర తీరం

- ఐఎఫ్ఆర్, మిలాన్‌లకు విశాఖ సిద్ధం
- నేటి నుంచి 25వ తేదీ వరకూ కార్యక్రమాలు
- విన్యాసాల్లో 72 దేశాలు.. 60 యుద్ధనౌకలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం సాగరతీరం యుద్ధనౌకలతో కళకళలాడుతోంది. ఆర్‌కే బీచ్‌లో కనుచూపు మేర అంతా అవే కనిపిస్తున్నాయి. తీరంలో రిహార్సల్స్ చేస్తూ ట్యాంకర్లు దుమ్ము రేపుతున్నాయి. ఆకాశంలో యుద్ధ విమానాలు, నేవీ హెలికాప్టర్లు దూసుకుపోతున్నాయి. ఆదివారం నుంచి 25వ తేదీ వరకు జరిగే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలాన్-2026 కార్యక్రమాలకు సర్వం సిద్ధమైపోయింది. పదేళ్ల తర్వాత మరోసారి విశాఖలో నిర్వహిస్తున్న ఐఎఫ్ఆర్‌కు ఈసారి 72 దేశాలు, 60 యుద్ధనౌకలు హాజరవుతున్నాయి. అగ్రదేశాలు అమెరికా, రష్యా కూడా హాజరుకావడం విశేషం. జర్మనీ, ఫిలిప్పీన్స్, అరబ్ ఎమిరేట్స్ నుంచి తొలిసారిగా యుద్ధనౌకలు పాల్గొంటున్నాయి. చైనా, టర్కీ దేశాలను ఈ కార్యక్రమాలకు భారత్ ఆహ్వానించలేదు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రత్యేక పాత్ర పోషించిన యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఐఎఫ్ఆర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఉత్తర అరేబియా సముద్రంలో మోహరించి పాక్‌ను వణికించిన విక్రాంత్ ఇప్పుడు విశాఖ తీరంలో ప్రపంచ దేశాలకు తన శక్తిసామర్థ్యాలు ప్రదర్శించేందుకు విచ్చేసింది. ఈనెల 18న జరిగే ఐఎఫ్ఆర్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు హాజరవుతారు. 19న బీచ్‌లో జరిగే ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతారు. మిలాన్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామాన్ని సందర్శిస్తారు. మిలాన్‌లో ఎక్కువగా సాంకేతిక అంశాలపై మిత్రదేశాలు పరస్పరం చర్చించుకొని, సహకరించుకోనున్నాయని నేవీ వర్గాలు తెలిపాయి.





Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.